www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

7th ANNIVERSARY 22nd October, 2025

సంపుటి 08, సంచిక: 351 | శనివారం | 22-11-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

రూ.5 లక్షల కోట్ల భూ కుంభకోణం

కెటిఆర్ చెప్పేవి పచ్చి అబద్ధాలు

ఐబొమ్మ రవిపై ఐదు కేసులు..

03




## బూటకపు ఎన్‌కౌంటర్లు నిలిపివేసి

# శాంతి చర్చలు జరపండి

- మోదీ, షాలు ఊచకోతకు పాల్పడుతుంటే సుప్రీంకోర్టు మౌనం బాధాకరం
- నక్సల్స్‌పై హత్యాకాండను నిరసిస్తూ సంతకాల సేకరణ చేపడతాం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడి
- లిబర్టీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష, రాజకీయపార్టీలు, మేధావులు, ప్రజాసంఘాలు, పౌరహక్కుల ప్రతినిధుల నిరసన ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మనుషుల ఉచకోతకు పాల్పడుతుంటే, సుప్రీంకోర్టు మౌనంగా ఉండడం బాధాకరమని, ఇప్పటికైనా బూటకపు ఎన్‌కౌంటర్లను న్యాయ వ్యవస్థ సుమోటోగా స్వీకరించి సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టనున్నట్టు వెల్లడించారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తానని ప్రకటించిన కేంద్ర మంత్రి అమిత్‌షా, ముందుగా దేశంలోని అవినీతిని, నిరుద్యోగాన్ని, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని అంతం చేయడం సవాల్‌గా తీసుకోవాలని సూచించారు. "మావోయిస్టులను బిజెపి ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా తరువాయి 2లో

మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఓ కట్టుకథ
మావోయిస్టులు లేఖ విడుదల
03

## కార్మికశక్తిపై

# సమ్మెట పోటు



- నాలుగు లేబర్‌కోడ్‌ల అమలు
- ఇకపై పాత 29 కార్మిక చట్టాలుండవు
- కార్పొరేట్ యాజమాన్యాలు చెప్పిందే వేదం

### కార్మిక సంస్కరణల పేరుతో హక్కుల కోత

**న్యూఢిల్లీ:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అదును చూసి దెబ్బకొట్టింది. ప్రతి కార్మికుడికి గౌరవాన్ని కల్పించాలన్న పేరుతో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ శుక్రవారం నుండి దేశంలో నాలుగు కార్మిక స్మృతులను (లేబర్ కోడ్‌లను) అమలులోకి తెచ్చినట్లు ప్రకటించింది. దీంతో ప్రస్తుతం అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలు రద్దవుతాయి. పాత చట్టాలను హేతుబద్ధీకరిస్తామని చెప్పడం ఒక సాకుమాత్రమే. ఇకముందు కార్పొరేట్ యాజమాన్యాలు చెప్పిందే వేదం కానున్నది. కార్మిక సంస్కరణల పేరుతో హక్కులకు కోతపడనున్నది. వేతనాల కోడ్2019, పారిశ్రామిక సంబంధాల కోడ్2020, సామాజిక భద్రత కోడ్ 2020, వత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్2020 అనే నాలుగు కార్మిక కోడ్‌ల పేరిట సరికొత్త కార్మిక నిబంధలను తీసుకువచ్చింది. ఈ కొత్త కార్మిక చట్టాలు పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైనవిగా ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తిన విషయం విదితమే. పైగా ఎఐటియుసితో సహా పది కేంద్ర కార్మిక సంఘాలు ఈ కోడ్‌లను వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. బిహార్ ఎన్నికల విజయంతో ఏ చట్టాలు అమలు చేసినా తిరుగులేదన్న భావంతో బిహార్‌లో ప్రభుత్వం ఏర్పడిన రెండోరోజే ఈ నాలుగు కార్మిక కోడ్‌లను అమల్లోకి తెచ్చింది. కాగా, ఈ కార్మిక కోడ్‌లను తక్షణమే వెనక్కి తీసుకోవాలని 10 కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఇలా దొడ్డిదారిన అమలు చేయడం కార్మికులకు విద్రోహం చేయడమేనని వ్యాఖ్యానించాయి. వీటి అమలును అడ్డుకుంటామని, దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించాయి.

కార్మిక నిబంధనలను ఆధునీకరించడం, కార్మికుల సంక్షేమాన్ని మెరుగుపరచడం, అభివద్ధి చెందుతున్న పని ప్రపంచంతో కార్మిక పర్యావరణ వ్యవస్థను సమలేఖనం చేయడం ద్వారా, నేటి శ్రామిక శక్తిని భవిష్యత్ కోసం తయారు చేయడమే ఈ కోడ్‌ల లక్ష్యమని, ఆత్మనిర్భర్ భారత్ కోసం కార్మిక సంస్కరణలను నడిపించే బలీయమైన పరిశ్రమలకు ఈ కోడ్‌లు పునాది వేస్తుందని కార్మిక శాఖ ఈ సందర్భంగా పేర్కొంది.

కార్మికులకు మరిన్ని హక్కులను కల్పించడం, మహిళా కార్మికులకు నైట్ షిఫ్ట్ పనితోపాటు మరింత భద్రత చేకూర్చడం, 40 ఏళ్లు దాటిన కార్మికులకు ఉచిత వార్షిక ఆరోగ్య తనిఖీలు, పాన్‌ఇండియా ఇఎస్‌ఐ కవరేజి పేరుతో ప్రమాదకర ప్రాసెసింగ్ యూనిట్లకూ ఇఎస్‌ఐసిని వర్తింపజేయడం, కంపెనీలకు సింగిల్ రిజిస్ట్రేషన్, లైసెన్స్, తరువాయి 2లో

### 26న నిరసనలకు కేంద్ర కార్మిక సంఘాల పిలుపు

బానిసత్వం దిశగా దేశం అడుగులు వేస్తోందని, లేబర్ కోడ్ల అమలులో భావితరాల ఆశలు, ఆకాంక్షలు ఆవిరవుతాయని, వినాశకర పరిణామాలు తప్పబోవని కేంద్ర కార్మిక సంఘాలు హెచ్చరించాయి. కార్మిక కోడ్లను తక్షణమే రద్దు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. వీటిని అమలు చేయడం శ్రామిక వర్గంపై యుద్ధం ప్రకటించడమే అవుతుందని, దీనికి నిరసనగా కార్మికశ్రామిక వర్గం పోరు బాట పట్టాలని పిలుపునిచ్చాయి. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు (సిటియులు) శుక్రవారం ఐక్య ప్రకటన విడుదల చేశాయి. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాస్తూ, బానిసత్వంలోకి కార్మికులను నెట్టే విధంగా నాలుగు కోడ్ల అమలునకు కేంద్రం సిద్ధమైందని దుయ్యబట్టాయి. లేబర్ కోడ్ల అమలును వ్యతిరేకిస్తూ ఈనెల 26న రైతులతో కలిసి పోరాటానికి పిలుపునిచ్చాయి. కార్మిక లోకం గర్జన తప్పబోదని సూచించాయి. పోరాటంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, కోడ్‌ల రద్దునకు బిగ్గరగా డిమాండ్ చేయాలని కార్మిక వర్గానికి ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, తరువాయి 2లో



## నగరానికి రాష్ట్రపతి

ద్రౌపది ముర్ముకు బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘనస్వాగతం

ప్రజాపక్షం/హైదరాబాద్

సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవాన్ని (రెండవ ఎడిషన్) ప్రారంభించడానికి హైదరాబాద్‌కు వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా స్వాగతం పలికింది. బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛాలందించి దుశ్శాలువాతో ఘనంగా స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి బి.శివధర్ రెడ్డితో పాటు త్రివిధ దళాల అధికారులు, నగర ప్రముఖులు రాష్ట్రపతికి స్వాగతం పలికారు.




## దేశంపై మతోన్మాద భూతం

- తరిమికొట్టాల్సిన బాధ్యత ఎర్రజెండాలదే
- మరో వందేళ్లు కూడా ప్రజలతో మమేకం : కూనంనేని, చాడ

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

దేశంపై మతోన్మాద భూతం రాజ్యమేలుతోంది, ఎర్రజెండాలన్నీ ఏకమై ఆ కాషాయి భూతాన్ని తరిమికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంత ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్‌లో ప్రారంభమైన బస్సు జాతా మహబూబాబాద్ జిల్లా మీదుగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు రాజీవ్‌నగర్ వద్ద ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా ఇల్లెందు పట్టణంలోకి చేరుకుంది. పాతబస్టాండ్ సెంటర్ వద్ద సభ నిర్వహించారు. అనంతరం కొత్తగూడెం సమీపంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్‌కు జాత చేరుకోవడంతో పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. అక్కడ్నుంచి ర్యాలీగా బయలుదేరి పాల్వంచకు చేరుకుంది.అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం కిన్నెరసాని రోడ్‌లో భారీ బహిరంగ సభ జరిగింది. రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని, చాడా మాట్లాడుతూ మతాలు, కులాల పేరుతో కాషాయం పార్టీ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రజల మాన, ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్నారు. కమ్యూనిస్టులు లేకుండా చేయాలనే కుట్రతో కేంద్రంలోని పాలకులు యోచిస్తున్నారని, అందుకే మావోయిస్టులను సైతం డెడ్‌లైన్ పెట్టి మరీ చంపుతున్నారని మండిపడ్డారు. అడవుల్లో నిక్షిప్తమై ఉన్న అపార ఖనిజ సంపదను కాజేసేందుకు అధికారాన్ని అడ్డు పెట్టుకుని తరువాయి 12లో




## మతఛాందసవాదం అడ్డుకట్టకు కమ్యూనిస్టుల


# ఐక్యత అనివార్యం

### అటవీ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే ఎన్‌కౌంటర్లు

సాంబశివరావు, బాల నర్సింహ్మా, ఎమ్మెల్సీ నెల్లికంటి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

మతోన్మాద ఆగడాలను అడ్డుకట్ట వేయకుంటే దేశం అదోగతి పాలవుతుందని, మితిమీరుతున్న మత ఛాందస వాదాన్ని నిలువరించేందుకు కమ్యూనిస్టుల ఐక్యత అనివార్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నర్సింహ్మా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలునిచ్చారు. సిపిఐ శతవసంత ఉత్సవాలను పురస్కరించుకుని జోగులాంబ గద్వాల్ నుండి ప్రారంభమైన ప్రచార జాతా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలురుపాడు మండలంలోనికి ప్రవేశించింది. నాయకులగూడెం వద్ద తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొమారి రామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించిన అనంతరం సుజాతనగర్ మండలం మీదుగా కొత్తగూడెం నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కొత్తగూడెం పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ ప్రదర్శన సాగింది. అనంతరం పోస్టాఫీస్ సెంటర్లో జరిగిన బహిరంగ సభలో కూనంనేని, బాల నర్సింహ్మా నెల్లికంటి మాట్లాడారు. దేశప్రజలపై మత జోక్యం నానాటికీ పెరిగిపోతోందని, భిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమైన భారతావనిలో కులమతాల చిచ్చు రేపుతూ ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ఓట్లచోరీకి పాల్పడుతూ బిజెపి అధికార తరువాయి 12లో



## 'సుప్రీం' తీర్పు పున:పరిశీలించాలి

బిల్లులకు కాలపరిమితి లేదన్న కోర్టు వ్యాఖ్యలపై సిపిఐ అసంతృప్తి

**న్యూఢిల్లీ:** బిల్లులకు గవర్నర్ల ఆమోదం, రాష్ట్రపతికి సిఫార్సులకు సంబంధించి కాలపరిమితి లేదని సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తాజా తీర్పుపై సిపిఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యం, సహకార సమాఖ్యవాదం బలోపేతం దృష్ట్యా ఈ నిర్ణయాన్ని పున:పరిశీలించాలని పార్టీ జాతీయ కార్యదర్శి వర్గం శుక్రవారం ఒక ప్రకటనలో కోరింది. దేశ ఫెడరల్ వ్యవస్థపై మచ్చలు పడుతూ... కేంద్రీకరణ పెరుగుతున్న తరుణంలో ఇలాంటి తీర్పుతో జవాబుదారీతనానికి హామీ లేకుండా పోతుందని పేర్కొంది. విధానపరమైన నిర్ణయాలను, శాసనసభ తీర్మానాలను నిలుపుదల చేసే అవకాశం ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఉంటుందని హెచ్చరించింది. కాల పరిమితి లేకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాల తీర్మానాలకు గవర్నర్ల ఆమోదం, రాష్ట్రపతికి సిఫార్సుల విషయంలో నిష్క్రియాత్మకత వైఖరి పెరగవచ్చని సిపిఐ తరువాయి 2లో

## 25న కేబినేట్ భేటీ

రిజర్వేషన్లకు చెందిన డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులకు ఆమోదం..?

ప్రజాపక్షం/హైదరాబాద్

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్లకు సంబంధించి బూసాని వెంకటేశ్వర రావు నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను ఈ నెల 25న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోద ముద్ర వేయనుంది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అంశంపై న్యాయపరమైన వివాదాలు ఉన్నందన , 50 శాతానికి రిజర్వేషన్లు మించ కుడా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే రిజర్వేషన్లను 50 శాతానికి మించకుండా సిఫార్స్ చేయాలని మంత్రివర్గం డెడికేటెడ్ కమిషన్ సూచించింది. దీంతో కమిషన్ బిసి,ఎస్‌సి,ఎస్‌టి కోటాన్ని ఖరారు చేస్తూ సిఫార్సులు చేసింది. దీనిపైన మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. కాగా ఈ నెల 24న హైకోర్టు విచారణ జరగనున్న నేపథ్యంలో కోర్టు తీసుకునే నిర్ణయంపైన కూడా మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఉత్సవాలు, అందులో చేపట్టే కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరల పంపిణీ , తెలంగాణ రేజింగ్ 2047 విజన్ తదితర అంశాలపైన మంత్రివర్గంలో చర్చించనున్నారు.



## 42 శాతం రిజర్వేషన్ల అమలుకు

# రాజ్యాంగాన్ని సవరించాల్సిందే

- పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బిల్లు పెట్టాలి
- పార్టీపరంగా కాకుండా చట్టబద్ధంగా బిసి రిజర్వేషన్లు అమలు చేయాలి
- బిసి జెఎసి విస్తృత స్థాయి సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి ఈ పార్లమెంట్ సమావేశాలలోనే రాజ్యాంగ సవరణ చేయాలని, పార్టీ పరంగా కాకుండా చట్టబద్ధంగా బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని పలువురు వక్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లు, సర్పంచ్ ఎన్నికలతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై కాచిగూడలోని ఓ హోటల్‌లో శుక్రవారం బిసి జెఎసి విస్తృతస్థాయి సమావేశం తరువాయి 12లో

## పర్యావరణ సమతుల్యానికి

# అధిక నిధులు కేటాయించాలి

కాప్ 30లో భారత్ సూచన... ముగిసిన సదస్సు



**బెలేం (బ్రెజిల్):** పర్యావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు అధికంగా నిధులు కేటాయించాలని భారత్ సూచించింది. ఈనెల 10వ తేదీన ఇక్కడ ప్రారంభమైన కాప్30 సదస్సు శుక్రవారం (నవంబర్ 21) ముగిసింది. భారత్ తరఫున సదస్సుకు హాజరైన కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ వాతావరణ అనుకూలత కోసం దేశీయ స్థాయిలో కట్టుబడి పనిచేస్తున్నదని అన్నారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఈ విషయంలో పెరుగుతున్న అంతరాన్ని దృష్టిలో ఉంచుకుంటే 'వాతావరణ అనుకూల' నిధులను భారీగా పెంచడం అత్యవసరమని యాదవ్ అన్నారు. 'వాతావరణ అనుకూలత అనేది ఐచ్ఛికం కాదు.. అత్యవసర పెట్టుబడి' అనే స్పష్టమైన రాజకీయ సందేశాన్ని కాప్30 అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 'అడాప్షన్ గ్యాప్ రిపోర్ట్' 2025ని అనుసరించి, వాతావరణ పరిరక్షణ చర్యల కోసం అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారీగా నిధులు అవసరం. 2035 నాటికి ఈ దేశాలకు, సంవత్సరానికి 310 నుంచి 365 బిలియన్ల డాలర్లు కావాల్సి వస్తుంది. కానీ ప్రస్తుత నిధుల ప్రవాహం కేవలం 26 బిలియన్ డాలర్లకు మాత్రమే పరిమితమైంది. ఈ అంశాలను యాదవ్ ప్రస్తావిస్తూ, గ్లాస్గో వేదికగా 2019లో పర్యావరణ సదస్సులో పర్యావరణ అనుకూలత నిధులను 2025 చివరి నాటికి రెట్టింపు చేయాలని తీర్మానించినప్పటికీ, ఈ లక్ష్యం నెరవేరే పరిస్థితులు కనిపించడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బెలేం రోడ్‌మ్యాప్‌లో పేర్కొన్న 1.3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరడానికి ప్రపంచం మొత్తం కలిసి పని చేయాలి అని అన్నారు. వాతావరణ పరిరక్షణకు అభివృద్ధి చెందుతున్న దేశాలు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## దక్షిణ నేపాల్‌లో కర్ఫ్యూ ఎత్తివేత

**ఖట్మండు :** హింసాత్మక సంఘటనల నేపథ్యంలో బుధవారం విధించిన కర్ఫ్యూను శుక్రవారం ఎత్తివేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ, అదుపులోనే ఉందని అధికారులు ప్రకటించారు. మార్కెట్లు, విద్యా సంస్థలు తెరుచుకున్నాయని, రవాణా సేవలు కూడా మొదలుకావడంతో జనజీవనం సాధారణమైందని పేర్కొన్నారు. బుధవారం సిమరా విమానాశ్రయంలో శాంతియుతంగా నిరసన చేస్తున్న 'జెన్ జి' (జెన్ జెడ్) యువకులపై ముగ్గురు సిపిఎన్–యుఎంఎల్ కార్యకర్తలు దాడి చేసినట్లు ఆరోపణలు రావడంతో ఉద్రిక్తత చెలరేగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే 'జెన్ జి'లు, పదవీచ్యుతుడైన మాజీ ప్రధాని కెపి శర్మ ఓలి పార్టీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు చెరేగాయి. కనీసం పది మంది గాయపడ్డారు. యుఎంఎల్ నాయకులు శంకర్ పొఖ్రెల్, మహేష్ బస్నేత్‌ల సందర్శనకు వ్యతిరేకంగా ఈ యువకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరు 8న జరిగిన అణచివేతలో 76 మంది మరణాలకు ఆ పార్టీదే బాధ్యత అని వారు ఆరోపిస్తున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అధికారులు కర్ఫ్యూ విధించారు. ఇప్పుడు పరిస్థితి అదుపులో ఉందని, అందుకే కర్ఫ్యూ ఎత్తివేస్తున్నామని పోలీస్ అధికారులు ప్రకటించారు.

## వైట్‌హౌస్‌కు ఒక 'కమ్యూనిస్టు' వస్తున్నారు

### వైట్ హౌస్ ప్రెస్ సెక్రెటరీ లెవిట్ వ్యాఖ్య




**న్యూయార్క్ / వాషింగ్టన్ :** న్యూయార్క్ సిటీ కొత్త మేయర్‌గా ఎన్నికలైన జోహ్రాన్ మమ్దానిపై వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలైన్ లెవిట్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'వైట్‌హౌస్‌కు ఒక కమ్యూనిస్టు వస్తున్నారు' అని ఆమె వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎవరితోనైనా మాట్లాడేందుకు సిద్ధంగా ఉంటారని కొసమెరుపునిచ్చింది. నవంబర్ 4న ఎన్నికల్లో గెలిచిన తర్వాత, ట్రంప్‌ను కలుసుకోవడానికి మమ్దాని శుక్రవారం వైట్‌హౌస్‌కు వస్తారన్న వార్తపై లెవిట్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో అతిపెద్ద నగరానికి కమ్యూనిస్టు మేయర్‌ను ఎన్నుకున్నారంటూ ఆమె డెమోక్రాట్లపై విమర్శలు గుప్పించారు. అయితే, ట్రంప్ రాజకీయ భేదాలను పక్కనపెట్టి, 'బ్లూ స్టేట్స్', 'రెడ్ స్టేట్స్' అనే తేడా లేకుండా, ఎక్కడి ప్రజలకైనా సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటారని లెవిట్ అన్నారు. ఆ క్రమంలోనే మమ్దానితో ట్రంప్ భేటీ అవుతారని చెప్పిన ఆమె, సమావేశంలో ఏఏ అంశాలపై చర్చ జరుగుతుందనే వివరాలను మాత్రం వెల్లడించలేదు.

అంతకు ముందు మమ్దాని మీడియాతో మాట్లాడుతూ ట్రంప్‌తో అనే విషయాల్లో విభేదిస్తున్నప్పటికీ, న్యూయార్క్ ప్రజలకు ఉపయోగపడే అంశాల్లో, ఆయనతో కలిసి పనిచేస్తానని అన్నారు. న్యూయార్క్ నగరంలోని ఎనిమిదిన్నర మిలియన్ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడానికి ఎవరితోనైనా చర్చిస్తానని, కలిసి సంప్రదింపులు చేస్తానని ఆయన అన్నారు. దేశాధ్యక్షుడిని న్యూయార్క్ మేయర్ కలుసుకోవడం ఒక సంప్రదాయమని కూడా చెప్పారు. భారతీయ మూలాలున్న మమ్దాని న్యూయార్క్ మేయర్ పదవిని గెలుచుకోవడం ద్వారా, అమెరికాలో అతిపెద్ద నగరాన్ని నడిపే తొలి దక్షిణాసియా, తొలి ముస్లిం నాయకుడిగా చరిత్ర సృష్టించారు.

# నిన్న వైద్యం.. నేడు విద్య

### ట్రంప్ మరో వివాదాస్పద నిర్ణయం



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారు. వైద్య రంగానికి భారీగా నిధుల కోత విధించి, వేలాది మంది ఉద్యోగులపై వేటు వేసిన ట్రంప్ ఈసారి విద్యాశాఖకు సంబంధించిన ఓ ప్రణాళికను సిద్ధం చేశారు. 'దేశంలోని విద్యా వెనుకబాటుతనాన్ని నివారించడానికి ఏకైక పరిష్కారం' అంటూ ట్రంప్ చేపట్టిన మార్పుల వల్ల విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేసే ప్రమాదం ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకే వ్యవస్థకు భిన్నంగా వేరువేరు శాఖలు కలిసి పనిచేయాల్సి రావడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతాయని కొందరు విమర్శిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై ప్రభావం పడితే, దేశ సమాఖ్య వ్యవస్థ దెబ్బతింటుందని, విద్యా వ్యవహారాలు మరింత సంక్లిష్టమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంబంధిత వ్యవహారాల్లో ఎక్కువ భాగాన్ని శ్రమ, ఆరోగ్యం, విదేశాంగం అంతర్గత వ్యవహారాల శాఖలకు బదిలీ చేయాలన్నది ట్రంప్ కొత్త నిర్ణయంలోని ప్రధానాంశం. విద్యాశాఖ వైఫల్యాల కారణంగా, బాధ్యతలను ఇతర శాఖలకు కూడా అప్పగించాల్సి వస్తున్నదని ట్రంప్ ప్రభుత్వ వాదన. అయితే, ఈ నిర్ణయం వల్లఫెడరల్ ప్రభుత్వంతో సమన్వయం దెబ్బతింటుందని కొన్ని రాష్ట్రాలు అభిప్రాయపడుతున్నాయి. కాగా, విద్యాశాఖకు సంబంధించిన ట్రంప్ కొత్త ప్రణాళికపై రాజకీయంగా విభిన్న ప్రతిస్పందనలు వచ్చాయి. ఈ నిర్ణయం ఆర్థికంగా వెనుకబాటును ఎదుర్కొంటున్న విద్యార్థులకు తీవ్ర నష్టమని డెమోక్రాట్లు విమర్శించారు. అయితే, రిపబ్లికన్లు మాత్రం ఈ ప్రణాళికలను అధికార యంత్రాంగంపై ప్రభుత్వం సాధించిన గొప్ప విజయంగా అభివర్ణిస్తున్నారు. ఇలావుంటే, అధికార రిపబ్లికన్ పార్టీలోనే ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చర్య విద్యాశాఖను అనిశ్చితిలోకి నెడుతుందని పలువురు రిపబ్లికన్లు హెచ్చరిస్తున్నారు. కాగా, విద్యాశాఖ వైఫల్యాల కారణంగానే కొత్త నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని మంత్రి లిండా మెక్‌మహన్ చెబుతున్నారు. అయితే, పాత వ్యవస్థను మెరుగుపరిచే బదులు కొత్త నిర్ణయాలతో గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారని విమర్శకులు ధ్వజమెత్తుతున్నారు. విద్యా శాఖ చట్టాలు, నిధుల సూత్రాలు వంటి సంక్లిష్ట విషయాల్లో నిపుణుల సలహాలు, సూచనలను ఇక ముందు అందుతాయో లేదనని పాఠశాల అధికారులు ఆందోళన చెందుతున్నారు. కొత్త శాఖలకు భారీ సంఖ్యలో విద్యా కార్యక్రమాలను నిర్వహించే సామర్థ్యం ఉందా? అన్న సందేహాలు కూడా ఉన్నాయి. శ్రమ శాఖకి 18 బిలియన్ డాలర్ల విలువైన టైటిల్ I కార్యక్రమాన్ని బదిలీ చేయడం వల్ల జిల్లాల్లో కల్లోలం సృష్టించవచ్చని మాజీ అధికారులు హెచ్చరిస్తున్నారు. అనేక పాఠశాలలు నిధులతో వచ్చే కొత్త నిబంధనలు ఏవో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అనేక ఫెడరల్ శాఖల్లో చెల్లాచెదురుగా ఉన్న విద్యా కార్యక్రమాలను ఏకీకృతం చేయడానికి 1979లో ప్రత్యేకంగా విద్యాశాఖ ఏర్పాటైంది. ఇప్పుడు ట్రంప్ నిర్ణయం కారణంగా పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఈ కొత్త ప్రణాళిక దేశ విద్యా వ్యవస్థను మెరుగుపరుస్తుందా లేదా మరింత గందరగోళంలోకి నెడుతుందా అన్నది ఇంకా స్పష్టంగా తెలియలేని పరిస్థితి.



## ధాకాను వణికించిన భూకంపం

### నలుగురు మృతి.. దెబ్బతిన్న పలు భవనాలు

**ధాకా :** బంగ్లాదేశ్ రాజధాని ధాకా, దాని పరిసర ప్రాంతాలను శుక్రవారం భూకంపం వణికించింది. దీని తీవ్రత రిక్టార్ స్కేల్‌పై 5.7 మాగ్నిట్యూడ్‌గా నమోదైంది. ఈ భారీ భూకంపంలో, ఒక నవజాత శిశువు సహా కనీసం నలుగురు మరణించారు. పలు భవనాలు దెబ్బతిన్నాయి, కొన్ని ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించాయి. ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అధికారుల సమాచారం ప్రకారం, ధాకాలో ముగ్గురు, నారాయణ్‌గంజ్‌లో ఒకరు మరణించారు. దేశవ్యాప్తంగా కనీసం 50మందికి పైగా గాయపడ్డారని స్థానిక మీడియా తెలిపింది. బంగ్లాదేశ్ వాతావరణ విభాగం ప్రకారం, శుక్రవారం ఉదయం 10:38కి సంభవించిన భూకంపాన్ని ఎపిసెంటర్ ధాకా ఈశాన్య అంచులోని నర్సింగ్‌డి ప్రాంతంలో, 10 కిలోమీటర్ల లోతులో చోటుచేసుకున్నట్లు గుర్తించారు.




# జూనియర్ అధికారికి అప్పగించే ప్రసక్తి లేదు

### జి20 అధ్యక్షత బాధ్యతను ఇవ్వడానికి నిరాకరిస్తున్న దక్షిణాఫ్రికా

**జోహాన్నెస్‌బర్గ్ :** అమెరికా నుంచి వచ్చిన జూనియర్ అధికారి చేతిలో జి20 అధ్యక్షత బాధ్యత అప్పగించబోమని దక్షిణాఫ్రికా తేల్చిచెప్పింది. రెండు రోజుల జి20 సదస్సు శనివారం ప్రారంభం కానుండగా, అమెరికా తరఫున మార్క్ డిలార్డ్ నేతృత్వంలో ఒక బృందం హాజరవుతున్నది. అయితే, ఒక జూనియర్ అధికారికి అధ్యక్ష బాధ్యతను ఎలా అప్పగిస్తామని దక్షిణాఫ్రికా వ్యాఖ్యానించారు. ఆ విధంగా చేయడం అంతర్జాతీయ ప్రోటోకాల్‌కు విరుద్ధమని అధ్యక్షుడు సిరిల్ రామఫోసా తరఫున ప్రతినిధి తెలిపారు. కాగా, ఈ వివాదం అమెరికా–దక్షిణాఫ్రికా మధ్య తాజా ఉద్రిక్తతలకు దారితీసింది. ఇటీవల కాలంలో రెండు దేశాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురించి రామఫోసా అవివేకంగా మాట్లాడుతున్నారంటూ వైట్ హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లెవిట్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అంతకు ముందు ట్రంప్ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, దక్షిణాఫ్రికాలో తెల్లజాతి రైతులపై హింసాకాండ పెరుగుతున్నదని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను దక్షిణాఫ్రికా ప్రభుత్వంతోపాటు, నాయకులు కూడా ఖండించారు. ఇలావుంటే, అమెరికా ప్రతినిధి బృందం జి20 చర్చల్లో పాల్గొనకుండా 2026 సదస్సుకు అధ్యక్షత వహించనున్న కారణంగా, ఆ బాధ్యతను స్వీకరించడానికి మాత్రమే కింది స్థాయి అధికారి నేతృత్వంలో ఒక బృందం జోహాన్నెస్‌బర్గ్ చేరుకుంది. ఈ విషయాన్ని లెవిట్ ధ్రువీకరించారు. జోహాన్నెస్‌బర్గ్‌కు అమెరికా గైర్హాజరు కావాలని తొలుత నిర్ణయించుకుంచుకుందని దక్షిణాఫ్రికా వర్గాలు అంటున్నాయి. అయితే, ఎవరూ రాకపోతే, ఖాళీ కుర్చీకే తదుపరి సదస్సు అధ్యక్ష బాధ్యతను అప్పగిస్తానని రామఫోసా స్పష్టం చేయడం వల్లే, పరువు దక్కించుకోవడానికి అమెరికా ఒక బృందాన్ని పంపిందని వ్యాఖ్యానిస్తున్నాయి. కానీ, ఆ బృందానికి అధికారాన్ని అప్పగించే ప్రసక్తి లేదని స్పష్టం చేస్తున్నాయి.

## కార్మిక సంఘాల పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

యూటీయూసీ సంయుక్తంగా పిలుపునిచ్చాయి. కార్మిక వ్యతిరేకయాజమాన్యం అనుకూల లేబర్ కోడ్లను ఏకపక్షంగా రుద్దే ప్రయత్నం... కార్మిక వర్గానికి కేంద్రం చేసిన మోసమని దుయ్యబట్టాయి. సంక్షోభంగా మారుతున్న నిరుద్యోగం, దిగిరాని ద్రవ్యోల్బణం పరిస్థితుల్లో ఇలాంటి నోటిఫికేషన్లు ఇవ్వడం శ్రామికులపై యుద్ధాన్ని ప్రకటించడమేనని వ్యాఖ్యానించాయి. ఆశ్రిత పెట్టుబడిదారులతో కుమ్మక్కై దేశాన్ని బానిసత్వం వైపునకు సర్కారు తీసుకెళుతోందని కార్మిక సంఘాలు విమర్శించాయి. లేబర్ కోడ్లు అమలు చేయొద్దంటూ డిమాండ్ ఉన్నప్పటికీ లెక్కచేయకుండా బీహార్ ఎన్నికల్లో విజయం మత్తులో ఎన్డీయే ప్రభుత్వం జోగుతోందని పేర్కొన్నాయి. ఈనెల 13, 20 తేదీల్లో కార్మిక సంఘాలు చేసిన విజ్ఞప్తులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశాయి. లేబర్ కోడ్లతో పాటు శ్రమ్ శక్తి నీతి2025 రద్దునకు డిమాండ్‌తో ఈనెల 26న తలపెట్టిన ఎస్‌కేఎంసీటీయూల ఉమ్మడి పోరు జయప్రదానికి పిలుపునిచ్చాయి. నిరసన తెలిపేందుకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని కార్మికులకు సంఘాలు సూచించాయి. సోమవారం నుంచి గేట్ మీటింగులు, వీధి కూడళ్లలో సమావేశాలు వంటివి యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ సంక్షేమాన్ని తుంగలో తొక్కి బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నాలను ప్రతిఘటించాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. 20 కేంద్ర కార్మిక చట్టాలను రద్దు చేసి 'రాక్షస' కోడ్లను అమలు చేయడాన్ని ఖండించాయి. వీటి అమలు కార్మికుల జీవితాలు, జీవనోపాధిని చంపేయడమే అవుతుందని కార్మిక సంఘాలు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించాయి.

# 'తెలంగాణ - నార్త్ ఈస్ట్ కనెక్ట్' చిత్రోత్సవం

### తెలంగాణ - ఈశాన్య రాష్ట్రాల సినీ బంధానికి నాంది

### గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా.. 'తెలంగాణ - నార్త్ ఈస్ట్ కనెక్ట్' చిత్రోత్సవం ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రసాద్ ఐమ్యాక్స్‌లో 'తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్' పేరుతో రెండు రోజుల చిత్రోత్సవం హైదరాబాద్ మహానగరంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరయ్యారు. ఆయన చిత్రోత్సవాన్ని ప్రారంభించి, త్రిపుర చిత్రమైన 'యార్వింగ్' తొలి ప్రదర్శనను వీక్షించారు. ఈ చిత్రానికి జాతీయ పురస్కార గ్రహీత ఫాదర్ జోసెఫ్ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సాంస్కృతిక, సాంకేతిక, యువశక్తి, మహిళా సాధికారత, ఐటీ, ఆరోగ్య రంగాల్లో తెలంగాణ ఈశాన్య రాష్ట్రాల మధ్య మరింత సుదీర్ఘ భాగస్వామ్యానికి ఈ వేదిక దోహదం చేస్తుందని తెలిపారు. ఈశాన్య భారత వైవిధ్యం, తెలంగాణ చైతన్యం కలిస్తే మరింత బలోపేతమైన జాతీయ ఐక్యత సాధ్యమవుతుందని చెప్పారు. సినిమా సరిహద్దులు లేని భాష అని, అది ప్రాంతాలు, భాషలు దాటి మనుషులను ఏకం చేస్తుంది అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. డిజిటల్ మీడియా కారణంగా దూర అడవి ప్రాంతాల వరకూ తెలుగు సినిమాలు చేరుతున్నాయని, ఇది సినీ ప్రభావానికి నిదర్శనమన్నారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్. ప్రియాంక అతిథులను స్వాగతించి, టిజిఎఫ్‌డిసి లక్ష్యాలు, కార్యక్రమాల గురించి వివరించారు.

ఈ చిత్రోత్సవం 'తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్' కార్యక్రమంలో కీలక భాగమని, త్రిపుర, మణిపూర్, అస్సాం, మెఘాలయ, సిక్కిం, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 12 చిత్రాలను ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నట్టు వెల్లడించారు. జాతీయ అవార్డులు పొందిన చిత్రాలతో పాటు, తెలంగాణ గ్రామీణ జీవనశైలి, కళారూపాలు, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే తెలుగు చిత్రాలను క్యూరేట్ చేసి ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. రెండు రోజులపాటు 12 చిత్రాలు ప్రదర్శించనున్నారు. ఈశాన్య రాష్ట్రాల నుండి తారా (సిక్కిం నెపాలీ), కుకి (హిందీ), ఓనాతా (ఖాసీ మెఘాలయ), ఈఖోయిగి యుమ్ (మణిపూర్), రాడార్, పక్షులు (అస్సాం) ఉన్నాయి. తెలంగాణ నుండి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు పొందిన నా బంగారుతల్లి, పొట్టేల్, మల్లేశం, బలగం చిత్రాలు ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమములో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, టిజిఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దానా కిషోర్, ఐ అండ్ పిఆర్ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్, ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులు, దర్శకులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

## పున:పరిశీలించాలి

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించింది. అదే పరిస్థితే వస్తే ప్రజల సార్వభౌమాధికారంతో పాటు రాష్ట్రాల విశేషాధికారాలు దెబ్బతింటాయని పేర్కొంది. ఎవరి నుంచి జవాబుదారీతనాన్ని కోరేందుకు ఆస్కారం ఉండబోదని సిపిఐ తెలిపింది. తమిళనాడు రాష్ట్ర గవర్నర్ దీర్ఘకాలం బిల్లులు పెండింగ్ పెట్టి, రాష్ట్రపతికి సిఫార్సు చేయడాన్ని గుర్తు చేసింది. సుప్రీం కోర్టు వైఖరి మారకపోతే ఎన్నికైన ప్రతినిధుల ద్వారా ప్రజల అభిప్రాయాలు, వారి హక్కులు, ఆకాంక్షలకు కీలకమైన న్యాయ రక్షణ బలహీనమవుతుందని పేర్కొంది. విధానపరమైన జాప్యం/విచక్షణాత్మక నిష్క్రియకు అవకాశం ఇవ్వొద్దని కోరింది. తాజా తీర్పును పున:పరిశీలించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని సిపిఐ విజ్ఞప్తి చేసింది.

## శాంతి చర్చలు జరపండి

(మొదటి పేజీ తరువాయి)

చంపడాన్ని'' ఖండిస్తూ 'బూటకపు ఎన్‌కౌంటర్ల వ్యతిరేక పోరాట కమిటీ' ఆధ్వర్యంలో వామపక్ష, రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల ప్రతినిధులు హైదరాబాద్ లిబర్టిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ''ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేననని, కగార్ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా పోరాడాలని, ఎన్‌కౌంటర్లను ఆపాలని, అటవీ సంపదను కాపాడాలని'' వారు ప్లకార్డులను ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం పనిచేస్తూ, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే తాము దేశ ద్రోహులమా?, లేదా ప్రజాధనాన్ని, ఖనిజ సంపదను కొల్లగొట్టే పాలకులు, వేల కోట్ల రూపాయలకు ఎదిగే అంబానీలు, అదానీలు దేశ భక్తులా అని ఆయన నిలదీశారు. మావోయిస్టులను చంపినంత మాత్రానా సమస్య పరిష్కారం కాదని, ముందుగా వారు పోరాటం చేస్తున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్ల పట్ల చాలా మంది ఆవేదనకు ప్రతీకగా తాము నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. మోదీ ప్రభుత్వ అరాచకం తాండవిస్తోందని, రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రశ్నించినందుకు తనపై బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల సోషల్ మీడియాలో స్పందిస్తూ, తనను కూడా చంపాలంటూ పోస్టులు పెడుతున్నారన్నారు. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహాలో ప్రజలే మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు.

టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామిక స్వభావానికి బూటకపు ఎన్‌కౌంటర్లు ఒక గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. కార్పొరేట్ శక్తులకు కేంద్రం మితిమీరిన లాభాలను కల్పిస్తుందని, దీనిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? అని మండిపడ్డారు. రాజ్యాంగానికి, చట్టానికి విరుద్ధంగా బూటకపు ఎన్‌కౌంటర్ చేసినందుకు అధికారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ మావోయిస్టులను చంపేస్తామనడం రాజ్యాంగం, చట్టానికి వ్యతిరేకమన్నారు. మనుషులను చంపే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఎవరిచ్చారని ఆయన నిలదీశారు. కేంద్రం వెంటనే కగార్ ఆపరేషన్‌ను నిలిపివేసి, ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు చనిపోయారని, అలాంటిది పోలీసులకు ఎందుకు గాయాలు కాలేదని, ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో బుల్లెట్ గాయాలు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శివర్గ సభ్యులు సాధినేని వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ దేశంలో మావోయిస్టులను మట్టుపెట్టడం కాకుండా ముందుగా దేశంలో అవినీతి, ఆకలి లేకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందని, అందులో భాగంగానే అడవులలోని ఆదివాసులకు అండగా ఉన్న మావోయిస్టులను హత్య చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో హత్యాకాండను, మానవ వేటను కొనసాగిస్తోందని మండిపడ్డారు.

ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగం, చట్టం ప్రకారం ప్రాణాలు తీసే అధికారం రాజ్యానికి లేదన్నారు. ఒక కేంద్ర మంత్రిగా మావోయిస్టులను చంపేస్తామనడం ఏ రాజ్యభాష అని నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్ అవుతారా? అని నిలదీశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునే బాధ్యత కమ్యూనిస్టులు, ప్రజాతంత్ర వాదులు, ప్రజాస్వామికవాదులు, పౌర సమాజంపై ఉందన్నారు.

హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ ఎన్‌కౌంటర్‌పై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఖనిజాలు కలిగిన 1600 ఎకరాల భూమిని కేంద్ర ప్రభుత్వం కేవలం ఒక రూపాయికే అప్పగించిందన్నారు. కేంద్రం టార్గెట్ పెట్టాల్సింది పేదరికం, అవినీతి, రైతుల ఆత్మహత్య నివారణపై అని సూచించారు.

ప్రొఫెసర్ లక్ష్మణ్, ఎస్‌యుసిఐ(కమ్యూనిస్టు) నాయకులు మురహరి, సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, సిపిఐ(ఎంఎల్) చంద్రన్న గ్రూప్ నాయకులు భాస్కర్ మాట్లాడుతూ ప్రశ్నించే వారికి పౌర సమాజం మద్దతుగా నిలువకపోతే భవిష్యత్తులో అధికారంలో ఉన్నవారిని ప్రశ్నిస్తే ఇంట్లోనే ఎన్‌కౌంటర్లు జరిగే ప్రమాదం పొంచివుంటుందని హెచ్చరించారు. ఇప్పటివరకు పట్టుకన్న మావోయిస్టులను తక్షణమే కోర్టులో హాజరుపర్చి చట్టపరంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ అధ్యక్షత వహించగా, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, ఆర్.అంజయ్య నాయక్, ఎస్.చాయాదేవి, నేదునూరి జ్యోతి, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ, కార్యదర్శి బి.వెంకటేశం, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చలపతిరావు, పిఒడబ్ల్యు నాయకురాలు వి.సంధ్య, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెట పోటు

(మొదటి పేజీ తరువాయి)

రిటర్న్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టడం వంటి ఎన్నో సంస్కరణలు ఇందులో ఉన్నాయని కార్మిక శాఖ ప్రకటించింది. భారతదేశంలోని అనేక కార్మిక చట్టాలు స్వాతంత్రానికి ముందు, స్వాతంత్ర్య ప్రారంభదశలో అంటే 1930–1950 మధ్య రూపొందాయని, ఆ సమయంలో ఆర్థిక వ్యవస్థ, పని ప్రపంచం ప్రాథమికంగా భిన్నంగా ఉన్నాయని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ వెల్లడించిన నివేదిక పేర్కొంది. ఇటీవలి దశాబ్దాలలో చాలా ప్రధాన ఆర్థిక వ్యవస్థలు తమ కార్మిక నిబంధనలను నవీకరించి, ఏకీకతం చేసినప్పటికీ, భారతదేశం 29 కేంద్ర కార్మిక చట్టాలలో విస్తరించి ఉన్న విచ్ఛిన్నమైన, సంక్లిష్టమైన, అనేక భాగాలలో పాత నిబంధనల కింద పనిచేయాల్సి వస్తున్నదని తెలిపింది. అందుకే వీటన్నింటినీ క్రోడీకరించి, నాలుగు కొత్త స్మృతులుగా తీసుకువస్తున్నట్లు వివరించింది. పాత చట్టాలు మారుతున్న ఆర్థిక వ్యవస్థల వాస్తవాలకు, అభివద్ధి చెందుతున్న ఉపాధి రూపాలకు అనుగుణంగా లేవని, కార్మికులు, పరిశ్రమ రెండింటికీ అనిశ్చితిని, భారాన్ని పెంచుతున్నాయని తెలిపింది. నాలుగు కార్మిక కోడ్‌ల అమలు వలసరాజ్యాల యుగం నిర్మాణాలను దాటి ఆధునిక ప్రపంచ ధోరణులకు అనుగుణంగా ఉండవలసిన ఈ దీర్ఘకాల అవసరాన్ని పరిష్కరిస్తుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ కోడ్‌లు కార్మికులు, సంస్థలు రెండింటినీ శక్తివంతం చేస్తాయని, రక్షిత, ఉత్పాదక, అభివద్ధి చెందుతున్న పని ప్రపంచంతో అనుసంధానం చేసి సరికొత్త శ్రామిక శక్తిని నిర్మిస్తాయని, మరింత పోటీతత్వంతో, స్వావలంబనతో కూడిన దేశానికి మార్గం సుగమం చేస్తాయని మంత్రిత్వ శాఖ చెప్పుకొచ్చింది. దేశ స్వావలంబన కోసమే : మంత్రి మాండవీయ కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ, ఎక్స్‌లో ఒక పోస్ట్ చేస్తూ, ప్రతి కార్మికుడికి గౌరవం కల్పించేందుకు నేటి నుండి, దేశంలో కొత్త కార్మిక కోడ్‌లు అమలులోకి వచ్చాయని, ఇది ప్రభుత్వ హామీ అని పేర్కొన్నారు. కార్మికులందరికీ సకాలంలో కనీస వేతనాల హామీ, యువకులకు నియామక పత్రాల అందజేత, మహిళలకు సమాన వేతనం, గౌరవ హామీ, 40 కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత హామీ, ఒక సంవత్సరం ఉద్యోగం తర్వాత స్థిరకాలిక ఉద్యోగులకు గ్రాట్యుటీ హామీ, 40 ఏళ్లు పైబడిన కార్మికులకు ఉచిత వార్షిక ఆరోగ్య పరీక్షల హామీ, ఓవర్‌టైమ్‌కు రెట్టింపు వేతనాల హామీ వంటి ఎన్నో హామీలు ఈ కోడ్‌లు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. దానితో పాటు, ప్రమాదకర రంగాలలోని కార్మికులకు 100 శాతం ఆరోగ్య భద్రత, అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం కార్మికులకు సామాజిక న్యాయం హామీని కూడా ఈ కోడ్‌లు నిర్ధారిస్తాయని మాండవీయ చెప్పారు. ఈ సంస్కరణలు కేవలం సాధారణ మార్పులు మాత్రమే కాదని, శ్రామిక శక్తి సంక్షేమం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న ప్రధాన అడుగు అని ఆయన ఆయన నొక్కి చెప్పారు.

''ఈ కొత్త కార్మిక సంస్కరణలు స్వావలంబన భారతదేశం వైపు ఒక ముఖ్యమైన అడుగు. 2047 నాటికి అభివద్ధి చెందిన భారతదేశం అనే లక్ష్యానికి కొత్త ఊపునిస్తాయి'' అని అన్నారు. ద్విసభ్య ట్రిబ్యునల్స్ ద్వారా వివాదాల సత్వర పరిష్కారానికి యంత్రాంగం, భద్రత ప్రమాణాల పరిశీలనకు జాతీయ వత్తి భద్రత, ఆరోగ్య (ఓఎస్‌హెచ్) బోర్డు ఏర్పాటు వంటి అంశాలూ ఇందులో ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం సవివరమైన నిబంధనలు, పథకాల రూపకల్పనకు సంప్రదింపులను ప్రారంభిస్తుందని, ఈ క్రమంలో అవసరమైన చోట ప్రస్తుతం అమల్లో ఉన్న పాత చట్టాలే వర్తిస్తాయని చెప్పారు. అయితే పాత చట్టాలు రద్దయినట్లేనని కార్మిక శాఖ ప్రకటనలో స్పష్టంగా ఉంది. సామాజిక భద్రత కవరేజి 2015లో 19 శాతం ఉండగా, 2025లో అది 64 శాతానికి పెరిగిందని మంత్రి మాండవీయ తెలిపారు.

**కార్మికులకు గొప్ప శక్తినిస్తుంది :**

ప్రధాని మోదీప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ కార్మిక కోడ్‌లపై వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. ''నేడు, మన ప్రభుత్వం నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేసింది. ఇది స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అత్యంత సమగ్రమైన, ప్రగతిశీల కార్మికఆధారిత సంస్కరణలలో ఒకటి. ఇది మన కార్మికులకు గొప్పగా శక్తినిస్తుంది. ఇది పనినీ, పని సంస్కతిని గణనీయంగా సులభతరం చేస్తుంది. అదే సమయంలో వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహిస్తుంది (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) అని మోదీ పేర్కొన్నారు.

ఈకోడ్‌లు సార్వజనీన సామాజిక భద్రతకు బలమైన పునాదినిస్తుందన్నారు. సకాలంలో వేతనాల చెల్లింపు, సురక్షితమైన పని ప్రదేశాలను కల్పించడంతోపాటు మన ప్రజలకు, ముఖ్యంగా నారీ శక్తి, యువ శక్తికి వేతన అవకాశాలకు బలమైన పునాదిగా పనిచేస్తాయని ఆయన పేర్కొన్నారు. ''ఇది కార్మికుల హక్కులను పరిరక్షించే, భారతదేశ ఆర్థిక వద్ధిని బలోపేతం చేసే భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తుంది. ఈ సంస్కరణలు ఉద్యోగ సష్టిని పెంచుతాయి. ఉత్పాదకతను పెంచుతాయి. వికశిత్ భారత్ వైపు మన ప్రయాణాన్ని వేగవంతం చేస్తాయి'' అని ప్రధాన మంత్రి అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## నేడు 'తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర సదస్సు'

**గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గౌరవ అతిథులుగా మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట్ రెడ్డి పాల్గొంటారని ఆయన గురువారం తెలిపారు.

# రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణం

**బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపణలు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హెచ్‌ఐఎల్‌టిపి) పేరుతో సిఎం రేవంత్ రెడ్డి రూ.5 లక్షల కోట్ల విలువైన భూకుంభకోణానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపి మాలోతు కవితతో కలిసి కెటిఆర్ మాట్లాడుతూ హెచ్‌ఐఎల్‌టిపి పాలసీ కింద భూమి కొనుగోలు చేసే పారిశ్రామికవేత్తలు భవిష్యత్తులో తీవ్రమైన న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటారని, ఈ లావాదేవీలు నిలబడవన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలోనికి వస్తే ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, క్రమబద్ధీకరణను రద్దు చేసి, పూర్తి స్థాయి విచారణ జరిపించి, కుంభకోణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటామని, ఈ స్కామ్‌లో పాల్గొనే ఎవరినీ వదిలిపెట్టబోమని కెటిఆర్ హెచ్చరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండే రాజకీయ మధ్యవర్తులు, బంధువులు, రియల్ ఎస్టేట్ గ్రూపులకు లబ్ధి చేకూర్చేందుకే హెచ్‌ఐఎల్ టిపిని రూపొందించారన్నారు. పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ, మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్‌ఐఎల్‌టిపి వేలాది ఎకరాల పారిశ్రామిక భూములను అత్యంత తక్కువ ధరకు బహుళ ఉపయోగ విలువైన రియల్ ఎస్టేట్‌గా మార్చేందుకు రూపొందించారని ఆరోపించారు. ఇది కేవలం పాలసీ కాదని, రూ.5 లక్షల కోట్ల స్కామ్ కోసం రూపొందించిన బ్లూప్రింట్ అని అన్నారు. బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, అజామాబాద్‌తో సహా హైదరాబాద్ లోని కీలకమైన పారిశ్రామిక క్లస్టర్లలో ఉన్న సుమారు 9,292 ఎకరాల విలువైన భూమిని క్రమబద్ధీకరించేందుకు ఈ పాలసీ ప్రయత్నిస్తోందన్నారు. ఆ భూములను రేవంత్ కేవలం ప్రభుత్వ విలువలో 30 శాతానికే అప్పగించాలని చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించినప్పుడు, ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100 శాతం నుండి 200 శాతం అధికంగా వసూలు చేయాలని ఒక చట్టం చేశామన్నారు. ఉద్యోగాల కల్పన, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు పారిశ్రామిక భూములను చాలా తక్కువ ధరలకు లేదా ఉచితంగా కేటాయించారని కెటిఆర్ అన్నారు. ఈ పాలసీని ప్రభుత్వం ఆమోదించే వేగం అత్యంత అనుమానాస్పదంగా ఉందని అన్నారు. లక్షల కోట్ల విలువైన భూముల అంశంలో ఎందుకీ తొందర? ఎందుకీ వేగవంతమైన ప్రక్రియ? అని కెటిఆర్ ప్రశ్నించారు. పాలన కంటే రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకే సిఎం ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు.

# కెటిఆర్ చెప్పేవి పచ్చి అబద్ధాలు

**ఆ భూములకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించింది**

**ఇంపాక్ట్ ఫీజు వసూలు చేస్తాం**

**ఆ డబ్బంత ప్రభుత్వ ఖజానాలోకి వెళ్తుంది.. ఇందులో కుంభకోణం ఎక్కడ?: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారిశ్రామిక భూముల కన్వర్షన్ కోసం ఇంపాక్ట్ ఫీజు వసూలు చేయాలని నిర్ణయిస్తే దానిని రూ.5 లక్షల కోట్ల కుంభకోణంగా చిత్రీకరిస్తూ కెటిఆర్ దుష్ప్రచారం సాగిస్తున్నారని ఐటి, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మండిపడ్డారు. ప్రభుత్వం పరిశ్రమలకు లీజుకిచ్చిన భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ 'ఫ్రీహోల్డ్ రైట్స్' పేరిట 2023 ఆగస్టులో మూడు జిఓలు ఇచ్చింది వారి ప్రభుత్వ హయాంలో కాదా అని ఆయన ప్రశ్నించారు. సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ ఆరోపణలను ఆధారాలతో తిప్పికొట్టారు. కెటిఆర్ చెబుతున్న 9,292 ఎకరాల భూమిలో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసి కేటాయించినది 4740 ఎకరాలే. మిగిలిన భూమి రోడ్లు, డ్రెయినేజి లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించడం జరిగిందన్నారు. ఆజామాబాద్, కూకట్‌పల్లి, హాఫీజ్‌పేటల్లోని పరిశ్రమల భూములను ఫ్రీ హోల్డ్ పేరిట యాజమాన్య హక్కులు కల్పించినది బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. కూకట్‌పల్లి, ఆజామాబాద్, హాఫీజ్ పేట భూములకు సంబంధించి ఇండస్ట్రీస్, కామర్స్ డిపార్టుమెంట్, జిఓ ఎంఎస్ 19, 20, 21లను 2023 ఆగస్టు 29న జారీ చేసిందని స్పష్టం చేశారు. ఇప్పుడు ఆ భూములకు కన్వర్షన్ అవకాశం కల్పిస్తున్నామన్నారు. 30, 50 శాతం స్లాబులతో ఇంపాక్టు ఫీజు నిర్ణయిస్తూ ఈనెల 17న జరిగిన కేబినెట్‌లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. 2023లో ఎన్నికలకు నాలుగు నెలల ముందు ఫ్రీహోల్డ్ బిఆర్‌ఎస్ ప్రభుత్వం హక్కులు కల్పించారు. అప్పుడు ఎన్ని లక్షల కోట్లు వసూలు చేసుకున్నారో చెప్పాలన్నారు. ఆ జిఓల విషయం దాచిపెట్టి ప్రభుత్వంపై నిరాధార నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. అసలు కుంభకోణమో, స్కామో జరిగి ఉంటే వారి హయాంలోనే జరిగి ఉండాలన్నారు. పరిశ్రమల యజమానులు హక్కులు పొందాలంటే రిజిస్ట్రేషన్ విలువపై 100 శాతం చెల్లించాలని, అవి చేతులు మారితే 200 శాతం కట్టాలని జిఓలు ఇచ్చారు. ఆ భూములు మరొకరి పరమైతే హక్కులు ఎలా కల్పిస్తారో వారికే తెలియాలన్నారు. వారిచ్చిన యాజమాన్య హక్కులు ఉన్నవారికి భూ వినియోగ మార్పిడి చేసుకునే అవకాశం మాత్రమే మేం కల్పించామన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పరిశ్రమల కమిషనర్లు పరిశ్రమల సంఘాలతో పలు దఫాలుగా చర్చలు జరిపిన మీదట 30 శాతం, 50 శాతం స్లాబులను ప్రతిపాదించారు. సిఎం సోదరులు అగ్రిమెంట్లు చేసుకున్నారని నోటికొచ్చినట్లు మాట్లాడారు. వారెవరూ ప్రభుత్వంలో లేరు. పదేండ్లు మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా అభూత కల్పనలు ప్రచారం చేయడం దుర్మార్గం. ఆధారాలేవైనా బయటపెడితే ప్రభుత్వం ఏమి చేయాలో అది చేస్తుంది. ఇప్పటికైనా ఆయన ఆలోచనల్లో మార్పు రావాలని కోరుకుంటున్నాం. కన్వర్షన్ ఇంపాక్ట్ ఛార్జీల వల్ల రూ.4 వేల నుంచి రూ.5వేల కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తున్నాం. అది కూడా అందరూ దరఖాస్తు చేసుకుంటేనే.యాజమాన్య హక్కులు లేని వారు కన్వర్షన్ కు దరఖాస్తు చేసుకోలేరన్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలను వెలుపలకు తరలిస్తామని మొదటి నుంచి చెబుతున్నాం. గాలి, నీరు కాలుష్యం లేకుండా చేయడానికి పరిశ్రమలను బయటకు తరలిస్తున్నాం. పరిశ్రమలను ఆకర్షించడానికి కొన్ని రాష్ట్రాలు ఎకరం భూమిని 99 పైసలకే కేటాయించడం చూస్తున్నాం. విద్యుత్తు, పన్ను రాయితీలను 20 ఏళ్ల పాటు ఇస్తున్నారు. మన దగ్గర భూముల విలువ ఎక్కువ, లభ్యత కూడా తక్కువ. అయినా పరిశ్రమలకు అనుకూలమైన ఎకోసిస్టం ఉండాలని అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. పరిశ్రమలు, ఐటి కంపెనీలు వస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. రాష్ట్రం కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది.

# ఏడాదిన్నరలో 'చేనేత'కు రూ.వెయ్యి కోట్లు


**కొండా లక్ష్మణ్ బాపూజీ కీర్తి ప్రతిష్ఠలు పెరిగేలా ఐఐహెచ్‌టి**

**ఐఐహెచ్‌టి ప్రయోగశాల ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ ఐఐహెచ్‌టినీ తీర్చిదిద్దుతామని మంత్రి తుమ్మల ప్రకటించారు. నాంపల్లి చేనేత భవన్‌లో శుక్రవారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ సంస్థ ప్రయోగశాలలను చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వెంకటగిరిలో ఐఐహెచ్‌టి ఉంది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ చేనేత రంగానికి మేలు జరిగేలా కేంద్ర ప్రభుత్వంతో సీఎం రేవంత్ రెడ్డి ఒప్పించి ఐఐహెచ్‌టి మన రాష్ట్రానికి సాధించారు. పూజ్యులు కొండా లక్ష్మణ్ బాపూజీ గౌరవార్ధం ఐఐహెచ్‌టి పేరును ఆయన పేరున పెట్టామని, బాపూజీ కీర్తి ప్రతిష్ఠలు పెరిగేలా ఐఐహెచ్‌టి దేశంలోనే మంచి ఇన్స్టిట్యూట్‌గా నిలవాలని అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేనేత రంగానికి మహర్దశ పట్టనుందని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఏడాదిన్నరలోనే వెయ్యి కోట్లు చేనేత రంగానికి నిధులు విడుదల చేశారు. ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్‌తో చేనేత కార్మికులు పని కోసం ఎదురు చూడకుండా చేతినిండా పని కల్పించినట్లు తెలిపారు. రూ.50 కోట్లతో వేములవాడలో యార్న్‌డిపో ఏర్పాటు చేసి ఇప్పటికే 2368 మెట్రిక్ టన్నుల నూలు మరమగ్గాల సంఘాలకు సరఫరా చేయడం జరిగినది, రూ.168 కోట్లతో చేనేత అభయ హస్తం పథకంలో భాగంగా నేతన్న పొదుపు, నేతన్న భరోసా పథకాలను అమలు చేయడం జరుగుతుంది. నేతన్న పొదుపు కింద రూ.304 కోట్లు, మరమగ్గాల కార్మికులకు పొదుపు కింద రూ.68 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. మరమగ్గాల కార్మికులకు నూలు సబ్సిడీ పథకం కింద ఉన్న బకాయిలు రూ.40 కోట్లు చెల్లించడం జరిగింది. చేనేత కార్మికుల వ్యక్తిగత రుణమాఫీ రూ.33 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఐబొమ్మ రవిపై ఐదు కేసులు..






**ప్రజాపక్షం/హైదరాబాద్:** సినిమా పైరసీ వ్యవహారంలో ప్రధాన నిందితుడైన ఐబొమ్మ రవికి సైబర్ క్రైమ్ పోలీసులు భారీ షాక్ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఒక కేసులో అరెస్టు చేసి విచారిస్తున్న పోలీసులు, అతడిపై నమోదైన మిగతా నాలుగు కేసుల్లోనూ అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు తాజాగా కోర్టులో పిటి వారెంట్ దాఖలు చేశారు. పైరసీ సెల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు రవిని మొదట అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈ కేసులో అతడిని ఐదు రోజుల కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే పలువురు సినీ నిర్మాతలు రవిపై ఫిర్యాదు చేయడంతో మరో నాలుగు కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా పైరసీతో పాటు బెట్టింగ్ యాప్‌ల ప్రమోషనల్ వ్యవహారంలోనూ రవిపై కేసు నమోదైంది.

**రెండో రోజు కస్టడీలో..** ఐదు రోజుల పోలీసు కస్టడీలో భాగంగా, రెండో రోజు రవిని సైబర్ క్రైమ్ పోలీసులు విచారిస్తున్నారు. ఈ పైరసీ కార్యకలాపాలకు ఎవరు సహకరించారు, అతడి వెనుక ఎవరైనా కీలక వ్యక్తులు ఉన్నారా, లేదా అతనే ఈ వ్యవహారాన్ని మొత్తం నడిపాడా వంటి కోణాల్లో లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈ వ్యవహారంలో అతడికి సాంకేతిక సహకారం అందించిన వ్యక్తుల వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. మిగతా కేసుల్లోనూ త్వరలో అరెస్టు చేసి, ఈ మొత్తం పైరసీ నెట్‌వర్కును ఛేదించాలని పోలీసులు భావిస్తున్నారు. తొలి రోజు కస్టడీలో ఆదాయం, నెట్‌వర్కు సోర్స్ లాంటి సాంకేతిక విషయాలపై వివరాలు రాబట్టిన విషయం తెలిసిందే.

# 'ధరణి' దాష్టీకాలతో రైతులు సతమతం

**రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ధరణి' దాష్టికాల వల్లనే భూ సమస్యలతో రైతులు సతమతమయ్యారని, సమస్యల పరిష్కారానికి మార్గం లేక కోర్టులు, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో జరిగిన తప్పిదాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైన రుద్దడం తగదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి సంబంధించి భూ రికార్డులను, ఆధార్ కార్డులను, బ్యాంకు ఖాతా నంబర్లను అమెరికా కంపెనీకి (టేరాసా) అప్పగించారని గుర్తు చేశారు. ధరణి స్థానంలో భూ భారతి చట్టం తెచ్చి, యుద్ధ ప్రాతిపదికన ఆ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చారని, తద్వారా కంప్యూటర్ల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతాంగం వద్దకే, రెవెన్యూ అధికారులను పంపించి, వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారన్నారు. సాదాబైనామా దరఖాస్తులను స్వీకరించి, అప్పటి ప్రభుత్వం పరిష్కారాన్ని గాలికి వదిలేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతిలో ఈ విషయాన్ని చేర్చడంతో పాటు హైకోర్టు స్టే ఎత్తివేసేలా కృషి చేసిందని, సాదాబైనామా క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించిందని కోదండరెడ్డి వివరించారు. ప్రైవేట్ చేతుల్లో ఉన్న ధరణి పోర్టల్‌ను ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఐసికి అప్పగించిందని కోదండరెడ్డి అన్నారు. వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఎప్పటికప్పుడు చట్టం అమలులో ప్రభుత్వానికి తగిన సలహాలు సూచనలు ఇస్తుందన్నారు. రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసి, ఒక తహసిల్దార్ హత్యకు గత ప్రభుత్వం కారణమైందన్నారు.

# 'భూమేత'గా మారిన భూ భారతి

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అవినీతి, అక్రమాలు, అడ్డగోలు వసూళ్లతో భూ భారతి 'భూ మేత'గా మారిందా అని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. 'ధరణి'పై అడ్డగోలుగా మాట్లాడి, 'భూ భారతి'ని తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, భూముల సమస్యలు పరిష్కరించడంలో ఎందుకు విఫలమైందని ప్రశ్నించారు. భూ భారతి, భూ హారతిగా మారి కాంగ్రెస్ నాయకులకు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు మంగళ హారతి అయిందా అని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూముల రికార్డులు సరిచేస్తామని, రైతుల హక్కులు కాపాడతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, రెండేళ్లుగా కుంటి సాకులు చెబుతూ రిజిస్ట్రేషన్లు చేయకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటుందని హరీశ్‌రావు ఆరోపించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. తహసిల్దార్, ఆర్‌డిఓ, కలెక్టర్ కార్యాలయాల్లో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

# ఉత్సాహభరితంగా తెలంగాణ నార్త్ ఈస్ట్ స్పోర్ట్స్ ఫెస్టివల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ–నార్త్ ఈస్ట్ కనెక్ట్ కార్యక్రమా భాగంగా నిర్వహించిన స్పోర్ట్స్ ఫెస్టివల్ తెలంగాణలో ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా కొనసాగింది. గోపీచంద్ అకాడమీలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలకు గవర్నర్ విష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. తెలంగాణ వర్సెస్ నార్త్ ఈస్ట్ జట్ల మధ్య బాయ్స్, గరల్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాలు, తెలంగాణకు గ్రామీణ క్రీడలకు ఉన్న బలమైన నేపథ్యం, రెండు ప్రాంతాల క్రీడా సంస్కృతికి సామీప్యతను సూచిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, గోపీచంద్ అకాడమీ సిబ్బంది, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.తదనంతరం గచ్చిబౌలి స్టేడియంలో నార్త్ ఈస్ట్–తెలంగాణ స్పోర్ట్స్ ఎంటర్ ప్రెన్యూర్స్, క్రీడా జర్నలిస్టుల సమావేశం నిర్వహించబడింది. అదేవిధంగా ఈశాన్య రాష్ట్రాల అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతల ఆధ్వర్యంలో ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, సెపక్ తక్రా, టెన్నిస్ తదితర క్రీడా విభాగాల్లో స్పెషల్ కోచింగ్ క్లినిక్స్ నిర్వహించారు. గచ్చిబౌలి మెయిన్ స్టేడియంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీలలో, మహిళల విభాగంలో తెలంగాణ జట్టు 2–0 గోల్స్‌తో ఈశాన్య రాష్ట్రాల జట్టుపై విజయం సాధించింది. పురుషుల విభాగంలో ఈశాన్య రాష్ట్రాల జట్టు 2–0 తో తెలంగాణపై విజయం నమోదుచేసింది. ఈ పోటీలను ఇండియన్ ఫుట్‌బాల్ లెజెండ బూటియా, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి ప్రారంభించారు. విజేతలకు మిజోరం క్రీడా శాఖ మంత్రి లౌలింగ్ లోవా హమారా, క్రీడల సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ఈశాన్య రాష్ట్రాల అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు బహుమతులు అందజేశారు.

# రాష్ట్రంలో 32 మంది ఐపిఎస్‌ల బదిలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం 32 మంది ఐపిఎస్‌లను బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఐపిఎస్ అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి.

| అధికారి పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| దేవేంద్ర సింగ్ చౌహాన్ | మల్టీజోన్ II | అదనపు డిజి పర్సనల్ |
| జె.పరిమళ హన నూతన్ | హైదరాబాద్ జాయింట్ సిపి | సిఐడి డిఐజి |
| డాక్టర్ చేతన మైలాబతుల | ఎస్‌పి ఉమెన్ సేఫ్టీ | పోలీసు అకాడమీ |
| కె.నారాయణ రెడ్డి | ఎస్‌పి వికారాబాద్ | మహేశ్వరం డిసిపి |
| పి.వి.పద్మజ | డిసిపి మల్కాజిగిరి | ఎస్‌పి ఎర్కోటిక్స్ బ్యూరో |
| డా.పి.ఎస్.ఎస్.గణపత్‌రావు | ఎస్‌పి సిఐడి | ఎస్‌పి నాగర్ కర్నూల్ జిల్లా |
| ఖరే కిరణ్ ప్రభాకర్ | ఎస్‌పి భూపాలపల్లి | సౌత్‌జోన్ డిసిపి హైదరాబాద్ |
| చెన్నూరి రూపేష్ | ఎస్‌పి నార్కోటిక్స్ బ్యూరో | డిసిపి ఐటి హైదరాబాద్ |
| డా.శబరీష్ పి | ఎస్‌పి ములుగు | ఎస్‌పి మహబూబాబాద్ |
| నితికా పంత్ | టిఎస్ఎస్‌పి కమాండెంట్ | ఎస్‌పి ఆసిఫాబాద్ |
| ఆర్. గిరిధర్ | ఎస్‌పి వనపర్తి | ఎస్‌పి నార్కోటిక్స్ బ్యూరో |
| స్నేహమెహ్రా | డిసిపి సౌత్ జోన్ | ఎస్‌పి వికారాబాద్ |
| గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ | వెయిటింగ్ | టాస్క్‌ఫోర్స్ డిసిపి |
| కేకన్ సుధీర్ రామ్‌నాథ్ | వెయిటింగ్ | ఎస్‌పి ములుగు |
| సిరిశెట్టి సంకీర్త్ | ఎడిసి గవర్నర్‌గా | ఎస్‌పి జయశంకర్ |
| పాటిల్ కాంతిలాల్ సుభాష్ | వెయిటింగ్ | ఎడిసి గవర్నర్ |
| బి.రాంరెడ్డి | ఎస్‌పి సిఐడి | డిసిపి పెద్దపల్లి |
| శ్రీధర్ | ఎస్‌పి ఇంటెలిజెన్స్ | డిసిపి మల్కాజ్‌గిరి |
| అవినాష్ కుమార్ | ఎస్‌డిపిఒ భైంసా | అదనపు ఎస్‌పి కొత్తగూడెం |
| కాజల్ | ఎస్‌డిపిఒ ఉట్నూర్ | అదనపు ఎస్‌పి అదిలాబాద్ |
| కంకాల రాహుల్ రెడ్డి | ఎస్‌డిపిఒ భువనగిరి | అదనపు ఎస్‌పి భువనగిరి |
| శేషాద్రిని రెడ్డి సూరుకొంటి | ఎస్‌డిపిఒ వేములవాడ | అదనపు ఎస్‌పి జగిత్యాల |
| శివమ్ ఉపాధ్యాయ | ఎస్‌డిపిఒ ఏటూరునాగారం | అదనపు ఎస్‌పి ములుగు |
| రాజేష్ మీనా | అదనపు ఎస్‌పి నిర్మల్ | ఎస్‌డిపిఒ భైంసా |
| పి.మౌనిక | అదనపు ఎస్‌పి దేవరకొండ | అదనపు ఎస్‌పి అదిలాబాద్ |
| మనన్ భట్ | ఎఎస్‌పి గ్రేహౌండ్స్ | ఎస్‌డిపిఒ ఏటూరు నాగారం |
| పత్తిపాక సాయికిరణ్ | ఎఎస్‌పి గ్రేహౌండ్స్ | అదనపు ఎస్‌పి నిర్మల్ |
| రుత్విక్ సాయికోట్టె | ఎఎస్‌పి గ్రేహౌండ్స్ | అదనపు ఎస్‌పి వేములవాడ |
| యాదవ్ వసుంధర | ఎఎస్‌పి గ్రేహౌండ్స్ | ఎసిపి సత్తుపల్లి |
| ఎస్.శ్రీనివాస్ | వెయిటింగ్ | ఎస్‌పి ట్రాన్స్‌కో |
| డి.సునీత | వెయిటింగ్ | ఎస్‌పి వనపర్తి |
| కె. గుణశేఖర్ | వెయిటింగ్ | డిసిపి క్రైమ్స్ రాచకొండ |

# విశ్వగురువుగా భారత్ నిలవాలి

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విశ్వ గురువు భారత్‌గా నిలవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో నెంబర్ వన్ దేశంగా నిలుస్తుందన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి కార్యాలయంలో శుక్రవారం ఆత్మనిర్భర్ భారత్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో రామచంద్రరావు, బిజెపి నేతలు చంద్రశేఖర్ తివారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ ప్రజలు తమ దినచర్యలో వాడే ప్రతి వస్తువు కూడా స్వదేశీ అయ్యేలా, చేనేత కళాకారులు, చేతి వృత్తుల వారిని ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమాలలో చెప్పిన ప్రతి అంశాన్ని జిల్లా స్థాయి, మండల స్థాయిలకు తీసుకెళ్లాలని, ప్రజల్లో స్వదేశీ ప్రాముఖ్యతపై అవగాహన కలిగించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. చైనా, అమెరికా తమ ఉత్పత్తులను పెంచి, ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయని విమర్శించారు.

**బిజెపిలో చేరిన వాల్మీకి మెతార్ సమాజం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌లాల్**

ఈ వర్క్‌షాప్‌లో రాంచందర్ రావు సమక్షంలో వాల్మీకి మెతార్ సమాజానికి చెందిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌లాల్ బిజెపి పార్టీలో చేరారు. వాల్మీకి సమాజం షెడ్యూల్ కులాలలో అత్యంత ఆచారవంతమైన, కఠినంగా హిందూ సంప్రదాయాలను పాటించే సమాజమన్నారు. తమ ధర్మాన్ని మార్చుకోకుండా హిందూ మతాన్ని కాపాడిన సముదాయం వారందరిని రాంచందర్ రావు ప్రశంసించారు.



# మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఓ కట్టుకథ

**హిడ్మాను పట్టుకుని కాల్చి చంపారు**

**23న దేశ వ్యాప్త నిరసన దినం**

**లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ**





**ప్రజాపక్షం/ఖమ్మం :** మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఓ కట్టుకథ అని పోలీసులు అరెస్టు చేసి నిరాయుధులను పట్టుకొచ్చి కాల్చి చంపారని భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు ఆరోపించింది. ఈ మేరకు కేంద్ర అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఒక లేఖను విడుదల చేసింది. దేశంలో ఫాసిస్టు దమనకాండ కొనసాగుతుందని హత్యలతో ప్రజలను భయకంపితులను చేసి కార్పొరేట్ ప్రయోజనాలను నెరవేరుస్తున్నారని లేఖలో ఆరోపించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నేతృత్వంలో ఎస్ఐబి నవంబర్ 15న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హిడ్మాను ఆయన భార్య రాజీను మరికొంతమంది చికిత్స నిమిత్తం విజయవాడ వెళ్లగా అదుపులోకి తీసుకున్నారని లేఖలో పేర్కొన్నారు. ఒక ద్రోహి అందించిన సమాచారం మేరకే హిడ్మాను అరెస్టు చేశారని ఆ తర్వాత మారేడుమిల్లి తీసుకువచ్చి కాల్చి చంపారని ఎన్‌కౌంటర్ జరిగిందనేది అతిపెద్ద అబద్ధమని మావోయిస్టు పార్టీ లేఖలో పేర్కొంది. తుది వరకు పోరాడి ఉద్యమ స్ఫూర్తిని సిద్ధాంత పటిమను చూపించిన హిడ్మాకు మావోయిస్టు పార్టీ శిరస్సు వంచి శ్రద్ధాంజలి ఘటిస్తుందన్నారు. ఉద్యమ అభివృద్ధి క్రమంలో ప్రజల అవసరాలను తెలుసుకుని మసులుకున్న నాయకునిగా కీర్తి గడించారని లేఖలో పేర్కొన్నారు. పాలకవర్గ మీడియా కొంతమంది గోదీ మేధావులు హిడ్మాను దుర్మార్గుడిగా చిత్రీకరణ చేశారని హత్య చేసిన తర్వాత కూడా హిడ్మాపై అసత్య ప్రచారం చేస్తున్నారని లేఖలో తెలిపారు. ప్రజల హృదయాల్లో హిడ్మా స్థానం చెరిగిపోనిదని కొమరం బీం, గేంది సింగ్, గుండాదూర్ లతో పాటు అనేక మంది యోధుల మాదిరే హిడ్మా కూడా చరిత్రలో నిలిచిపోతాడని లేఖలో పేర్కొన్నారు. హిడ్మా సహ పలువురు మావోయిస్టుల హత్యాకాండను నిరసిస్తూ నవంబర్ 23న దేశ వ్యాప్త నిరసన దినం పాటించాలని పిలుపునిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలన్నింటిని తన గుప్పెట్లో పెట్టుకుని భారీ స్థాయి మోసాలు చేస్తూ విజయాలు సాధిస్తున్న మోడీ ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.


**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**

ఫోన్ నం. 0878-2243438, ఫ్యాక్స్ నం. 0878-2240624. ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com

నం. E1/DB/MCK/Furniture/Quotations/2025-26 సీల్డ్ కొటేషన్ ప్రకటన తేదీ: 19.11.2025

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కోసం కంప్యూటర్ టేబుల్, సైడ్ కర్టెన్‌తో పేషెంట్ ఎగ్జామినేషన్ టేబుల్, 4 చదరపు కాళ్లతో 1mm పర్ఫొరేటెడ్ షీట్ సీట్ చైర్ మరియు పౌడర్ కోటింగ్ సరఫరా మరియు డెలివరీ పనుల కోసం SoR రేట్లు లేని వస్తువుల కోసం సీల్డ్ కొటేషన్ నోటీసు. **కొటేషన్ స్వీకరించిన చివరి తేదీ:** 24.11.2025, సాయంత్రం 04.00 గంటలకు. మరిన్ని వివరాలకు దయచేసి సంప్రదించండి: 7032989954

సం/-కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్.

DIPR R.O. No. : 11084-PP/CL/ADVT/1/2025-26 Date: 21-11-2025

**శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము**

మట్టపల్లి మహాక్షేత్రము, మఠంపల్లి మండలము, సూర్యాపేట జిల్లా.

టెండర్-కం-బహిరంగ వేలముల ప్రకటన

లేఖ నెం.29/యస్.యల్.యన్.యస్.డి/2024, తేదీ: 21-11-2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది: 27-11-2025 గురువారము రోజున మ.2:00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి. | కాలపరిమితి |
|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు | 3,00,000/- | 18-01-2026 17-01-2027 |

కావున పైన తెలిపిన టెండర్-కం-బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9849539594 సంప్రదించగలరు.

ఇట్లు,

చెన్నూరు మట్టపల్లిరావు, అనువంశిక ధర్మకర్త, మొబైల్ నెం.9490626253

బి.జ్యోతి, కార్యనిర్వహణాధికారి, మొబైల్ నెం. 7981570939

DIPR R.O. No. : 11139-PP/CL/ADVT/1/2025-26, Date: 21-11-2025

**వికారాబాద్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం**

వికారాబాద్ జిల్లా

నం.MCV/E/2029/2025 ఆసక్తి వ్యక్తీకరణ తేదీ: 20.11.2025

**15వ FC గ్రాంట్లు, SFC, TUFIDC, UIDF మరియు ఏవైనా ఇతర గ్రాంట్ల కింద వికారాబాద్ మున్సిపాలిటీలోని అన్ని అభివృద్ధి పనులు అంటే CC రోడ్లు, డ్రెయిన్లు, భవనాలు, పార్కులు & స్మశానవాటిక అభివృద్ధి, డంప్ యార్డ్ అభివృద్ధి** మొదలైన వాటి కోసం అంచనాలు మరియు DPRలను తయారు చేయడానికి ఆసక్తి ఉన్న సంస్థలు / ఆర్గనైజేషన్లు / ప్రఖ్యాత ఏజెన్సీల నుండి సీల్డ్ కొటేషన్లను ఆహ్వానించబడింది.

ఏజెన్సీలు రూ.10,000/- మొత్తానికి డిపాజిట్ నాన్-రీఫండబుల్ DDని మరియు రూ.500/- షెడ్యూల్ ఖర్చును **వికారాబాద్ మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్ పేరు** మీద 27.11.2025న లేదా అంతకు ముందు సంబంధిత పత్రాలతో సమర్పించాలి. **టెండర్ షెడ్యూల్ జారీ :** 28.11.2025 ఉదయం 11.00 గంటలకు ప్రారంభించి, మధ్యాహ్నం 3.30 గంటలకు మూసివేస్తారు. అదే రోజు సాయంత్రం 4:00 గంటల తర్వాత తెరవబడుతుంది.

మరిన్ని వివరాల కోసం దయచేసి కార్యాలయ వేళల్లో మున్సిపల్ కమిషనర్ (9849905910)/ మున్సిపల్ ఇంజనీర్ (9849907661)ను సంప్రదించండి.

సం/- కమిషనర్, వికారాబాద్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 11112-PP/CL/ADVT/1/2025-26, Date: 21-11-2025




# జనరల్
STATE & REGIONAL NEWS

## జెఎన్‌టియుహెచ్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లిలోని జెఎన్‌టియుహెచ్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు సమాజానికి తమవంతుగా తిరిగి సహాయం చేయాలని సూచించారు. జెఎన్‌టియూ అధికారులతో పాటు పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవ రావు, టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, కూకట్‌పల్లి ఎఎంసి చైర్మన్ పుష్పారెడ్డి, నాయకులు ఫణికుమార్, కొప్పిశెట్టి, దినేష్, గంధం రాజు, శివా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## సినీ పరిశ్రమ చేసే టికెట్ల అధిక ధరలు సాధారణ ప్రేక్షకులపై భారం

సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సినీ పరిశ్రమ చేసే టికెట్ల అధిక ధరలను అదుపుచేయలేని ప్రభుత్వం సాధారణ ప్రజలకు పైరసీ చేయవద్దని ఉపన్యాసాలు ఇచ్చే నైతిక హక్కు లేదని సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. బొమ్మా పైరసీ కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారని, కానీ అదే సిఎం సినీ పరిశ్రమకు టికెట్ ధరలను పెంచుకునే అవకాశాన్ని కల్పించారని, ఇది సాధారణ ప్రేక్షకులపై భారమని పేర్కొన్నారు.

# అడవి మా జీవనాధారం మాత్రమే కాదు... అది మా ఆత్మగౌరవం



భారతీయ కళామహోత్సవ్–2025లో మంత్రి సీతక్క
సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు రాష్ట్రపతికి ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అడవి మా జీవనాధారం మాత్రమే కాదు, అది మా మతం, మా ఆత్మగౌరవం అని మంత్రి సీతక్క అన్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో శుక్రవారం జరిగిన భారతీయ కళామహోత్సవ్–2025లో రాష్ట్ర ప్రభుత్వం తరుపున పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ (సీతక్క) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతీయ కళా, వంటకాలు, ప్రజా సంప్రదాయాల వైభవాన్ని ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిసి అందిస్తున్న ఈ మహోత్సవం 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భారత ఆత్మను ప్రతిఫలిస్తుందన్నారు. తెలంగాణ నేలపై జరుగుతున్న ఈ వేడుక.. దేశవ్యాప్తంగా ఉన్న సాంస్కృతిక వైవిధ్యాన్ని ఒకే వేదికపై తీసుకువస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సంపదలైన ఒగ్గు కథ, పేరిణి శివతాండవం, బోనాలు, బతుకమ్మ, సమ్మక్క–సారాలమ్మ జాతరతో పాటు కూచిపూడి, భరతనాట్యం వంటి శాస్త్రీయ కళలతో పాటు గిరిజన, ప్రజా కళలకు తెలంగాణకు దిక్సూచి అని తెలిపారు. ఒడిశా నుండి వచ్చిన రాష్ట్రపతి, త్రిపురకు చెందిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆదివాసీ గిరిజన మూలాలు, తెలంగాణ గిరిజన ఆదివాసీ సంస్కృతికి బలమైన అనుబంధం ఉందని తెలిపారు. రాష్ట్రపతి మహాజాతరకు విచ్చేస్తే.. గిరిజన సమాజానికి మహత్తర ప్రోత్సాహకంగా ఉంటుందని అన్నారు. భారతీయ కళా మహోత్సవం ద్వారా భారతదేశం ఒకే స్వరంతో, ఒకే భావంతో ప్రతిధ్వనిస్తోందని సీతక్క పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతి భవన్‌కు, సంబంధిత శాఖలకు అభినందనలు తెలియజేశారు. జనవరిలో జరిగే సమ్మక్క, సారాలమ్మ మహా జాతరకు రావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తెలంగాణ ప్రభుత్వం, ఆదివాసీ సమాజం తరపున మంత్రి సీతక్క ఆహ్వానం పలికారు. ఆదివాసీ జనాభా అధికంగా ఉన్న ములుగు జిల్లాలో అభివృద్ధి పనులకు, ఎకోఫ్రెండ్లీ టూరిజం ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు మంత్రి సీతక్క పలు వినతిపత్రాలు అందజేశారు. మల్లూరు దేవస్థానం అభివృద్ధి కోసం రూ.30కోట్లు, బొగతా వాటర్ ఫాల్స్ అభివృద్ధి పనుల కోసం రూ.50 కోట్లు, జంపన్న వాగు అభివృద్ధి పనుల కోసం రూ.50 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

## ఆర్‌టిసి ఉద్యోగులపై దాడులు నివారించాలి

ఎంప్లాయిస్ యూనియన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసిలో పనిచేస్తున్న డ్రైవర్, కండక్టర్లు తమ విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డ్యూటీ చేయాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అన్నారు. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొన్ని సందర్భాలలో తీవ్రమైన వాగ్వివాదాలు జరిగి డ్రైవర్, కండక్టర్లపై మహిళలు చేయి చేసుకుంటున్నారని వివరించారు. బస్సులో టికెట్ తీసుకుని ప్రయాణిస్తున్న పురుషులు తమకు సీట్ లేదన్న కారణంగా డ్రైవర్, కండక్టర్లను దూషించటం జరుగుతోందన్నారు. రోడ్డుమీద వెళుతున్న వాహనదారులు కూడా తమకు సైడ్ ఇవ్వలేదన్న కారణంగా బస్సును ఆపి సిబ్బంది మీద దాడిచేసి విచక్షణా రహితంగా హింసిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ సిపి విసి.సజ్జనార్ అటువంటి వారిపై బిఎన్‌ఎస్ యాక్ట్ సెక్షన్ 221, 132, 121(1) ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, హిస్టరీ షీట్లు తెరుస్తామని హెచ్చరించటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సైబర్ క్రైమ్స్ జరిగినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1930 లాగా ఆర్టీసి సిబ్బందిపై దాడులు జరిగినప్పుడు తెలియజేయటానికి ఒక టోల్ ఫ్రీ నెంబర్ పెడితే బాగుంటుందని వారు అభిప్రాయపడ్డారు. సైబర్ క్రైమ్స్‌పై స్పెషల్ ఆపరేషన్ టీమ్ ఎలాగైతే ఉంటుందో అలాగే ఆర్టీసి సిబ్బందిపై జరిగిన దాడులను విచారించటానికి ఒక ఎస్‌ఒటిని ఏర్పాటు చేయాలని, ఈ కేసులను తక్షణమే విచారించి దోషులను శిక్షంచడానికి పత్యేక న్యాయ వ్యవస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్‌టిసి యాజమాన్యం సిబ్బందికి విధి నిర్వహణలో ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు.

## ఈశాన్య భారత సినిమాల నిర్మాణానికి.. అండగా తెలంగాణ ప్రభుత్వం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఈశాన్య రాష్ట్రాల సినీ అనుబంధాన్ని బలోపేతం చేయడానికి నిర్వహిస్తున్న 'తెలంగాణనార్త్ ఈస్ట్ సినిమా ఫెస్టివల్'లో భాగంగా ఐమ్యాక్స్ థియేటర్‌లో సోమవారం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ప్రాంతీయ భాషా చిత్రాల దర్శకులు, నిర్మాతలు, నటీనటులు సహా పలువురు డెలిగేట్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అస్సాం రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని రెండు రాష్ట్రాల ప్రతినిధులు గవర్నర్ సమక్షంలో పరస్పరం మార్చుకున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సినిమా మాధ్యమానికి ఎల్లలు లేవని, తెలంగాణలోని వైవిధ్యభరితమైన ప్రకృతి సోయగాలు, చారిత్రక కట్టడాలు చిత్రీకరణలకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సినిమారంగ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రపంచ ప్రఖ్యాత స్టూడియోలు, ఆధునిక నిర్మాణ వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. తెలుగు సినిమాలు హాలీవుడ్‌కు తక్కువకాకుండా ఆస్కార్ అవార్డులు గెలుచుకున్నాయని గుర్తుచేశారు. సినిమా నిర్మాణంలో తెలంగాణను మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేయాలని కోమటిరెడ్డి సూచించారు. ఈశాన్య భారత సినిమాల నిర్మాణానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టిజిఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజు, అస్సాం అదనపు ముఖ్యకార్యదర్శి డాక్టర్ బి.కళ్యాణ్ చక్రవర్తి, సిక్కిం ఎఫ్‌డిసి చైర్మన్ సిమంత శేఖర్, ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, తెలంగాణ ఎఫ్‌డిసి ఎండి సిహెచ్.ప్రియాంక, అస్సాం ఎఫ్‌డిసి ఎండి ప్రశాంత్ బారువా పాల్గొన్నారు.

## మహేష్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

36 మంది నుంచి 52 నామినేషన్ సెట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఎన్నికలకు నామినేషన్ దాఖలు ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఈ నెల 19వ తేదీ నుండి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జరుగుతున్న నామినేషన్ స్వీకరణలో శుక్రవారం వరకు మొత్తం 36 మంది అభ్యర్థులు 52 సెట్ల నామినేషన్లు సమర్పించినట్టు వెల్లడించారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నామని ఆమె చెప్పారు.
నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ నవంబర్ 22తో ముగుస్తుందన్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అవసరమైన ఫారాలను పూర్తి వివరాలతో పూరించి సమర్పించాలని అభ్యర్థులను సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక కార్యనిర్వాహక మెజిస్ట్రేట్ జ్యోతి, లా ఆఫీసర్ శ్రీధర్, డిసిఒ ప్రసన్, జిల్లా కోఆపరేటివ్ శాఖాధికారులు సుమలత, ఎండి.అజర్ యాఖూబ్, మహేష్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడులకు స్వర్గధామం

వ్యాపార వేత్తల సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్ర మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో డిప్యూటీ సిఎం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డెల్లాయిట్, ఇవై, ఎపిఎంజి, బిసిజి, పిడబ్ల్యూసి, జెఎల్‌ఎల్ సహా పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతోందని డిప్యూటీ సిఎం ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అర్థికాభివృద్ధికి, పెట్టుబడులకు వాతావరణ పరిస్థితులు, భౌగోళిక అంశాలతో పాటుగా నైపుణ్యంతో కూడిన తక్కువ ధరలకే మానవ వనరులు అందుబాటులో ఉండడం కలిసి వచ్చే అంశాలని, దేశంలో ఈ విధమైన రాష్ట్రం మరెక్కడా లేదని పెట్టుబడిదారులకు డిప్యూటీ సిఎం వివరించారు. తెలంగాణ అభివృద్ధి యాత్రలో భాగస్వాములు కావాలని, పెట్టుబడిదారుల సహకారంతో తెలంగాణ రైజింగ్ 2047 మరింత గొప్ప విజయంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్టు డిప్యూటీ సిఎం తెలిపారు. రాష్ట్రంలో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా బలంగా ఉందని, పరిశ్రలకు ప్రభుత్వం 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం అందిస్తోందని, భవిష్యత్‌లో విద్యుత్ కొరత లేకుండా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ సిఎం పెట్టుబడిదారులకు వివరించారు.
అందులో భాగంగా గ్రీన్ ఎనర్జీకి దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతోందని, కృష్ణా, గోదావరి వంటి జీవ నదుల మధ్యలో రాష్ట్రం ఉండడం వల్ల నీటి కొరతలేదని, గృహవినియోగానికే కాకుండా పరిశ్రమల అవసరాలు తీర్చేందుకు కూడా ఇప్పటికే మౌలిక వసతుల కల్పన పూర్తి చేశామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, పరిశ్రమలు, ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, సింగరేణి సిఎండి ఎన్.బలరామ్, పరిశ్రమలు, వాణిజ్య, ఐటిఇసి స్పెషల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## కొండాపూర్‌లో 4 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. కబ్జా చేసిన వేలాది కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్ని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంటోంది. కొండాపూర్‌లో శుక్రవారం వందల కోట్ల విలువైన భూమిని కాపాడింది. కొండాపూర్‌లో 4 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. పార్కులు, ప్రజావసరాల భూములను బై నెంబర్‌లతో ప్లాట్లుగా మార్చే ప్రయత్నాలకు చెక్ పెట్టింది. ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి కబ్జాకు గురైన స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. శ్రీ వేంకటేశ్వర హెచ్‌ఎల్ కాలనీలో 57.20 ఎకరాల్లో 627 ప్లాట్ల లేఔట్ ఉంది. స్థానికంగా ఉన్న పార్కులను 11 ప్లాట్లుగా విభజించి అమ్మేసినట్లు హైడ్రా నిర్ధారించింది. మూడు పార్కుల్లో రెండింటిని కూడా బై నెంబర్లతో విక్రయించినట్లు గుర్తించింది. బౌన్సర్లను పెట్టి లోపలికి రాకుండా అడ్డంకులు సృష్టించినట్లు నివాసితుల ఆరోపిస్తున్నారు. రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు ఆధారంగా హైడ్రా విచారణ జరిపి ఆక్రమణకు గురైన పార్కులను స్వాధీనం చేసుకుంది. దీంతో కాలనీ వాసుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాకు ధన్యవాదాతు తెలుపుతున్నారు.

## నేడు రవీంద్రభారతిలో మహాకవి అందెశ్రీ సంతాప సభ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాకవి, తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రచయిత డా.అందెశ్రీ సంతాప సభను నేడు రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, తెలంగాణ సాంస్కృతిక సారథి అధ్యక్షులు డా.వెన్నెల గద్దర్ హాజరై అందెశ్రీకి నివాళులు అర్పిస్తారని చెప్పారు. ఈ సభలో రాష్ట్రంలోని కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు పాల్గొని మహాకవికి నివాళులు అర్పించాలని కోరారు.

## విద్యార్థి నాయకుడు ఉప్పల ఉదయ్‌ను విడుదల చేయాలి

ఎఐఎస్‌ఎఫ్ ఒయు కౌన్సిల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై నిత్యం పోరాడుతున్న ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థి నాయకుడు ఉప్పల ఉదయ్ కుమార్‌ని బేషరతుగా విడుదల చేయాలని, అదేవిధంగా కేసును ఎత్తివేయాలని ఎఐఎస్‌ఎఫ్ ఒయు అధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. లేనియెడల ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులను, విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఒయు అధికారులు నియంతృత్వంగా వ్యవహరిస్తూ, డిప్యూటీ రిజిస్ట్రార్ శారద ఫిర్యాదు మేరకు అక్రమ కేసు పెట్టి ఉదయ్‌ను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

## విద్యార్థులను అభినందించిన సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇఎంఆర్‌ఎస్ 4వ జాతీయ స్పోర్ట్స్‌మీట్–2025లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సాధించిన తెలంగాణ విద్యార్థులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, జూడో, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో, యోగా, షూటింగ్, చెస్ ఇతర ఈవెంట్లలో అన్ని రాష్ట్రాల కంటే అత్యధికంగా రికార్డ్ స్థాయిలో 230 పతకాలను సాధించిన తెలంగాణ విద్యార్థులకు సిఎం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈనెల 15వ తేదీన జరిగిన 4వ ఎంఆర్‌ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్2025లో వివిధ క్రీడా పోటీల్లో దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలలోని 499 ఇఎంఆర్‌ఎస్ సంస్థలకు చెందిన 5,500 మంది విద్యార్థులు పాల్గొనగా తెలంగాణలోని 23 ఎంఆర్‌ఎస్ సంస్థలకు చెందిన 580 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత, జట్టు ఈవెంట్లలో అత్యుత్తమ ప్రదర్శనను ప్రదర్శించిన తెలంగాణ విద్యార్థులు మొత్తం 714 పాయింట్లతో అద్భుతమైన ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**టెండర్ నెం.GR/E.29/I/209, తేదీ:15.11.2025** PUB/1463

భారత రాష్ట్రపతి తరపున, ఎలక్ట్రికల్ బ్రాంచ్ ఆఫ్ ది చీఫ్ వర్క్ షాప్ మేనేజర్, సౌత్ సెంట్రల్ రైల్వే, వ్యాగన్ వర్క్ షాప్, గుంటుపల్లి -521 241 ఈ క్రింది పనుల కోసం 15.12.2025న 14-45 గంటల వరకు సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నం. :** GR/E. 29 / I /209, తేదీ: 15. 11. 2025 **వివరణ:** 1) WWSGTPL కాలనీలోని టైప్-II స్టాఫ్ క్వార్టర్స్ 48 యూనిట్ల కోసం పాత రకం బ్యాటెన్ అల్యూమినియం వైరింగ్ను కొత్త రాగి వైరింగ్ మరియు ఉపరితల మాడ్యులర్ స్విచ్ బోర్డులతో మరమ్మతులు & భర్తీ చేయడం. 2) స్క్రాప్ డిపో WWS/GTPL వద్ద కొత్తగా ప్రతిపాదించబడిన లోడింగ్ షెడ్లకు విద్యుత్ ఏర్పాట్లు మరియు వైరింగ్ ఏర్పాటు షెల్టర్లు మరియు నీటి కనెక్షన్లతో స్క్రాప్ డంప్ యార్డ్‌లో CC రోడ్ల నిర్మాణం దృష్ట్యా మరియు స్క్రాప్ డిపో WWS/GTPL వద్ద NF వస్తువులను నిల్వ చేయడానికి గోడౌన్ నిర్మాణం దృష్ట్యా విద్యుత్ ఏర్పాట్లు & వైరింగ్. 3) వర్క్‌షాప్‌లలో నిర్వహణ సౌకర్యాల పెంపుదల కోసం మౌలిక సదుపాయాల అప్‌గ్రేడ్ దృష్ట్యా WWS/GTPL వద్ద AJTB లాత్ మరియు CNC ఎయిర్-ప్లాస్మా కటింగ్ మెషిన్ కోసం విద్యుత్ ఏర్పాట్ల ఏర్పాటు. **పరిమాణం:** 01 పూర్తయిన వ్యవధి: 12 నెలలు. **టెండర్ విలువ (రూ):** 45,50,933.47- (రూపాయలు నలభై ఐదు లక్షల యాభై వేల తొమ్మిది వందల ముప్పై మూడు మరియు నలభై ఏడు పైసలు మాత్రమే). **బిడ్ సెక్యూరిటీ/ డిపాజిట్ చేయాల్సిన ఎర్నెస్ట్ మనీ (రూ):** 91,000/- (రూపాయలు తొంభై ఒక్క వేలు మాత్రమే). **టెండర్ డాక్యుమెంట్ ధర (రూ):** ఉచిత ఆఫర్ చెల్లుబాటు: ప్రారంభ తేదీ నుండి 60 రోజులు **టెండర్ రకం:** పనులు IRGCC-2022 ద్వారా నిర్వహించబడే టెండర్. **టెండర్ విధానం:** ఓపెన్ టెండర్ - సింగిల్ ప్యాకెట్. **పని యొక్క సారూప్య స్వభావం:** వర్తించదు **టెండర్ ముగింపు సమయం & తేదీ:** తేదీ 15-00 గంటలు తేదీ 15.12.2025 **టెండర్ ప్రారంభ సమయం & తేదీ:** తేదీ 15-15 గంటలు తేదీ 15.12.2025 **టెండర్ డాక్యుమెంట్ మరియు దిద్దుబాటు:** టెండర్ డాక్యుమెంట్ మరియు మార్పులు / దిద్దుబాటు కోసం http://www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ప్రారంభ తేదీ సెలవు దినంగా ప్రకటిస్తే, టెండర్లు తదుపరి పని దినం అదే సమయాల్లో తెరవబడతాయి.

డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, WWS/గుంటుపల్లి

**ఇ-టెండర్ నోటీస్ నెం.42 - 2025 తేదీ: 21 /11/2025** PUB/1464

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఇంజనీర్ / కోఆర్డినేషన్ / గుంతకల్ ఈ క్రింది పనులకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు **ముగింపు తేదీ & సమయం: 19.12.2025 మధ్యాహ్నం 3:00 గంటలకు**

**క్ర.సం.:** 01 **టెండర్ నెం.:** Engg-GTL-West-1988 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: DMM-GY & DMM-PAK సెక్షన్లు: DEN/West అధికార పరిధిలోని ADEN/ATP & ADEN/MPL సబ్ డివిజన్లలో సెస్‌ను తయారు చేయడానికి ప్రతిపాదిత సెస్సు మరమ్మత్తు/ విస్తరించే పని. (అనుబంధం ప్రకారం స్థానాలు) **(రూ)లో ప్రకటించిన విలువ :** 2,70,58,536.00 **(రూ)లో బిడ్ సెక్యూరిటీ మొత్తం :** 2,85,300.00

**క్ర.సం.:** 02 **టెండర్ నెం.:** Engg-GTL-West-1989 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: - DMM-GY, KPDTPTY & DMM-PAK విభాగాలు: - **SW-I :** CTR(P) - 8.341 Tkm, TRR(P) - 12.623 Tkm,, TSR(P) - 6.300 Tkm. **SW-II**: - TFR(All) - 70.004 కి.మీ **SW - III :** - TTR / TTRR - 111 సెట్లు ((FS + TWS +WCMSC) - 07 సెట్లు , (TWS+WCMSC) - 22 సెట్లు & (WCMSC) - 82 సెట్లు) DEN/West/GTL అధికార పరిధిలో (అనుబంధం ప్రకారం స్థానాలు). **(రూ)లో ప్రకటించబడిన విలువ:** 4,14,14,059.04 **(రూ)లో బిడ్ సెక్యూరిటీ మొత్తం:** 3,57,100.00

ఏదైనా కొరిజెండా ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.

డివిజనల్ రైల్వే మేనేజర్/ వర్క్స్/గుంతకల్

**టెండర్ నెం. GTL-EM-60-2025-26 తేదీ: 20.11.2025** PUB/1465

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / నిర్వహణ/ గుంతకల్ ఈ క్రింది పనులకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నంబర్:** GTL-EM-60-2025-26 **పని పేరు:** గుంతకల్ డివిజన్: రాయచూర్, యాద్గిర్ మరియు పాకాల స్టేషన్ భవనాలలో మరియు రాయచూర్, యాద్గిర్, మంత్రాలయం రోడ్, ధోన్, తాడిపత్రి, ఆదోని, రాజాంపేట మరియు గూటి రైల్వే స్టేషన్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలపై 13 ప్యాసింజర్ లిఫ్టులు ఏర్పాటు (లిఫ్ట్‌ల భాగం) **సుమారు విలువ (రూ):** 5,48,65,022/-

**ముగింపు తేదీ మరియు సమయం: 12-12-2025 మధ్యాహ్నం 15.00 గంటలకు** టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కోసం **http://www.ireps.gov.in** కు లాగిన్ అవ్వండి. టెండర్ యొక్క కొరిజెండమ్, ఏదైనా ఉంటే ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండరుదారులు టెండర్ డాక్యుమెంట్‌ను **http://www.ireps.gov.in** నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. **గమనిక:** ఈ ఇ-టెండరులో పాల్గొనడానికి/ బిడ్ చేయడానికి, టెండరుదారుడికి చెల్లుబాటు అయ్యే DSC (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్) కలిగి ఉండాలి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్

**టెండర్ నోటీసు నం: 47/2025 తేదీ: 21.10.2025. స్టోర్స్ వస్తువుల సరఫరా ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు** PUB/1469

కింది టెండర్లు ఆన్‌లైన్‌లో దాఖలు చేయబడ్డాయి. టెండర్లు **www.ireps.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించి తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలని అభ్యర్థించబడింది. టెండర్ వివరణ, Qty, EMD, SD వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మాన్యువల్‌గా సమర్పించిన ఆఫర్లు అంగీకరించబడవు. పోస్ట్ ద్వారా ఆఫర్లు స్వీకరించబడవు. టెండర్ ముగింపు సమయం టెండర్ గడువు తేదీ నుండి 14.30 గంటలు. అన్ని స్వదేశీ ఆఫర్ల కోసం, **www.ireps.gov.in** లో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా మాత్రమే EMD అంగీకరించబడుతుంది.

| టెండర్ నం. | సంక్షిప్త వివరణ |
|---|---|
| 38252187B | కాస్నబ్ 22HS బోగీ ఔటర్ స్ప్రింగ్ |
| 30253550 | రబ్బరు స్ప్రింగ్ సెట్లు కోసం డ్రా గేర్ |
| 38252359 | పాలిమర్ ప్యాకింగ్ వాషర్ |
| 75251223A | వినైల్ కోటెడ్ అప్హోల్స్టరీ ఫాబ్రిక్ (కృత్రిమ తోలు) |
| 38251147 | వైడ్ జా అడాప్టర్ (AAR స్టాండర్డ్ వైడ్ జా క్లాస్ 'E') |
| 29251415 | EP సెచెరాన్ కాంటాక్టర్ కోసం MOH కిట్ |
| LH257147 | సరఫరా, ఇన్‌స్టాలేషన్ కమిషనింగ్ ఆఫ్ ఇంటర్‌ఫేస్ ఆఫ్ ఫైర్ / స్మోక్ డిటెక్షన్ సిస్టమ్ |
| 82254944 | క్యాత్ ల్యాబ్ ఉపయోగం కోసం పరికరం PH (153054) కోసం ZRC (153054) బెలూన్ ఎక్స్పాండబుల్ ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ (TAVR) |
| 29251356 | లాబ్రింత్ మరియు బేరింగ్ క్యాప్ సెట్ |
| 38251154 | స్ప్రింగ్ ప్లాంక్ కాస్నబ్ 22HS బోగీ |
| 30251106 | యాక్సిల్ బాక్స్ కోసం రియర్ కవర్ |
| 66258636 | ట్రాక్ మెషిన్ విడిభాగాలు ప్లాసర్ యొక్క మేక్ |
| 66258126 | TM విడిభాగాల సేకరణ |
| 66259370 | TM విడిభాగాల సేకరణ |
| 81255002B | షీల్డింగ్ గ్యాస్ |
| 6025PT030 | గ్లూడ్ జాయింట్ కోసం 60 కిలోల RDSO Drg.No.T-2572 కి అనుగుణంగా PSC స్లీపర్లపై రైలు |
| 66259043 | ట్రాక్ మెషిన్ వస్తువుల సేకరణ. |

**గమనిక: - టెండర్ తెరవడానికి గడువు తేదీలు:** తేదీ: 08.12.2025న క్ర.సం. 01. తేదీ: 09.12.2025న క్ర.సం. 02. తేదీ: 10.12.2025న క్ర.సం. 03. తేదీ: 11.12.2025న క్ర.సం. 04 నుండి 06. తేదీ: 12.12.2025న క్ర.సం. 07 & 08. తేదీ: 15.12.2025న క్ర.సం. 09 నుండి 12 వరకు. తేదీ: 16.12.2025న క్ర.సం. 13. తేదీ: 17.12.2025న క్ర.సం. 14 & 15. తేదీ: 22.12.2025న క్ర.సం. 16. తేదీ: 23.12.2025న క్ర.సం. 17.

సవరణ

1) టెండర్ నోటీసు నెం.46/2025 తేదీ. 14.11.2025 టెండర్ నంబర్: SCR-CAP-TRT25 తేదీ 05.12.2025 గడువు తేదీ బ్రీఫ్; USA లోని Harsco Rail make కు IR కోసం TRT విడిభాగాల సరఫరా కోసం RC ని ఇప్పటికే ఉన్న దానికి బదులుగా టెండర్ నంబర్: SCR-CAP-TRT25గా చదవవచ్చు. 2) టెండర్ నోటీసు నెం.44/2025 తేదీ. 31.10.2025 తేదీ. 29255020A తేదీ 21.11.2025 తేదీ బ్రీఫ్; E-70 బ్రేక్ సిస్టమ్ కోసం ఎలక్ట్రానిక్స్ కార్డ్‌ల సెట్‌ను ఇప్పటికే ఉన్న దానికి బదులుగా గడువు తేదీ 28.11.2025గా చదవవచ్చు.

**పైన పేర్కొన్న టెండర్ల పక్కన రూ.50 లక్షల కంటే ఎక్కువ విలువ కలిగిన** ఇతర టెండర్లు ఉన్నాయి.

వివరాల కోసం, దయచేసి పైన ఉన్న రైల్వే వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్/సికింద్రాబాద్

**టెండర్ నెం. GTL-EM-61-2025-26 తేదీ: 20.11.2025** PUB/1466

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ నిర్వహణ/ గుంతకల్ ఈ క్రింది పనులకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నంబర్:** GTL-EM-61-2025-26 **పని పేరు:** గుంతకల్ డివిజన్: రాయచూర్, యాద్గిర్, డోన్, తాడిపత్రి, పాకాల మరియు అనంతపురం రైల్వే స్టేషన్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలపై 20 ప్యాసింజర్ లిఫ్ట్‌ల ఏర్పాటు (లిఫ్ట్‌ల భాగం) **సుమారు విలువ (రూ):** 4,28,79,212.88/-

**ముగింపు తేదీ మరియు సమయం: 12-12-2025 మధ్యాహ్నం 3 గంటలకు** టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కోసం **http://www.ireps.gov.in** కు లాగిన్ అవ్వండి. టెండర్ యొక్క దిద్దుబాటు ఏదైనా ఉంటే ఆన్లైన్లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండర్ పత్రాన్ని టెండరుదారులు http://www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చు. **గమనిక:** ఈ ఇ-టెండర్లో పాల్గొనడానికి / బిడ్ చేయడానికి, టెండరుదారుడు చెల్లుబాటు అయ్యే DSC (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్) కలిగి ఉండాలి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్లు

**టెండర్ నెం. 22A-GSU-25-26-Sr.DEE-M-HYB** PUB/1467

భారత రాష్ట్రపతి తరపున **Sr.DEE-M-HYB** ఈ క్రింది టెండర్ల ముగింపు తేదీకి ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. **18-12-2025, 15:00.** బిడ్డర్లు తమ అసలు/ సవరించిన బిడ్డను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అందుకున్న అటువంటి మాన్యువల్ ఆఫర్లు ఏవైనా విస్మరించబడుతుంది.

**క్ర.సం.:** 01 **పని వివరణ:** టెండర్ నం. 22A-GSU-25-26-Sr.DEEM- HYB: హైదరాబాద్ డివిజన్: SCMUE: ప్యాసింజర్ ప్రాంతాలలో ఇల్యూమినేషన్ స్థాయిలకు మెరుగుదలలు - ప్లాట్‌ఫారంలు మరియు స్టేషన్ ప్రాంగణం - విద్యుత్ ఏర్పాట్లు (మిగిలిన పనులు) **సుమారు (రూ.)లో ఖర్చు:** 3,79,47,912/- **EMD (రూ.):** 3,39,700/- **పూర్తి కాలం:** 12 నెలలు **ముగింపు తేదీ:** 18-12-2025

వెబ్‌సైట్ వివరాలు: **www.ireps.gov.in** టెండర్ యొక్క పూర్తి వివరాలను చూడగలిగే నోటీసు బోర్డు స్థానం: Sr.DEE-M-HYB కార్యాలయం, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్-500071

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, హైదరాబాద్

**టెండర్ నోటీసు** PUB/1468

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా 12.12.2025 వరకు 15.00 గంటల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కింది పనులకు ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.


**క్ర.సం.:** 01 **టెండర్ నంబర్ & తేదీ:** C SG 36 578 తేదీ: 21.11.2025 ముగింపు తేదీ: 12.12.2025 **పని పేరు:** దక్షిణ మధ్య రైల్వే-భారతీయ రైల్వేలపై టెలికాం మౌలిక సదుపాయాల పెంపు మరియు అప్‌గ్రేడేషన్: SC డివిజన్‌లోని సబ్ డివిజన్ కార్యాలయాలు, OFC హట్స్ మరియు SSE కార్యాలయాలలో LAN మౌలిక సదుపాయాలు పెంపు మరియు టెలికాం నెట్‌వర్క్ సౌకర్యాన్ని పెంచడం మరియు బలోపేతం చేయడం. (IRPSM ID. 11.05.33.24.3.54.018) **సుమారు విలువ (రూ):** 5,25,56.623.94 **బిడ్ సెక్యూరిటీ/EMD (రూ):** 4,12,800/-

మరిన్ని వివరాల కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి; GCC 2022 ప్రకారం బిడ్ సెక్యూరిటీ/EMD చెల్లించాలి
* IRSGCC-2022 ప్రకారం, అన్ని టెండరుదారులకు ఇ-టెండర్ ఫారమ్‌లు ఉచితంగా జారీ చేయబడతాయి. (రిఫరెన్స్: IRGCC 2022 పార్ట్-I, క్లాజ్-3.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్/Co-ord/ సికింద్రాబాద్

A1861

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## కార్మికుల సంక్షేమంపై దృష్టి పెట్టండి: అమర్‌జిత్ కౌర్

**న్యూఢిల్లీ:**కార్మికుల సంక్షేమంపై దృష్టి పెట్టాలని, పోరాడి సాధించుకున్న చట్టాలను నీరుగార్చవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కేంద్ర కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కార్మికుల పక్షాన 20 అంశాలతో కూడిన పత్రాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సమర్పించారు. 202627 బడ్జెట్‌పై సంప్రదింపుల కోసం ఆర్థిక మంత్రి అధ్వర్యంలో శుక్రవారం జరిగిన చర్చల్లో ఏఐటీయూసీ కార్యదర్శి కౌర్ పాల్గొన్నారు. సుంకాల బెదిరింపులు పెరుగుతున్న దృష్ట్యా దేశీయ డిమాండ్‌ను పెంచేందుకు తక్షణ చర్యలను డిమాండ్ చేశారు. కేంద్ర పథకాల లెక్కా పత్రాలు సక్రమంగా ఉండేలా చూడాలని, పార్లమెంటులో ప్రవేశపెట్టే ఆడిట్ నివేదికలు తగ్గుతుండటాన్ని గమనించాలని సూచించారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ కవరేజిఅర్హతా పరిధి పె ంచాలని కో రారు. కార్మికుల వేతనాలు, కనీస పింఛన్ పెంచాలన్నారు. జన్ వికాస్ చట్టం ద్వారా కార్మిక చట్టాలు, బాయిలర్ల చట్టం కింద నేరాలు శిక్షార్హంగా ఉండాలన్నారు.

## నెహ్రూ రచనలు చరిత్ర మాత్రమే కాదు...

### భారతదేశ పరిణామశీల మనస్సాక్షికి నిదర్శనం : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ రచనలు కేవలం చరిత్ర మాత్రమే కాదని, అవి భారతదేశ పరిణామశీల మనస్సాక్షికి నిదర్శనమని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య ప్రయాణాన్ని అర్థం చేసుకోవాలనుకునే ఎవరికైనా ఆయన మాటలు శక్తివంతమైన దిక్సూచిగా మిగిలిపోతాయన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ సెలెక్టెడ్ వర్క్స్ డిజిటలైజేషన్ పూర్తయిన సందర్భంగా రాహుల్ గాంధీ పైవిధంగా వ్యాఖ్యానించారు. జవహర్‌లాల్ నెహ్రూ సెలెక్టెడ వర్క్స్ ఇప్పుడు 100 వాల్యూమ్‌ల మొత్తం సెట్‌తో ఆన్‌లైన్‌లో ఉందని, అం దులో దాదాపు 35,000 పత్రాలు, దేశ తొలి ప్రధానమంత్రికి సంబంధించిన దాదాపు 3,000 దృష్టాంతాలు ఉన్నాయన్నారు. ఈ చర్యను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే కూడా ప్రశంసించారు.

'వాస్తవాలు... వాస్తవాల.. మీ ఇష్టానుసారంగా అవి అదృశ్యం కావు' అన్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ భారతదేశం కోసం ఆయన సాధించిన అద్భుతమైన విజయాల గురించి ఉద్దేశపూర్వక వక్రీకరణ, తప్పుడు సమాచారం ఉన్న యుగంలో, సత్యం, భావితరాల కోసం నెహ్రూ రచనలను డిజిటలైజ్ చేయడం ప్రశంసనీయమని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. నెహ్రూ రచనలు కేవలం చరిత్ర మాత్రమే కాదు, అవి భారత దేశం అభివృద్ధి చెందుతున్న మనస్సాక్షికి సంబంధించిన రికార్డు అని రాహుల్‌గాంధీ అన్నారు. మన దేశ ప్రజాస్వామ్య ప్రయాణాన్ని, దేశ ధైర్యం, సందేహాలు, కలలు అర్థం చేసుకోవాలనుకునే ఎవరికైనా ఆయన మాటలు శక్తివంతమైన దిక్సూచిగా మిగిలిపోయాయని పేర్కొన్నారు. ఈ వారసత్వం ఇప్పుడు తెరిచి శోధించదగినదిగా అందరికీ ఉచితంగా లభించడం పట్ల సంతోషంగా ఉన్నానన్నారు. ఇది విస్తరిస్తూనే ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్ (జెఎన్ఎంఎఫ్) ట్రస్టీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ, రెండవ దశలో నెహ్రూకు రాసిన లేఖలను కనుగొనే ప్రయత్నాలు ఉంటాయని అన్నారు. 'గాంధీ–నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్–నెహ్రూ, సుభాష్ చంద్రబోస్–నెహ్రూ ఉత్తర ప్రత్యుత్తరాలు చాలా సమగ్రమైనవని, కానీ విన్‌స్టన్ చర్చిల్–నెహ్రూష రవీంద్రనాథ్ ఠాగూర్–నెహ్రూ వంటి కొన్ని ఇతర ఉత్తర ప్రత్యుత్తరాల విషయంలో అలా లేదని రమేష్ అన్నారు. గాంధీ, నెహ్రూ, పటేల్, బి ఆర్ అంబేద్కర్‌ష మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి ఆ కాలపు ప్రముఖుల ఆర్కైవ్‌లను ఏకీకృతం చేయాలని రమేష్ పిలుపునిచ్చారు. జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్ నవంబర్ 14, 2024న వాగ్దానం చేసినట్లుగా, జవహర్‌లాల్ నెహ్రూ ఎంపిక చేసిన రచనలు ఇప్పుడు పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రకటించడానికి సంతోషంగా ఉందన్నారు.

ఒరిజినల్ ప్రింట్ వెర్షన్ కాపీలు, డిజిటల్ టెక్స్ట పాటు కూడా అందుబాటులో ఉన్నాయని జెఎన్ఎంఎఫ్ తెలిపింది. 1920 నుండి 1960 వరకు భారత చరిత్రలోని ఏదైనా అంశాన్ని అధ్యయనం చేయాలనుకునే ఎవరికైనా ఈ ఆన్‌లైన్ వెర్షన్ అపారమైన ప్రయోజనాన్ని అందిస్తుందని, ఆ సంవత్సరాలలో నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన నాయకుడిగా ఉండి, ఆ తర్వాత దేశ ప్రధానమంత్రిగా ఉన్నారని ప్రకటన పేర్కొంది.

## మత్స్యకార్మికులకు మెరుగైన భద్రత కల్పించాలి : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** దేశంలోని మత్స్యకారుల సామాజికవర్గాన్ని రాహుల్‌గాంధీ ప్రశంసించారు. వారికి మెరుగైన భద్రత, వారి పట్టిన చేపలకు సరసమైన ధరలు, ఆధునిక సౌకర్యాలు కల్పించాలన్నారు. గౌరవ మర్యాదలకు వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన తన హృదయమంతా భారతదేశ మత్స్యకార వర్గాలతో నిండిపోయిందన్నారు. ఈ మేరకు శుక్రవారం రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'మీరు మా ప్లేట్లను నిండుగా ఉంచుతారు. ఆర్థిక వ్యవస్థను కదిలిస్తారు. మీరు మా జలాల సంరక్షకులు, పురాతన జ్ఞానాన్ని కాపాడేవారు. భారత దేశ సాంస్కృతిక నిర్మాణంలో విడదీయరాని భాగం' అని రాహుల్‌గాంధీ కొనియాడారు. తాను ఎల్లప్పుడూ మత్స్యకారులకు అండగా నిలబడుతానన్నారు. ''మెరుగైన భద్రత, సరసమైన ధరలు, ఆధునిక సౌకర్యాలు, శుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన నదులు, సముద్రాలు, మీ పిల్లలకు మంచి విద్య, మీరు నిజంగా గౌరవ, మర్యాదలకు అర్హులు' అని అని మాజీ కాంగ్రెస్ చీఫ్ అన్నారు. నవంబర్ 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం జరుపుకుంటారు. ఇది ఆహారం, పోషక భద్రత, జీవనోపాధి ఉత్పత్తి, పర్యావరణ సమతుల్యతకు మద్దతు ఇవ్వడంలో స్థిరమైన మత్స్యకార, ఆక్వాకల్చర్ కీలక పాత్రను ఉద్ఘాటిస్తుంది. ఈ దినోత్సవం 1997 నుండి ప్రారంభమైంది. 18 దేశాల ప్రతినిధులు న్యూఢిల్లీలో సమావేశమై ప్రపంచ మత్స్యకార వేదికను స్థాపించారు. భారతదేశంలో ఈ దినోత్సవం ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఎందుకంటే భారతదేశం ప్రపంచవ్యాప్తంగా చేపలు, ఆక్వాకల్చర్‌లో రెండవ అతిపెద్ద ఉత్పత్తిదారు. ప్రపంచంలోని ప్రముఖ రొయ్యల ఉత్పత్తిదారులలో ఒకటిగా ఉంది.

## గవర్నర్లకు డెడ్‌లైన్ ఉండాల్సిందే..

**చెన్నై:** బిల్లులపై నిర్ణయం తీసుకునేలా గవర్నర్లకు గడువు విధించేవిధంగా రాజ్యాంగంలో సవరణలు తెచ్చేవరకు తమ పోరాటం ఆపబోమని తమిళనా డు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ వెల్లడించారు. శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు స మ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని సుప్రీంకోర్టు స్పష్టంచేసినసంగతితెలిసిందే. స్టాలన్ తొలిసారిగా స్పందించారు. ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన అభిప్రాయం.. ఏప్రిల్ 8 నాటి తీర్పును (తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్) ప్రభావితం చేయలేదు. వాస్తవానికి ఎన్నికైన ప్ర భుత్వం డ్రైవర్ సీటులో ఉండాలని, రాష్ట్రంలో రెండు పాలక వర్గాలు ఉండకూడదని సుప్రీంతీర్పుపునరుద్ఘాటించింది. బిల్లులను పక్కన పడేసేలా వీటో అధికారం చూపే అవకాశం గవర్నర్లకు ఉండదు. బిల్లులను నిలిపివేసే అధికారం వారికి లేదు. రాష్ట్ర హక్కులు, సమాఖ్యవాదం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది' అని స్టాలిన్ స్పష్టం చేశారు.

### భారత్–ఆఫ్ఘనిస్థాన్‌ల ద్వైపాక్షిక వర్తకం పునరుజ్జీవానికి...

## వాణిజ్య అటాచ్‌ల నియామకం

### ద్వైపాక్షిక సమావేశంలో ఇరుదేశాల మంత్రులు నిర్ణయం



**న్యూఢిల్లీ :** ప్రస్తుతం 1 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పునరుజ్జీవింపజేయడానికి భారతదేశం, ఆఫ్ఘనిస్థాన్ పరస్పరం ఇరుదేశాల రాజధానుల్లో వాణిజ్య అటాచ్‌లను నియమించుకోవాలని నిర్ణయించాయి. గురువారం ఇక్కడ జరిగిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి జితిన్ ప్రసాద్, ఆఫ్ఘనిస్థాన్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి హజ్జి నూరుద్దీన్ అజిజి మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. గురువారంనాడు విదేశీ వ్యవహారాల మంత్రి, కేంద్ర వాణిజ్య శాఖ సహాయ మంత్రితో జరిగిన సమావేశంలో ఇరువైపులా ద్వైపాక్షిక వాణిజ్య సహకారాన్ని మద్దతు ఇవ్వడానికి ఇరువైపు దేశాల రాయబార కార్యాలయాలలో వాణిజ్య అటాచ్‌లను నియమించుకోవాలన్న అంశంపై అంగీకారం కుదిరింది. ఆఫ్ఘనిస్థాన్ మంత్రి త్వరలోనే ఇక్కడి రాయబార కార్యాలయానికి ట్రేడ్ అటాచ్‌ను పంపించనున్నారు అని జాయింట్ సెక్రటరీ (పిఎఐ డివిజన్) ఎం.ఆనంద్ ప్రకాష్ శుక్రవారం చెప్పారు. కాబూల్ ఢిల్లీ సెక్టార్, కాబూల్ అమృత్‌సర్ మార్గాలలో ఎయిర్ ఫ్రైయిట్ కారిడార్‌ను కూడా ప్రారంభించనున్నట్లు ప్రకాష్ చెప్పారు. ఈ సెక్టార్లలో కార్గో విమానాలు త్వరలో ప్రారంభించబడతాయని, దీని వల్ల మన ద్వైపాక్షిక వాణిజ్యం మరింత బలోపేతం కానున్నదని ఆయన నొక్కిచెప్పారు. పదే పదే సరిహద్దు మూసివేతలు, వాణిజ్య మార్గాల రాజకీయ దుర్వినియోగం కారణంగా మూడు నెలల్లోపు తరచూ పాకిస్థాన్‌తో వ్యాపారాన్ని దశలవారీగా ముగించాలని ఆఫ్ఘన్ ఉప ప్రధానమంత్రి ముల్లా అబ్దుల్ ఘని బరదార్ వ్యాపారులను ఆదేశించిన కొద్ది రోజుల అనంతరం వెలువడిన ఈ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతదేశం, ఆఫ్ఘనిస్థాన్ ఇరుదేశాలు కూడా వర్తకం, వాణిజ్యం, పెట్టుబడులపై ఉమ్మడి వర్కింగ్ గ్రూప్‌లను పునరుజ్జీవింపజేయాలని కూడా నిర్ణయించాయి. చాబహార్ పోర్ట్ మార్గాన్ని పూర్తిగా అమలుచేయడం, కస్టమ్స్, బ్యాంకింగ్ విధానాలను సరళీకృతం చేయడం ద్వారా 2021కు ముందున్న 1.8 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వర్తకాన్ని ప్రోత్సహించే ధ్యేయంతో ముందుకు సాగుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. చర్చల సందర్భంగా అజిజి మాట్లాడుతూ చాబహార్ పోర్ట్ నుండి రెగ్యులర్ షిప్పింగ్ లైన్ల వ్యాపార వీసాలను వేగంగా జారీ చేయాలని నిమ్రుజ్ ప్రావిన్స్ లోని డ్రైపోర్టుల అభివృద్ధి, నవ షెవా పోర్ట్ వద్ద వస్తువుల దిగుమతులుఎగుమతి ప్రక్రియ ఆఫ్ఘనిస్థాన్ కోసం సులభతరం చేయాలని ఆకాంక్షించారు. ఫార్మాస్యూటికల్స్‌లో ఉమ్మడి పెట్టుబడి ఔషధాలు, శీతల గిడ్డంగి చైన్లు, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్లు, పారిశ్రామిక పార్కులు, ఎంఎస్ఇ సెంటర్లు, ఎగుమతి ప్రక్రియ జోన్లు ప్రోత్సహించుకునేలా ఇరుదేశాలు కూడా అంగీకరించాయి. ఇరుదేశాలలో రెగ్యులర్‌గా ఎగ్జిబిషన్లు, బి2బి సమావేశాలు, సెక్టార్‌స్పెసిఫిక్ కాన్ఫరెన్స్ నిర్వహించాలని అజిజి పిలుపునిచ్చారు.

## బహిరంగ ప్రకటనలు చేయొద్దు

### కర్నాటకలో కాంగ్రెస్ నాయకత్వ మార్పుపై పార్టీ శ్రేణులకు అధిష్టానం తీవ్ర హెచ్చరిక



**బెంగళూరు:** కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై నాయకత్వం మార్పుపై తరుచూ పార్టీ ఎమ్మెల్యేలు వ్యాక్యలు చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం తీవ్రంగా హెచ్చరిచింది. పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు నాయకత్వంపై ఎటువంటి బహిరంగ ప్రకటనలు చేయవద్దని కర్ణాటక ఇన్‌చార్జ్ ఎఐసిసి జనరల్ సెక్రటరీ రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా ఘాటుగా మందలించారు. శివకుమార్‌కు విధేయులైన ఒక రాష్ట్ర మంత్రి, అనేక మంది ఎమ్మెల్యేలు న్యూఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ హైకమాండ్‌ను కలిసిన మరుసటి తర్వాత ఎఐసిసి హెచ్చరికలు చేసింది. మీడియాలోని ఒక వర్గంతో పాటు, నిర్ణయాత్మకంగా ఓడిపోయిన, వర్గపోరుతో నిండిన బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుర్మార్గపు ప్రచారం చేస్తోందని సుర్జేవాలా ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను అణగదొక్కడమే కాషాయ పార్టీ ఏకైక ఆలోచన ఆని ఆయన పేర్కొన్నారు. కర్ణాటక సిఎం, డిప్యూటీ సిఎంలతో చర్చించానని, నిర్ణయాత్మకంగా ఓడిపోయిన, వర్గపోరులో ఉన్న కర్ణాటక బిజెపి, మీడియాలోని ఒక వర్గంతో కలిసి ఉద్దేశపూర్వకంగా కర్ణాటక, కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయని వారు అంగీకరించారని ఆయన సుర్జేవాలా ఎక్స్‌లో పోస్టు చేశారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేల అనవసర ప్రకటనలు అనవసరమైన ఊహాగానాలకు ఆజ్యం పోశాయని రాజ్యసభ ఎంపి స్పష్టం చేశారు. 'నాయకత్వం అంశంపై లేదా స్వార్థ ప్రయోజనాలు ప్రచారం చేస్తున్న ఎజెండాకు లొంగకుండా కాంగ్రెస్ అదిష్టానం వారిని తీవ్రంగా హెచ్చరించిందని, వివిధ పార్టీ కార్యకర్తల అభిప్రాయాన్ని నాయకత్వం తెలుసుకుందని సుర్జేవాలా చెప్పారు. కాగా, గురువారం, శివకుమార్‌కు విధేయులైన ఒక మంత్రి, కొంతమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అగ్రనేతలను కలవడానికి న్యూఢిల్లీకి వెళ్లారు. ఇది అధికార పార్టీలో అధికార పోరును సూచిస్తుందని వర్గాలు తెలిపాయి. సిఎం సిద్ధరామయ్య రెండున్నర సంవత్సరాలు పదవీకాలం పూర్తి చేసుకున్న మరుసటి రోజు తర్వాత ఈ పరిణామం జరిగింది. 2023 మేలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య గట్టి పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఆయనను ఒప్పించి ఉప ముఖ్యమంత్రిని చేయగలిగింది. రొటేషనల్ ముఖ్యమంత్రి ఫార్ములా ఆధారంగా రాజీ కుదిరిందని ఆ సమయంలో కొన్ని నివేదికలు వచ్చాయని, దీని ప్రకారం రెండున్నర సంవత్సరాల తర్వాత శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారు, కానీ వాటిని పార్టీ అధికారికంగా ధృవీకరించలేదు. అయితే, సిద్ధరామయ్య ఈ నివేదికలను తిరస్కరించారు, తాను ఐదు సంవత్సరాలు పదవిలో కొనసాగుతానని నొక్కి చెప్పారు.

**సిద్ధకు డికె శుభాకాంక్షలు**

కాగా, ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుంటానని సిఎం సిద్ధరామయ్య చెప్పడంతో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతున్న సమయంలో ఎమ్మెల్యేలు ఢిల్లీలోని నాయకులను వెళ్లి కలవడంలో తప్పు లేదని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేయడమే కాకుండా భవిష్యత్తులో బడ్జెట్‌లను కూడా ప్రవేశపెడతానని సిద్ధరామయ్య శుక్రవారం మైసూరులో చేసిన ప్రకటనపై శివకుమార్ స్పందించారు. 'ఐదేళ్లు పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి చెప్పారు. ఆయనకు శుభాకాంక్షలు. మన మందరం కలిసి పనిచేద్దాం' అని అన్నారు. 'నాకు ఎలాంటి వర్గం లేదు. నేను ఏ వర్గానికీ నాయకుడిని కాదు. నేను 140 మంది (కాంగ్రెస్) ఎమ్మెల్యేలకు అధ్యక్షుడిని. నాకు, 140 మంది ఎమ్మెల్యేలందరూ ముఖ్యమైనవారే. నేను ఏ గ్రూపును నాతో తీసుకెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు లేదా నేను ఏ గ్రూపును ఏర్పాటు చేయాలనుకోవడం లేదు. నేను అలా చేయను. ఏదైనా గ్రూపును ఏర్పాటు చేయడం నా రక్తంలో లేదు. 140 మంది నా ఎమ్మెల్యేలే' అని ఆయన ఇక్కడ విలేకరులతో అన్నారు. తమ నాయకులను కలవడానికి అందరు ఎమ్మెల్యేలు అర్హులను, వారిని ఎవరూ ఆపలేరన్నారు.

### జి-20 శిఖరాగ్ర సమావేశంలో ..

## భారతదేశ దృక్పథాన్ని చాటిచెబుతా

### జోహాన్స్‌బర్గ్‌లో నవంబరు 21నుంచి 23వరకు జరుగనున్న సమావేశానికి బయల్దేరిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** 'వసుదైవ కుటుంబం', 'ఒకే భూమి ఒకే కుటుంబం', 'ఒక భవిష్యత్తు' అనే దార్శనికతకు అనుగుణంగా భారతదేశ దీర్ఘకాలిక దృక్పథాన్ని జి20 శిఖరాగ్ర సమావేశంలో చాటిచెబుతానని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నొక్కి చెప్పారు. ఆయన దక్షిణ ఆఫ్రికాలోని జోహాన్స్‌బర్గ్‌లో జరుగనున్న జి20 శిఖరాగ్ర సమావేశం మూడు రోజుల పర్యటన కోసం శుక్రవారం ఇక్కడ నుంచి బయల్దేరనున్నారు. ఆఫ్రికా ఖండంలో జి20 శిఖరాగ్ర సమావేశం జరగడం ఇదే మొదటిసారి. అయితే 2014 నుంచి భారత ప్రధానమంత్రి 12వ జి20 సమావేశం అని మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రధానమంత్రి దక్షిణ ఆఫ్రికాలోని జోహాన్స్‌బర్గ్ సమావేశానికి హాజరుకానున్నారు.'ఆఫ్రికాలో జరుగనున్న ఈ ప్రత్యేక సమావేశానికి ఎంతో విశిష్టత ఉంది.అక్కడ ప్రపంచస్థాయికి సంబంధించిన వివిధ సమస్యలు చర్చించబడతాయి. ఈ సమావేశానికి పలువురు ప్రముఖ ప్రపంచ నాయకులు హాజరవుతారు' అని మోదీ తన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ శిఖరాగ్రసమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ జోహాన్స్‌బర్గ్‌లో ఉన్న నాయకులు కొంతమందితో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. ప్రధాని మోదీ అక్కడ ఆరవ ఐబిఎస్ఎ సమావేశానికి కూడా హాజరుఅవుతారు. ప్రధానమంత్రి తన నిష్క్రమణ ప్రకటనలో, 'వసుదైవ కుటుంబం', 'ఒకే భూమి ఒకే కుటుంబం', 'ఒక భవిష్యత్తు' అనే మన దార్శనికతకు అనుగుణంగా భారతదేశం దృక్పథాన్ని నేను శిఖరాగ్ర సమావేశంలో ప్రస్తావిస్తాను' అని చెప్పారు. దక్షిణా ఆఫ్రికా అధ్యక్షతన జరుగనున్న 20వ జి20నాయకుల సమావేశానికి హాజరుకావాలన్న దక్షిణాఫ్రికాఅధ్యక్షుడు సిరిల్ రమాపోసా ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందర్శన దక్షిణ ఆఫ్రికాలో నవంబరు 21 నుంచి 23వరకు మూడు రోజులపాటు ఖరారు అయ్యింది. ఇది ఆఫ్రికాలో జరుగుతోన్న మొట్టమొదటి జి20 ప్రత్యేక సమావేశం కాబట్టి దానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, 2023లో జి20సమావేశానికి భారతదేశం అధ్యక్షత వహించిన సమయంలో ఆఫ్రికన్ యూనియన్ జి20 సభ్య దేశంగా మారిందని మోదీ తన ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం కీలకమైన ప్రపంచ సమస్యలను చర్చించడానికి ఒక వేదికగా ఉంటుందన్నారు. ఈ ఏడాది జి20 థీమ్ 'సంఘీభావం', 'సమానత్వం', 'స్థిరత్వం' అని, దీనిద్వారా దక్షిణ ఆఫ్రికాలో గతంలో న్యూఢిల్లీలో, రియోడీజెనీరోలో జరిగిన శిఖరాగ్ర సమావేశాల ఫలితాలను ముందుకు తీసుకెళ్లిందని మోదీ చెప్పారు. భాగస్వామ్య దేశాల నాయకులతో నా సంభాషణల కోసం, శిఖరాగ్ర సమావేశంలో జరుగనున్న 6వ ఐబిఎస్ఎ సమావేశంలో పాల్గొనడం కోసం నేను నిరీక్షిస్తున్నానని మోదీ తెలియజేశారు. ఈ పర్యటన సందర్భంగా భారతదేశం వెలుపల అతిపెద్ద దక్షిణ ఆఫ్రికాలో భారతీయ ప్రవాసులతో నా సంభాషణ కోసం కూడా నేను ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. కాగా బుధవారం నాడు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించిన ప్రకారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశానికి సంబంధించిన మూడు సెషన్లలో ప్రసంగించే అవకాశం ఉంది. దక్షిణ ఆఫ్రికాకు ముందు జి20 అధ్యక్షపదవులను 2024లో బ్రెజిల్, 2023లో భారతదేశం, 2022లో ఇండోనేషియా దేశాలు నిర్వహించాయి. జి20 వెబ్‌సైట్ ప్రకారం జి20సభ్యులలో ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలు ఉన్నాయి. ఇవి ప్రపంచ జిడిపిలో 85 శాతం, అంతర్జాతీయ ట్రేడ్‌లో 75శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల మేరకు ప్రాతినిథ్యం వహిస్తున్నాయి. జి20లో అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, భారతదేశం, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, ది రిపబ్లిక్ ఆఫ్ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణ ఆఫ్రికా, టర్కీ, ది యునైటెడ్ కింగ్‌డమ్, ది యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ది యురోపియన్ యూనియన్, ది ఆఫ్రికన్ యూనియన్ సభ్య దేశాలుగా ఉన్నాయి.

## ట్రంప్ వెళ్లనందుకే..

### జి20 సమ్మిట్‌కు ప్రధాని మోదీ హాజరు



**న్యూఢిల్లీ :** ప్రధాని మోదీపై కాంగ్రెస్ మరోసారి విమర్శలు గు ప్పించింది. దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న జి20 శిఖరాగ్ర సమావేశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెళ్లనందుకే ప్రధాని మోదీ హాజరవుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ఇటీవలే మలేసియాలోని కౌలాల ంపూర్ వేదికగా జరిగిన ఆసియాన్ సమ్మిట్‌కు డొనాల్డ్ ట్రంప్‌తో ముఖాముఖి సంభాషణను తప్పించుకోవడానికి ప్ర ధాని మోదీ వెళ్లలేదని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో ప్ర ధాని నరేంద్ర మోదీ పర్యటనపై జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. 'ప్రధాని మోదీ దక్షిణాఫ్రికాలో జరగబోయే జి20 శిఖరాగ్ర స మావేశానికి హాజరవుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ శిఖరాగ్ర సమావేశాన్ని బహిష్కరించడంతో ప్రధాని మోదీ సేఫ్ అయ్యారు. కొన్ని రోజుల క్రితం ఇండియా–ఆసియాన్ శిఖరాగ్ర స మావేశం కోసం మోదీ కౌలాలంపూర్‌కు వెళ్లలేదని మర్చిపోకండి. ఎందుకంటే ఆ సమ్మిట్‌కు అమెరికా అ ధ్యక్షుడు ట్రంప్ హాజరయ్యారు. ట్రంప్ నుంచి తప్పించుకునేందుకు ఆసియాన్ సమ్మిట్‌కు మోదీ హాజరుకాలేదు. దక్షిణాఫ్రికాలో జరగబోయే జి20 థీమ్ సంఘీభావం, సమాన త్వం, స్థిరత్వం.

**ఆ సమ్మిట్‌లో మోదీ పాల్గొంటారా? : జైరాం రమేశ్**

2026లో అమెరికా ఆతిథ్యం ఇవ్వనున్న తదుపరి జి20 శిఖరాగ్ర స మావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారిందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. 'జి20 అధ్యక్ష పదవి ఏటా రొటేషన్ అవుతుంది. 2023 నవంబరులో ఇండోనేసియా నుంచి భారత్ జి20 పగ్గాలను స్వీకరించింది. 2024లో భారత్ బ్రెజిల్‌కు జి20 ప గ్గాలు అప్పగించింది. ఈ ఏడాది జి 20 పగ్గాలను అమెరికాకు దక్షిణాఫ్రి కా అప్పగిస్తుంది. వచ్చే ఏడాది తదుపరి జి20 శిఖరాగ్ర సమావేశం అమెరికాలో జరుగుతుంది. అప్పటికి బ హుశా అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం పూర్తవుతుంది. అయితే గత ఏడు నెలల్లో తానే ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 61సార్లు చెప్పారు. రాబోయే ఏడాదిలో ఆయన ఆ వాదనను ఎన్నిసార్లు పునరావృతం చేస్తారో ఊహించుకోండి అని అన్నారు.

## జంతర్ మంతర్ వద్ద ఉపాధిహామీ కార్మికుల ధర్నా

**న్యూఢిల్లీ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తుండడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. పలు రాష్ట్రాల్లో కార్మికులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. హర్యానాకు చెందిన వందలాది మంది ఉపాధిహామీ కార్మికులు శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన గ్రామీణ జీవనోపాధి పథకం కింద తమకు ఉపాధి లభించడం లేదని, ఈ పథకం కింద అనుమతించబడిన పనుల జాబితా నుండి అనేక పనులను తొలగించారని మండిపడ్డారు. గత 45 నెలలుగా ఉపాధిహామీ పథకం కింద తమకు ఎటువంటి పని లభించడం లేదని కార్మికులు ధ్వజమెత్తారు. అనుమతించబడిన పనుల జాబితాను మారుస్తూ కేంద్రం నుండి ఒక ఉత్తర్వు వచ్చిందని స్థానిక అధికారులు తమకు చెప్పారని హర్యానా ఫతేహాబాద్ జిల్లాలోని తోహానాకు చెందిన కిషన్ కుమార్ పేర్కొన్నారు. 'గత ఐదు నెలలుగా మాకు ఎటువంటి పని లభించడం లేదు. కేంద్రం నుండి తమకు ఆదేశాలు వచ్చాయని, కొన్ని పనులు ఆగిపోయాయని అధికారులు చెబుతున్నారు' అని కిషన్ పిటిఐకి చెప్పారు. నీటి సంరక్షణ, నీటిపారుదల, చెరువు పునరుద్ధరణ, కరువు నివారణ, గ్రామీణ అనుసంధానం, భూ అభివృద్ధి వంటి నైపుణ్యం లేని కార్మికులు అవసరమయ్యే 'కచ్చే కామ్' అని పిలువబడే పనులను అనుమతించబడిన పనుల జాబితా నుండి తొలగించారని కార్యకర్త ధీరజ్ గభా ఆరోపించారు. తాము ప్రతి జిల్లాలో నిరసనలు నిర్వహించామని, స్థానిక అధికారులు ఇది కేంద్రం నిర్ణయం అని చెబుతున్నారని, అందుకే తాము ఢిల్లీకి వచ్చామన్నారు. ఈ సమస్యలపై కేంద్ర మంత్రులతో కూడా సమావేశాలు నిర్వహిస్తామని కార్యకర్త చెప్పారు. ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకపోతే పెద్ద నిరసన చేపడతామని హెచ్చరించారు. 'ఈ సమస్య పరిష్కారం కాకపోతే, వచ్చే ఏడాది బడ్జెట్ సమావేశాల సందర్భంగా లక్ష మంది ఉపాధిహామీ కార్మికులతో ఢిల్లీలో నిరసన చేపడతామన్నారు.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS24T4417 | Vijay Kumar Lyadaala | Swaraj 834 XM | 2019 |
| 2 | TS24 4677 | Yellaiah Kothapelly | John Deere 5310 Harvester | 2017 |
| 3 | TS03TC 9589 | Merugu Rama | Sonalika DI 42 RX | 2021 |
| 4 | TG24 9843 | Anil Chelkapelli | Swaraj 843 XM | 2024 |
| 5 | TS12UB 7911 | Yellaiah Shivaratri | Tata LPK 909 FBT | 2011 |

AUCTION DATE 22-11-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

D No :19-11-409/3. 1st floor, Beside GMR Gokul Appartments Shambunipet, Warangal - 506002, Cell 9989809938, 9000298883


## దుబాయ్ ఎయిర్ షోలో కూలిన భారత యుద్ధ విమానం

### పైలట్ మృతి





**న్యూఢిల్లీ/దుబాయ్ :** దుబాయ్ ఎయిర్ షోలో భారత్‌కు చెందిన తేజస్ ఫైటర్ జెట్ కుప్పకూలింది. విమాన ప్రదర్శన సమయంలో ఈ ఫైటర్ జెట్ ఎత్తు తగ్గుతూ కిందకు వస్తున్నట్టు అనిపించింది. అయితే వేగంగా వెళ్లి ఒక్కసారిగా నేలను తాకింది. కొన్ని క్షణాల వ్యవధిలో మంటలు చెలరేగి ఫైటర్ జెట్ పూర్తిగా దగ్ధమైంది. ఘటనాస్థలంలో భారీగా పొగలు అలుముకున్నాయి. తీవ్ర గాయాలతో పైలట్ ప్రాణాలు కోల్పోయారు. పైలట్ మృతిని భారత వైమానిక దళం ధ్రువీకరించింది. భారత వాయుసేనలో వినియోగిస్తున్న తేలికపాటి యుద్ధ విమానం హెచ్ఎఎల్ తేజస్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.40 గంటల సమయంలో ప్రదర్శన చేస్తూ కూలిపోయింది. ఈ ప్రమాదంలో పైలట్ మృతి చెందారు. ఈ ఘటనపై భారత వైమానక దళం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పైలట్ కుటుంబానికి సానుభూతి ప్రకటించింది. ఈ ప్రమాదానికి గల కారణంపై విచారణకు ఆదేశిస్తున్నట్టు తెలిపింది. ఫైటర్ జెట్ కూలిన నేపథ్యంలో విన్యాసాలు జరుగుతున్న దుబాయ్ వరల్డ్ సెంట్రల్‌లోని అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద నల్లటి పొగ ఆకాశాన్ని అలుముకుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా సైరన్లు మోగాయి. తేజస్ యుద్ధ విమానం హిందుస్థాన్ ఎరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్) లో తయారైంది.

# ప్రజాపక్షం
శనివారం, 22 నవంబరు

## నితీశ్‌ముందు అలవికాని సవాళ్లు

ఎన్నికల్లో విజయం ఎవరికైనా ఆనందదాయకమే. అందునా బిహార్ ముఖ్యమంత్రిగా 10వ పర్యాయం పదవీ ప్రమాణం స్వీకరించిన జెడి(యు) అధినేత నితీశ్‌కుమార్‌కు, ఆయన్ను అంటి పెట్టుకుని అధికార భాగస్వామిగా ఉన్న బిజెపికి ఇది మరువలేని సందర్భం. సిద్ధాంతాలకన్నా కులాల కుంపట్లు బలంగాఉన్న రాష్ట్రంలో సరైన సామాజిక ఇంజినీరింగ్ (కులాల పొందిక) చేయటం, ప్రభుత్వధనం వెదజల్లి అట్టడుగు తరగతులకు, ముఖ్యంగా మహిళలకు నేరుగా నగదు, ఇతర సౌకర్యాలు అందించటం, పార్టీల సంస్థాగత నిర్మాణం, అరచేతిలో స్వర్గం చూపుతూ భవిష్యత్ వాగ్దానాలు వగైరాలు ఎన్నికల్లో ఎన్‌డిఎకి అనూహ్యమైన ఫలితాలిచ్చి ఉండవచ్చు. ఎన్నికల కమిషన్ కూడా తన శక్తికొలది తోడ్పడిందనే ఆరోపణలు ఉండనే ఉన్నాయి. వివిధ కులాలకు తగు ప్రాతినిధ్యం ఇస్తూ మంత్రివర్గ కూర్పు అలవాటైన విన్యాసమే. దాదాపు 20 సంవత్సరాల ఏలుబడిలో సాధించలేకపోయిన అభివృద్ధిని నితీశ్‌కుమార్ ఇప్పుడు 74 ఏళ్ల వయస్సులో ఏమి సాధించగలరని ఓటర్లు ఆలోచించలేదు. చేసిన వాగ్దానాలు నెరవేర్చటం ఎవరికైనా సాధ్యమా అని కూడా ఆలోచించలేదు. కేవలం 'సుశాసన్ బాబు'గా నితీశ్‌కున్న మంచిపేరు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. ప్రతిపక్ష కూటమి బలహీనతలు కూడా ఇందుకు దోహదం చేశాయి. ఇది ముగిసిన అధ్యాయం. ఇక ప్రభుత్వం ఆలోచించాల్సింది, ఆచరణలోకి తేవలసింది ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు. ఇప్పుడవి అలవికాని సవాళ్లుగా ఎదుట నిలిచి ఉన్నాయి. నిజానికి అవే ప్రధాన ప్రతిపక్షం. ప్రభుత్వ అసమర్థతను, వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ వాస్తవాలను ప్రజలకు వివరించటం ప్రతిపక్షపార్టీల కర్తవ్యం.

పాలక ఎన్‌డిఎ కూటమి నాటకీయ పరివర్తనను ఓటర్లకు హామీ యిచ్చింది: (1) కోటి ఉద్యోగాలు, (2) మౌలిక వసతుల నిర్మాణాలకు రూ.9లక్షల ట్లు, (3) నాలుగు అంతర్జాతీయ విమానాశ్రయాలు, (4)నాలుగు మెట్రో రైలు వ్యవస్థలు, (5)పంటలన్నింటికీ ఎంఎస్‌పి, (6)1000 మండీల పునరుద్ధరణ, (7) అంతిమంగా 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా పెద్ద గెంతు. బిహార్ ఆర్థిక స్థితిగతులు ఇవి అసాధ్యాలని చెబుతున్నాయి. ఎందుకంటే, భారత దేశ ప్రతి ఒక్క ప్రధాన ఆర్థిక ర్యాంకింగ్‌లోనూ బిహార్ అట్టడుగున ఉంది. జెడి(యు) మోదీ ప్రభుత్వాన్ని నిలబెట్టటంలో కీలకం కాబట్టి ఆయన నిధులు కుమ్మరిస్తారనుకుంటే అది భ్రమ. కేంద్రానికీ చట్ట పరిమితులుంటాయి. ప్రైవేటు పెట్టుబడులు ప్రవహించే పారిశ్రామిక వాతావరణమూ లేదు.


బిహార్ స్థూల రాష్ట్ర అంతర్గత ఉత్పత్తి (జిఎస్‌డిపి) 8.6 లక్షల కోట్లు, తలసరి లెక్క ప్రకారం ఇది రాష్ట్రాన్ని అట్టడుగున ఉంచుతుంది. దాని తలసరి ఎన్‌ఎస్‌డిపి రూ.69,000, ఇది జాతీయ సగటులో మూడవవంతు. మూడు దశాబ్దాలుగా ఉన్న వ్యత్యాసాలు వాటిని సంస్థాగతంగా మార్చాయి. మరో కోణంలో చూస్తే బిహార్ వార్షిక బడ్జెట్ రూ.3.17లక్షల కోట్లు. అందులో దాని సొంత పన్ను రెవెన్యూ రూ.30వేల కోట్లు. దాదాపు 80శాతం కేంద్రం పంపిణీ చేసే నిధుల నుంచి, గ్రాంట్ల రూపేణా లభిస్తున్నది. పెరుగుతున్న రుణభారం గుదిబండ అవుతున్నది. జిఎస్‌డిపిలో రుణం దామాషా దాదాపు 30శాతం. సిఫారసుచేసిన సీలింగ్ 33శాతానికి చేరువలో ఉంది. రెవిన్యూ జమల్లో దాదాపు 7శాతం వడ్డీలు తినేస్తున్నాయి. కాబట్టి ఎన్‌డిఎ వాగ్దానాల అమలు సాధ్యాసాధ్యాలను ఊహించుకోవచ్చు.

బిహార్ ప్రాథమికంగా వ్యవసాయ రాష్ట్రం. శ్రామిశక్తిలో 54శాతం ఈ రంగంపైనే ఆధార పడి ఉన్నారు. వారి ఆర్థిక ఉత్పత్తి 18శాతం. రైతుల్లో 97శాతం సగటున 0.39 హెక్టార్లున్న చిన్న, సన్న రైతులు. మిగులు ఉత్పత్తికి ఈ సాగు తోడ్పడదు. ఏ రాష్ట్రంలో అయినా వృద్ధికి చోదక శక్తి వ్యవసాయేతర ఉపాధి. అది బిహార్ జిఎస్‌డిపిలో 9–10శాతం మాత్రమే. సేవలు ఆర్థిక వ్యవస్థలో ప్రధానం. కాని బిహార్‌లో ఈ సేవలన్నీ చిరువ్యాపారాల రూపంలో ఉన్నాయి. దాని ప్రధాన లేబర్ మార్కెట్ రాష్ట్రం నుండి వలసలు. 20–29ఏళ్ల వయస్సులోని ప్రతి10 మందిలో ముగ్గురు ఇతర రాష్ట్రాల్లో వలస కార్మికులుగా జీవితం గడుపుతున్నారు. పరిస్థితి ఇలా వుంటే, ఎన్‌డిఎ ఎన్నికల ప్రణాళిక ప్రతి ఏటా 20లక్షలు ఉద్యోగాల వంతున కోటి ఉద్యోగాలు వాగ్దానం చేసింది. ఇక 1ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ అన్నది దీర్ఘకాలిక స్వప్నం. ప్రస్తుత 100 బిలియన్‌డాలర్ల రాష్ట్ర ఎకానమీ ట్రిలియన్‌కు చేరాలంటే వచ్చే ఇరవై ఏళ్లపాటు ఏటా 14 – 16 శాతం వంతున వృద్ధి నమోదు చేయాలి. ఇది బిహార్‌కే కాదు. ఏ ప్రధాన రాష్ట్రానికి సైతం పగటికలే అవుతుంది.

ఇదీ నితీశ్‌కుమార్ ముందున్న ముఖ చిత్రం. ఇది రాజకీయమైనది కాదు – వాగాడంబరంతో నెట్టుకు రావటానికి. ఇది ఆర్థికం – వాస్తవ పనితీరుకు పరీక్ష. సంఖ్యలను దాచలేము కదా!

## చరిత్ర మరిచిన ఝల్కారీ బాయి పరాక్రమం

భారతీయ చరిత్రలో వక్రీకరణ, వివక్షతల జాడ్యం వలన బహుజనుల వీరత్వం, పోరాటాలకు స్థానం ఇవ్వలేదు. ఈ దేశ సంఘసంస్కర్తలుగా, విప్లవ పోరాట యోధులుగా ఆధిపత్య కులాల వాళ్లే బ్రాండ్ వేసుకున్నారు. వారి చరిత్రనే మన విద్యా వ్యవస్థలో చదువుకుంటున్నాం. చరిత్ర ఎరుగనీ అసమాన్యులుగా ఎంతో మంది దళిత పీడిత వర్గాల నుంచి ఉన్నారు. ఇందులో ప్రధానంగా చెప్పుకోవాల్సిన గొప్ప పోరాట వీరనారి ఝల్కారీ బాయి గురించి. భారతదేశ చరిత్రలు తిరగేస్తే అణగారిన కులాల మహిళలు, పురుషులు కనిపించరు. ఆంగ్లేయులతో వీరోచిత పోరాటం చేసిన వీరవనిత ఝల్కారీ బాయి 1857 తిరుగుబాటు చరిత్రకు అందకుండా పోయింది. భారత ప్రథమ స్వాతంత్ర్య తిరుగుబాటులో రాణి లక్ష్మి బాయి, నానాసాహెబ్, తాంతియాతోపే, బహదూర్ శా జఫర్, మంగళ్



పాండే, బేగం హజ్రత్ మహల్, కున్వర్ సింగ్ వంటి కొందరు ముఖ్యులనే చరిత్రలో ప్రస్తావించారు. ఆమె 1857నాటి స్వతంత్ర సమరంలో జాన్సీ రాణి లక్ష్మి బాయి సైన్యంలో పనిచేసింది. కానీ సావర్కార్ తన పుస్తకంలో ఝల్కారి బాయి ఝాన్సీరాణిని దాసిగా ప్రస్తావించారు. వాస్తవంగా ఝల్కారీబాయి ఝాన్సీలక్ష్మి భాయి ఏర్పాటు చేసిన మహిళా సైన్యంలో కమాండర్. ఆమె 1857 స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీ రాణి లక్ష్మి బాయి సైన్యంలో ఆమెకు సమానంగా సాహసంగా రాణి రూపంలో బ్రిటిష్ సైనికులతో పోరాడిన ధీరవనిత. యుద్ధంలో, ఝల్కారీ బాయి తనని రాణిగా మోసగించి బ్రిటిష్ సైన్యాన్ని గందరగోళానికి గురిచేసి రాణి లక్ష్మీ బాయికి సురక్షితంగా తప్పించుకునే అవకాశాన్ని కల్పించి కాపాడింది. ఇక్కడ నిజమైన యుద్ధాన్ని చేసిన మహిళ ఝల్కారీ బాయి కదా.

**బాల్యం నుంచే ధీరవనిత**

ఝల్కారీబాయి 22 నవంబర్ 1830లో బుందేల్ ఖండ్ ఝాన్సీలోని భోజలా గ్రామంలో పుట్టింది. తల్లి దనియా, తండ్రి మాల్ చంద్ కోరి కులానికి చెందినవారు. చిన్ననాడే ఝల్కారీ బాయిలో వీరత్వం, సాహసం, ధైర్యం ప్రతిధ్వనించింది. పన్నెండేండ్ల వయస్సులో అడివిలో పశువులు కాస్తున్నప్పుడు పులి పశువుల మీద పడితే పులితోనే తలపడి చంపింది. ఈ వార్త ఝాన్సీరాణి లక్ష్మి బాయి దాకా చేరింది. ఆమె సైన్యంలో సైనికుడిగా ఉన్న పూరన్ కుటుంబానికీ చేరింది. అట్లాంటి వీరత్వం ఉన్న అమ్మాయిని కోడలుగా చేసుకోవాలి అని పూరన్ తల్లి ఇష్టపడింది. ఝల్కారీబాయి వివాహం సైనికుడు పూరన్‌తో జరిగింది. పూరన్ కుటుంబం ఝాన్సీ కోటకు దగ్గరగా ఉన్న 'నయాపూరా' బస్తీలో నివసించేది. ఝల్కారీ రూపురేఖలు చూసిన ఝాన్సీలక్ష్మీ బాయి ఆమెను ఎట్లయినా మహిళా సైనిక దళం లో చేర్చుకోవాలనుకున్నది. భర్త పూరన్ ప్రోత్సాహం, ఆమెకు స్వతహాగా ఉన్న ఆసక్తితో ఝల్కారీ బాయి భర్త దగ్గర గుర్రపుస్వారీ, కత్తియుద్ధం, మల్లయుద్ధం, ఫిరంగులు పేల్చడం, బాణ విద్యలు వంటి యుద్ధ నైపుణ్యాలు నేర్చుకున్నది.బ్రిటిష్ జనరల్ కూడా ఆమె సాహసం అభినందించారు. ఝల్కారీ బాయి గాథ దళితుల చరిత్రలో ఎంతో గౌరవప్రదమైనది. భోపాల్‌లో 2017లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఝల్కారీ బాయి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

**పోరాట వీరుల చరిత్రనే విముక్తి పాఠం.**

భారతదేశ చరిత్ర అంతా గెలిచిన వారిదే. పూలే, అంబేడ్కర్ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పోరాటంతో వాస్తవ చరిత్ర బయటకు వచ్చింది. ఇప్పుడు ఓడిపోయిన వారు కూడా చరిత్ర రాసుకునే అవకాశం లభించింది. చరిత్ర కోణంలో పరిశీలిస్తే...బహుజనులు అసలైన చరిత్ర తెలుసుకోలేకపోయారు. దీంతో వారికి చరిత్ర లేని వారసులుగా మిగిలారు. చరిత్ర తెలియని వాడు చరిత్ర సృష్టించలేరని అంబేద్కర్ అన్నాడు. ఈ క్రమంలో అంబేద్కర్ ఉద్యమ రథాన్ని ముందుకు నడిపించిన విప్లవ సారథి మాన్యవార్ కాన్సిరాం ఝల్కారీ బాయి నిలువెత్తు విగ్రహాన్ని ఝాన్సీ పట్టణంలో రాణి లక్ష్మి బాయి విగ్రహానికి అభిముఖంగా ఏర్పాటు చేశారు. దీంతో ఆమె చరిత్ర కాంతి రేఖల బయ ట సమాజానికి తెలిసింది. తెలంగాణ ప్రాంతంలో కూడా చాకలి ఐలమ్మ చరిత్ర, పోరాటాన్ని సైతం తప్పుదారి పట్టించారు. ఆమె పాలకుర్తి మండలంలోని విస్నూర్ దేశ్ముఖ్ రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వీరనారి. భూస్వాములకు, దొరలకు వ్యతిరేకంగా పోరాడినది. ఆమె పోరాటం కేవలం భూమి కోసమే కాదు, ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం జరిగిన మహాసంగ్రామం. కానీ ఆమె తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన యోధురాలుగా కీర్తిస్తూ చరిత్రలో లిఖించారు. దేశంలో ఇలాంటి తప్పుడు చరిత్రలతో బహుజన వర్గాల పోరాట వీరులను బహిర్గతం చేయలేకపోయారు. దీంతో బహుజన వర్గాల విప్లవ చైతన్యం తప్పుదారి పట్టింది. కావు న దేశంలో బడుగు బలహీన వర్గాల పోరాట వీరుల జీవిత గాథలను, విప్లవ స్ఫూర్తిని సరిగ్గా తెలుసుకునేందుకు చరిత్రను ఆధునిక దృష్టికోణంలో విశ్లేషణ అవసరం.

**సంపతి రమేష్ మహారాజ్**
7989579428

# ఉద్యమాలు ఊపిరిగా వర్ధిల్లిన సిపిఐ



కందిమళ్ళ ప్రతాపరెడ్డి

భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం జరిగి 100 సంవత్సరాలు నిండిన సందర్భంగా శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్నాం. గత చరిత్రను గుర్తు చేసుకుంటున్నాం. అది ఒక పార్టీ చరిత్ర మాత్రమే కాదు.. అది స్వాతంత్ర్యోద్యమ చరిత్ర – విప్లవోద్యమాల చరిత్ర. త్యాగాల చరిత్ర. ఉరికంబాలపై వొరిగిన వీరుల చరిత్ర.

స్వాతంత్ర్యోద్యమం నుండి నేటి వరకు సాగిన సమరాలలో శత్రువు తుపాకి తూటాకు గుర్రై అమరులైన వీరుల చరిత్ర, కఠిన కారాగార శిక్షలు అనుభవించిన విప్లవకారుల చరిత్ర. లాఠీలు, తూటాలు, నిషేధాలు, నిర్బంధాలు, దౌర్జన్యాలను ఎదుర్కొంటూ ముందుకు సాగిన దేశభక్తుల, త్యాగధనుల చరిత్ర. వీరుల రుధిరంతో ఎరుపెక్కిన చరిత్ర. ఇంత ఘనచరిత్ర కలిగిన పార్టీ భారతదేశంలో మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం యాదృచ్ఛికంగా జరగలేదు.

రష్యా అక్టోబరు విప్లవ వెలుతురులో – మార్క్సిజం – లెనినిజం సిద్ధాంతం లక్ష్యంగా నిర్మాణం జరిగింది. నిర్మాణానికి ముందు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పెట్టిన "పెషావరు", "కాన్పూరు", "బోల్షివిక్" అక్రమకేసుల్లో నిందితులై బయటపడిన వారు, "అనుశీలన్" "యుగంధర్" లాంటి టెర్రరిస్టు ఉద్యమాలలో పాల్గొని "అలీపూర్", "బెనారస్" "హౌరా" కుట్రకేసుల నుండి తప్పించుకుని విదేశాల్లో ఉండి రష్యా విప్లవం తర్వాత మాస్కో చేరి కమ్యూనిస్టులుగా మారిన యం.యన్.రాయ్, షీకల్, ఉస్మానీ, నళినీగుప్త, వీరేందర్‌నాథ్ ఛటోపాధ్యాయ, గదర్ విప్లవకారుడైన సంతోఖ్‌సింగ్ మొదలైనవారు, అక్టోబరు విప్లవ ప్రభావంతో, బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు రజనీ పామీదత్, శాపూర్జీ సకలత్‌వాలా, ఇతర విదేశాలలో వున్న విప్లవకారులతో సంబంధాలతో కమ్యూనిస్టు గ్రూపులుగా పనిచేస్తున్న సింగారవేలు చెట్టియార్, ఎస్.ఎ.డాంగే, ముజఫర్ అహ్మద్, వీరందరి సంగమంగా (1925 డిసెంబర్ 26న కార్పూర్‌లో) భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం జరిగింది.

బ్రిటిష్ పాలకులు విధించిన నిషేధం కారణంగా, రహస్య పార్టీగా కమ్యూనిస్టుపార్టీ జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగా పనిచేస్తూ 1920లో ఏర్పడిన అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఎఐటియుసి) కార్మిక సంస్థను ఉద్యమానికి వేదికగా చేసుకున్నది. పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ఖద్దరు ధరించి ఉద్యమంలో ముందున్నారు. అప్పటివరకు భారతీయోద్యమ లక్ష్యం బ్రిటిష్ పాలకుల నుండి "డొమీనియన్ స్టేటస్"గా ఉన్నది. "డొమీనియన్ స్టేటస్"కాదు సంపూర్ణ స్వాతంత్ర్యం లక్ష్యంగా ప్రకటించాలని కమ్యూనిస్టులు ప్రప్రథమంగా కాంగ్రెస్ మహాసభలో ప్రతిపాదించారు. కాంగ్రెస్‌లోని నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, సి.ఆర్.దాస్ మొదలైనవారు దానిని బలపరచడం ద్వారా చివరకు సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రకటన లక్ష్యంగా తీర్మానం జరిగింది.

✻ 1922 చౌరాచౌరీ సంఘటన తర్వాత ఉద్యమాన్ని కొద్దిమంది వ్యక్తులకు, శాంతియుత సత్యాగ్రహులకు పరిమితం చేయాలన్న గాంధీజీ నిర్ణయాన్ని వ్యతిరేకించి, కార్మికులు, కర్షకులు, దేశ ప్రజలందరినీ ఉద్యమంలో భాగస్వాములను చేయాలని ప్రతిపాదించి – నెహ్రూ, సుభాష్, వారి అనుచరులను కూడగట్టుకొని ఆ దిశగా కార్యాచరణకు పూనుకున్నది.

✻ ఎఐటియుసి తర్వాత 1936లో అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎఐఎస్‌ఎఫ్), అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం(ఎఐపిడబ్ల్యు), ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపిటిఎ) నిర్మాణం జరిగింది. వీటికి జవహర్ లాల్ నెహ్రూ సంపూర్ణ సహకారం అందించారు. ఉత్తరప్రదేశ్ యువజన సంఘానికి నెహ్రూ అధ్యక్షుడిగా ఉన్నారు.

✻ రచయితలు, కళాకారులు ప్రజలమధ్య, ప్రజలకొరకు, ప్రజాకళలను, అభ్యుదయ రచనలు తీసుకెళ్లారు. కార్మిక, కర్షకుల సమస్యలు, హక్కుల సాధనకు ఉద్యమాలను సాగించారు. విద్యార్థి – యువజన, మహిళా సంఘాల ద్వారా ఉద్యమ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ – వారిని ఉద్యమ కార్యకర్తలుగా తయారు చేశారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలలో విప్లవాత్మక మార్పు తెచ్చారు. సాంఘిక దురాచారాలు, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా సంఘసంస్కరణ కార్యక్రమాలు చేపట్టారు.

"మీరట్ కుట్రకేసుతో" కమ్యూనిస్టు లెవరో ప్రజలకు తెలిసిపోయింది. వివిధ రంగాలలో వారు చేస్తున్న కృషి, వారి త్యాగనిరతి, దేశభక్తి, ప్రవర్తన, జీవనశైలి, ప్రజలనే కాదు ఇతర కాంగ్రెస్ వాదులను కూడా ఆకర్షించింది.

అనతికాలంలోనే కమ్యూనిస్టు భావజాలం విస్తరించింది. ప్రజాసంఘాల నాయకులంతా కమ్యూనిస్టులుగానే ఉన్నారు. ఫలితంగా వేలాదిమంది కమ్యూనిస్టులుగా, కమ్యూనిస్టు అభిమానులుగా మారారు. పార్టీ జాతీయ కాంగ్రెస్‌లో సోషలిస్టు భావజాల వ్యాప్తికి కృషి చేసింది. క్రమంగా కాంగ్రెస్‌లో నెహ్రూ, సుభాష్, జయప్రకాశ్ నారాయణ్, నాయకత్వంలోని సోషలిస్టుల మద్దతు లభించింది. 1931లో శాసనోల్లంఘన ఉద్యమ విరమణ, భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ ఉరిశిక్ష అమలు తర్వాత...కాంగ్రెస్ పార్టీలో గాంధీ ఎడల విశ్వాసం సడలింది. భగత్‌సింగ్ అనుచరులు అజయ్‌ఘోష్, విజయకుమార్ సిన్హా తదితరులు, గదర్‌వీరులు సోహన్‌సింగ్ బాక్నా, గురుముఖ్‌సింగ్, పృథ్వీసింగ్, చిటగాంగ్ పోరాట వీరనారి కల్పనాదత్, ఆమె సహచరులు, పెషావరు వీరజవాన్ చంద్రశేఖర్ సింగ్ ఇతర విప్లవకారులు కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లో అతివాద భావాలు, సోషలిజం సిద్ధాంత భావజాలం గల వారందరూ ఒకటయ్యారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీగా అంతర్గత సిద్ధాంత పోరాటం చేశారు. కాంగ్రెస్‌లో అతివాదులు మితవాదులుగా రెండు వర్గాలేర్పడ్డాయి. క్రమంగా అతివాదుల సంఖ్య పెరిగింది.

1936లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి మితవాదులు – అతివాదులు పోటీపడ్డారు. అతివాదుల ప్రతినిధి సుభాష్ చంద్రబోస్, మితవాద అభ్యర్థి పట్టాభి సీతారామయ్యను ఓడించి ఘనవిజయం సాధించాడు. అతి మహాత్మాగాంధీకి విస్మయం కలిగించింది.

మితవాదులు ఈ పరిణామాలన్నింటికీ కారణం కమ్యూనిస్టులేనని తెలుసుకున్నారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలోని అతివాదుల్లో చీలికలకు ప్రయత్నించారు. ఫలితంగా సుభాష్ చంద్రబోస్ కాంగ్రెస్‌ను వీడి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించాడు. సోషలిస్టులు, అంబేద్కర్ షెడ్యూల్ట్ కాస్ట్ ఫెడరేషన్, ముస్లింలీగ్ కాంగ్రెస్ నుండి విడిపోయాయి. కమ్యూనిస్టులను కూడా దూరం చేసి, నెహ్రూ నాయకత్వంలోని అతి



వాదులను బలహీనం చేయాలని ప్రయత్నాలు సాగించారు. కమ్యూనిజం, కమ్యూనిస్టులపై నిందా ప్రచారం చేశారు. రష్యా ఏజెంట్లని ప్రచారం చేశారు.

✻ 1939లో హిట్లర్, ముస్సోలినీ, టోజో ఫాసిస్ట్ మూకలు ప్రపంచాన్ని కబళించాలని పోలెండ్‌పై దాడితో ప్రపంచ యుద్ధానికి సంకేతం పలికారు. క్రూరమైన, నిరంకుశ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా నిలవాలని అంతర్జాతీయ కమ్యూనిస్టు వేదిక(కమ్యూనిస్టు ఇంటర్నేషనల్) పిలుపునిచ్చింది. సామ్రాజ్యవాదం కంటే ఫాసిజం ప్రధాన శత్రువని ప్రకటించింది. ఫాసిజాన్ని ఎదుర్కోవడానికి సోవియట్ యూనియన్, సామ్రాజ్యవాద దేశాలైన ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికాలతో ఫాసిస్ట్ వ్యతిరేక కూటమి ఏర్పడింది.

✻ భారతదేశంలోని కమ్యూనిస్టులు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కంటే ముందుగా ఫాసిస్టులకు వ్యతిరేకంగా నిలవాలన్నారు. కమ్యూనిస్టులను ఏకాకులను చేయాలని ప్రజల్లో వారిపై వ్యతిరేకత పెంచాలని "వీరు దేశ భక్తులు కారు.రష్యా ఏజెంట్లన్నారు." బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు లొంగిపోయారు–అందుకే పార్టీపై నిషేధాన్ని తొలగించారని ప్రచారం ప్రారంభించారు.

✻ బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై అంతిమ పోరాటం సాగించాలని 1942 ఆగస్టులో బొంబాయిలో ఎఐసిసి సమావేశం ఏర్పాటు చేసి "క్విట్ ఇండియా" తీర్మానాన్ని ఆమోదింపజేయాలన్నారు. ఎఐసిసిలో 12మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, ఒక సానుభూతి పరుడు ఉన్నారు.

జాతీయ కార్యదర్శులుగా, కొన్ని రాష్ట్రాల అధ్యక్షులుగా వివిధ స్థాయిల్లో కమ్యూనిస్టులు ఉన్నారు.

1942 ఆగస్టు 7,8 తేదీల్లో బొంబాయిలో సమావేశం జరిగింది. సమావేశానికి ముందు మహాసభ ప్రాంగణంలో జెండాను ఆవిష్కరించకుండా పోలీసులు నెహ్రూను అరెస్టు చేశారు. తర్వాత ఎవరూ జెండాను ఎగురవేయడానికి ముందుకు రాలేదు. కమ్యూనిస్టు సభ్యురాలైన శ్రీమతి అరుణా అసఫలీ జెండాను ఆవిష్కరించగా అరెస్టు చేశారు.

సమావేశంలో క్విట్‌ఇండియా తీర్మానం ప్రవేశపెట్టగా ఫాసిస్టు ప్రమాదం ముంచుకొస్తున్న ప్రస్తుత సమయం అందుకు సరైనది కాదని 12మంది కమ్యూనిస్టులు, ఒక సానుభూతి సభ్యుడు వ్యతిరేకంగా ఓటు వేశారు. తీర్మానం ఆమోదం పొందింది. కానీ, దానిని బహిరంగంగా ప్రకటించకముందే సభ్యులందరినీ అరెస్టు చేశారు. ఆగస్టు 9న, అరెస్టులకు నిరసనగా దేశవ్యాపితంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఆవేశంతో ప్రజలు రైల్వేస్టేషన్లు, పోస్టాఫీసులు ధ్వంసం చేశారు. టెలిఫోన్ తీగలు తెంచివేశారు. ఆఫీసులు, ఫ్యాక్టరీలు, కళాశాలలు మూసివేశారు. దేశవ్యాపితంగా పోలీసు కాల్పుల్లో 8మంది మరణించారు. 1630 మంది గాయపడ్డారు. 250 రైల్వేస్టేషన్లు, 950 పోస్టాఫీసులు, 50 పోలీసు స్టేషన్లు, 85 ప్రభుత్వ భవనా లు ధ్వంసమయ్యాయి. 3500 టెలిఫోన్ తీగలు తెంచినారని ప్రభుత్వం ప్రకటించింది.

ఆందోళనలు హింసాత్మక ఘటనలు జరుగుతుంటే– కాంగ్రెస్ నాయకులు పట్టించుకోకుండా కమ్యూనిస్టులను "రష్యాఏజెంట్ల"ని "బ్రిటిష్‌వాళ్ళకు అమ్ముడుపోయార"న్నారు. కాంగ్రెస్ వాళ్ళతో ఇతర పార్టీలు అదే వంత పాడాయి. కమ్యూనిస్టులు చాకచక్యం చూపకుండా తమ నిర్ణయాన్ని సమర్థించుకోవడం, ఇతర పార్టీలను పంచమాంగ దళం పేర్కొనడం కమ్యూనిస్టు అభిమానులకు కూడా విస్మయాన్ని కలిగించింది. కాంగ్రెస్ నిజంగా క్విట్ ఇండియా ఉద్యమానికి సిద్ధంగా లేదని, అది ఏనాడూ ఉద్యమానికి అనుకూలంగా లేదని తెలుసు. తీర్మానం చేసిన తర్వాత ప్రజలకు పిలుపివ్వలేదు. ప్రజల ఆందోళన క్విట్ ఇండియా పిలుపుతో కాదు. నాయకుల అరెస్టులకు నిరసనగా నన్నది వారికి తెలుసు. విడుదలైన తర్వాత నెహ్రూ, సర్దార్ పటేల్, పంత్, అబ్దుల్ కలాం, ఆజాద్ , జరిగిన హింసాత్మక సంఘటనలను ఎలా సమర్థించుకుంటారని విలేకరులు అడిగిన ప్రశ్నకు చెప్పిన సమాధానం: "తీర్మానం చేశాం, కాల్స్' బహిరంగంగా ప్రకటించలేదు. ప్రజలకు పిలుపివ్వలేదు. తమంతట తాము చేసిన దానికి మేము బాధ్యులము కాము."అన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎలాంటి ఉద్యమం జరగలేదు. కానీ కమ్యూనిస్టు పార్టీ వివిధ సమస్యలపై ఆందోళన జరిపింది. కమ్యూనిస్టు నాయకుడు జార్ఖండ్ రాయ్ తూర్పు యు.పి.లో ఘాజీపూర్ ప్రాంతాన్ని, సితారాలో నానా పాటిల్ "ప్రతీ సర్కార్" పేరుతో స్వతంత్రం ప్రకటించారు.

### ప్రథమ కమ్యూనిస్టు మహాసభ

1943 మే 21నుండి జూన్ 1 వరకు బొంబాయిలో జరిగింది. పదిరోజుల పాటు జరిగిన మహాసభకు దేశ నలుమూలల నుంచీ ప్రతినిధులొచ్చారు. వారితో కళాబృందాలొచ్చాయి. ఉత్తేజపూరిత వాతావరణంలో మహాసభ జరిగింది. క్విట్ ఇండియా కాలంలోనే పార్టీ సభ్యత్వం 4500 నుండి 15,500కు పెరిగింది. ప్రజాసంఘాల సభ్యత్వం గణనీయంగా పెరిగింది. మహాసభల సందర్భంలో ప్రజాకళల వేదికగా ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ నిర్మాణం జరిగింది. పార్టీ కార్యదర్శిగా పిసి జోషి ఎన్నికయ్యారు. మహాసభ తర్వాత ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం ముమ్మరంగా సాగింది.

1944బెంగాల్ కరువు నివారణ నిధికి కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాపితంగా నిధులు, ఆహార ధాన్యాల, నిత్యావసర సరుకుల సేకరణ జరిపింది. భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా బెంగాల్‌లో తెభాగా ఉద్యమం, పంజాబులో మౌంట్‌గోమరీ, పాటియాలా, బీహార్ , మలబార్ పున్నప్ర వాయలార్, తంజావూరు, రైతాంగ పోరాటాలు నడిపింది. కార్మికోద్యమాలకు నేతృత్వం వహించింది.

### అఖిల భారత కిసాన్ మహాసభ:

1944మార్చి,14, 15 తేదీలలో విజయవాడలో చరిత్రాత్మక అఖిలభారత కిసాన్ సభ మహాసభ జరిగింది. మహాసభకు గదర్ వీరులు సోహన్ సింగ్ భాక్నా, పృథ్వీసింగ్, గురుముఖ్ సింగ్, పార్టీ ప్రధాన కార్యదర్శి, పి.సి.జోషి హాజరయ్యారు. బహిరంగసభకు లక్షకు పైగా జనం వచ్చారు.

### ఫాసిస్టుల పతనం

✻1945 మే 1న జర్మనీ రైఖ్‌స్టాగ్ భవనంపై ఎర్రజెండా ఎగిరింది. ఫాసిస్టుల పతనం, హిట్లరు మరణంతో ప్రపంచమంతా ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి.

✻ తూర్పు యూరప్ ఎరుపెక్కింది. పోలెండ్, హంగేరీ, బల్గేరియా, జెకోస్లవేకియా, యగోస్లావియా, రుమేనియా దేశాలలో సోషలిస్టు రాజ్యాలేర్పడ్డాయి.

✻ ఫ్రాన్సు, ఇటలీ, మరికొన్ని దేశాలతో కమ్యూనిస్టులు భాగస్వాములుగా ఐక్యసంఘటన ప్రభుత్వాలేర్పడ్డాయి. చైనా రెడ్ ఆర్మీ విజయపరంపరలతో ముందుకు సాగుతుంది. వియత్నాం, కొరియాలో యుద్ధం కొనసాగుతుంది.

✻ వివిధ దేశాలలో స్వాతంత్ర్యోద్యమాలకు ఉత్తేజం కలిగింది. యుద్ధం ముగిసిన తర్వాత సుభాష్‌చంద్రబోస్, ఆజాద్ హింద్‌ఫౌజ్ నాయకులు కెప్టెన్ షానవాజ్, కెప్టెన్ సైగల్, థిలాన్‌లను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టు చేసి ఎర్రకోటలో దేశద్రోహం నేరం మోపి విచారణ జరిపింది.

దానికి వ్యతిరేకంగా దేశమంతటా నిరసన ప్రదర్శనలు జరిగాయి. కమ్యూనిస్టు పార్టీ, ప్రజాసంఘాలు ఉద్యమంలో ముందు నిలిచాయి.

✻ 1946 జనవరి 23న బొంబాయి సముద్రతీరంలో వున్న 20 ఓడల్లోని వేలాదిమంది నావికులు బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు ప్రకటించారు. బ్రిటీష్ జెండాను తొలగించి ఓడలపై కాంగ్రెస్, కమ్యూనిస్టు, ముస్లింలీగు జెండాలు ఎగురవేశారు. తమని తాము స్వతంత్ర భారత నావికులుగా ప్రకటించుకున్నారు.

బ్రిటీష్ ప్రభుత్వం తమ నావికా సైనిక బలగాలను దింపింది. అయినా నావికులు లొంగలేదు. కమ్యూనిస్టు పార్టీ, ఎఐటియుసి వారి పోరాటానికి సంఘీభావం ప్రకటించాయి.

(ఇంకా ఉంది)

## జనం మనిషి గుర్రం యాదగిరిరెడ్డి

మట్టి మనిషిలో కాంతి దీపం ఆయన. నిజాం ముష్కర పాలనపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన ధీశాలి. మాటల తూటాలతో అగ్ని జ్వాలై ఎగిసిపడిన యుద్ధ కెరటం గుర్రం యాదగిరిరెడ్డి. అట్లాస్ సైకిల్‌లో నుంచి ఆరంభమైన జీవితం అసెంబ్లీ మెట్లదాక కొనసాగింది. 14 ఏళ్ళ బాల్యంలో సాయుధ యుద్ధ క్షేత్రంలో క్షిపణై ప్రజ్వరిల్లాడు గుర్రం. నిజాయితీకి నిలువుటద్దమై... జనావళి మదిలో జననాయకుడు అయ్యారు. ఎరుపులోనే మెరుపు ఉంది..పోరాడే సాయుధ సమర శక్తి ఉందని గుర్రం నినదించేవాడు. గమనం.. గమ్యం.. ఘర్షణ కెరటాలను అధిగమించి ఎర్రని వేగుచుక్కగా నిలిచాడు గుర్రం. ఎర్రసంద్రంలో.. ఎరుపెక్కిన అరుణ పతాకమును ఎగురవేసి నిజాం పాలనపై పోరు సాగించి ఎర్రని నిప్పులకుంపటిలో వెలిగాడు యాదగిరిరెడ్డి. నిజాంపై నిప్పులు చెరిగి ఖాసీం రజ్వీ దురాగతాలు ఎదిరించి ఎర్రని జెండా ఎగరవేశారు. సుద్దాల యుద్ధ యోధుడు గుర్రం. ప్రజల్లో అగ్ని కెరటమై ప్రకాశించాడు గుర్రం. జీవన సంగ్రామంలో గాయాల మదిలో గేయమై ప్రజల హృదయాల్లో నిలిచారు.

మార్క్సిజం మాటలతో.. లెనినిజం బాటలో ప్రయాణం సాగించిన తొలిపొద్దు గుర్రం యాదగిరి రెడ్డి. నికార్సు అయిన రాజకీయ నాయకుడిగా ఎర్ర చొక్కా, తెల్లని దోతీని ధరించి... జనం మదిలో స్వప్నమై నిలిచాడు. గుర్రం రాంరెడ్డి లక్ష్మమ్మ రెండవ పుత్రుడుగా జన్మించారు. అవమానాలను ఎదిరించి పోరు సాగించారు. ఎగసిపడిన కెరటంలా దూసుకెళ్ళాడు. స్వామి వివేకానంద చెప్పిన మాటల్లో చెప్పాలంటే.. కెరటంలేచి పడినందుకు కాదు.. పడిలేచినందుకు ఇది అక్షరాల గుర్రం యాదగిరి రెడ్డికి వర్తిస్తుంది... అవమానాల మూటలో ఎర్ర జెండాను హత్తుకొని.. ఎత్తిన జెండాను దించలేదు.. స్వేచ్ఛా గీత మై... ప్రజల హృదయాల్లో ప్రజల మనిషిగా నిలిచాడు. మానవ త్వం కీళ్ళు విరిచి మంటల్లో ఊరేగుతున్న యుగంలో మానవతను చాటిన జనం మనిషి. నవంబర్ 22, 2019న భౌతికంగా యాదగిరి రెడ్డి దూరమైనప్పటికి ఆయన జ్ఞాపకాలు ప్రజల మదిలో పదిలంగా నిలిచిపోయాయి.



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన గుర్రం యాదగిరి రెడ్డి రామన్నపేట ఎమ్మెల్యేగా 15 ఏళ్ల పాటు ప్రజల కోసం పనిచేశారు. ప్రజల మధ్యే ఉంటూ వారి కష్ట సుఖాలను గమనిస్తూ ఆదర్శ జీవితం గడిపారు. ఎలాంటి ఆస్తిపాస్తులు సంపాదించుకోకుండా నేటి తరానికి మార్గదర్శిగా నిలిచారు. 13 వ ఏటనే తెలంగాణ సాయుధ పోరాటానికి ఆకర్షితుడై బాల సంఘంలో చేరారు. 75 ఏళ్ల పాటు కమ్యూని స్టు పార్టీలో వివిధ పదవులు పోషించారు. అప్పటి రామన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరసగా మూడుసార్లు తె.దే.పా మిత్రపక్షం తోడ్పాటుతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. సుద్దాల గ్రామానికి చెందిన సుద్దాల హనుమంతు, కాశ లక్ష్మయ్య, గూడ పుల్లయ్య న్యాయకత్వంలోని బాల సంఘంలో యాదగిరిరెడ్డి చేరి 11వ ఆంధ్ర మహాసభకు వెళ్ళారు. 1946లో దొడ్డి కొమురయ్య మరణాంతరం కె.రామచంద్రారెడ్డి, దూదిపాల సత్తిరెడ్డి నాయకత్వంలో సుద్దా ల, వెలమజాల మధ్యలో వాలెంటరీల శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. 1948లో మోత్కూర్, అమ్మనబోలు, ముస్తలపల్లి పోలీస్ స్టేషన్లపై దాడికి దిగినవారిలో ఉన్నారు. సూర్యనారాయణ దళంలో గెరిల్లా శిక్షణ పొంది 14వ ఏటనే దళ ఆర్గనైజర్ అయ్యారు. గడ్డం అమీన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసారు. 1948 సెప్టెంబర్ పోలీస్ చర్య తర్వాత వీరి దళం సేర్వి ప్రాంతానికి వలస పోయింది. సైన్యం జరిపిన దాడుల్లో సూర్యనారాయణ, హనమయ్య, రాంరెడ్డి మరణించారు. పెంటయ్య మారుపేరుతో 1949 నుండి 1951 వరకు దళాన్ని యాదగిరి రెడ్డి ఆర్గనైజర్‌గా ముందుకు నిడిపించారు.

1952లో స్వగ్రామం సుద్దాలకు వచ్చి స్థానికుడైన జాలిగామ శేషగిరిరావు భూ జాగీర్‌పై పోరాటం చేసి భూపంపిణీ చేశారు. 1966లో రామన్నపేట సిపిఐ కార్యదర్శిగా పనిచేసి 1970లో అడ్డగూడూర్ లో జరిగిన 560 ఎకరాల భూపంపిణీలో పాల్గొన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా, ఉపాధ్యక్షుడిగా, పత్తిరైతుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. నల్గొండ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా రైతు సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, కార్యదర్శి వర్గ సభ్యుడిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చాలా కాలం పనిచేశారు. తొలిసారిగా 1977లో సాధారణ ఎన్నికల్లో రామన్నపేట ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు.

ఆ తర్వాత 1985లో మిత్రపక్షమైన టిడిపితో కలసి కాంగ్రెస్ అభ్యర్థి కొమ్ము పాపయ్యపై విజయం సాధించారు. 1989, 1994లో కాంగ్రెస్ అభ్యర్థి ఉప్పునూతల పురుషోత్తంపై యాదగిరి రెడ్డి ఎమ్మెల్యేగా మూడవసారి విజయభేరి మోగించారు. రామన్న పేట ఎమ్మెల్యేగా యాదగిరి రెడ్డి నియోజకవర్గ అభ్యర్థికోసం ఎంతగానో కృషిచేశారు. నియోజక వర్గ పరిధిలో సాగునీరు, తాగునీరు, విద్యుత్ గ్రామీణ రహదారులు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజాదరణ పొందారు.

స్వగ్రామం సుద్దాలలో పశు వైద్యశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఏర్పాటుకు పాటుపడ్డారు. మోత్కూర్–బిక్కేరు వాగుపై వంతెన, అమనగోలు వద్ద మూసీనదిపై వంతెన నిర్మాణం ఆయన హయాంలోనే నిర్మితమయ్యాయి. నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాల్లో పేదలకు స్వంత ఇళ్ళ నిర్మాణం, రహదారుల నిర్మాణం, చెరువులు, కుంటల అభివృద్ధి, విద్యాసంస్థలను అభివృద్ధి చేశారు.

(6వ వర్ధంతి సందర్భంగా)

**గుర్రం రాంమోహన్ రెడ్డి**
7981018644

## పెద్దేముల్ నూతన ఎస్ఐగా శంకర్



**ప్రజాపక్షం/పెద్దేముల్:** శాంతి భద్రతల పరిక్షణకు అందరి సహకారం అవసరమని పెద్దేముల్ మండల ఎస్ఐ శంకర్ తెలిపారు. శుక్రవారం పెద్దేముల్ నూతన ఎస్ఐగా శంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ముఖ్యంగా యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రత పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు పనిచేస్తారని అన్నారు. సైబర్ క్రైం పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ శాంతి భద్రత పరిరక్షణకు కృషి చేస్తానని, మండలంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## న్యాయం జరిగేలా న్యాయవాదులు సహకరించాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** అవసరమైన వారికి న్యాయ సేవలందించేందుకు న్యాయవాదులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సరైన న్యాయం జరిగేలా సహకరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సూచించారు. మల్కాజిగిరి సాయిరాం థియేటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటైన న్యాయ సంహిత లా ఛాంబర్స్ అడ్వకేట్స్ అండ్ అసోసియేట్స్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఒకే ప్రాంగణంలో న్యాయవాదులు అందుబాటులో ఉండేందుకు ఇలాంటి ఛాంబర్‌లు ఏర్పాటు అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వంశీ కృష్ణ, అరుణ్ కుమార్, ఆదిత్య, వంశీ శ్రీనివాస్ రాజా, తదితరులు పాల్గొన్నారు.



## బానయ్య కార్మికులకు చేసిన సేవలు మరువలేనివి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు విఎస్ బోస్

**ప్రజాపక్షం/దమ్మాయిగూడ:** సింగరేణి కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు చేసిన సేవలు మరవలేనివని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్ అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి)ఇల్లందు బ్రాంచ్ మాజీ కార్యదర్శి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుపెల్లి బానయ్య మృతి చెందిన సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బోస్ దమ్మాయిగూడ ఆయన నివాసంలో భౌతికకాయంపై అరుణ పతాకాన్ని కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్, విజయ్‌బాబు,నర్సింగ్‌రావు, కనకయ్య, కొట్టే మల్లయ్య, చుక్కల నర్సయ్య, కొమ్ము సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



## శత వార్షికోత్సవ ముగింపు సభకు ప్రచారం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** సిపిఐ శత వార్షికోత్సవ ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎఐటియుసి పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మేడ్చల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షులు హరినాథరావు, పారిశుధ్య కార్మిక నాయకులు కమల, శ్రీదేవి, నరసింహ, ఉమారాణి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## పశువుల దొడ్లకు స్థలం ఇవ్వండి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నేరేడ్‌మెట్ డివిజన్‌లో గేదెలు, ఆవులను పెంచుతూ పాల వ్యాపారంతో కులవృత్తిపై ఆధారపడి జీవనాలు కొనసాగిస్తున్న యాదవులకు ఆవులు, గేదెలు కట్టేందుకుగాను ప్రత్యేకంగా పశువుల దొడ్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం రెండెకరాల స్థలం కేటాయించాల ని నేరేడ్‌మెట్ యాదవ సంఘ ప్రతినిధులు కోరారు. గురువారం సంఘ ప్రతినిధులు పూలపల్లి సుందర్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, గడ్డం నితీష్ యాదవ్‌లు అఖిల భారత యాదవ మహాసభ జాతీయ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస యాదవ్‌ను కల్సి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంత రం వారు మాట్లాడుతూ రజకులకు దోబీఘాట్, గౌడ కులస్తులకు ఈతవనం, తాటివనం కోసం ప్రభుత్వం కేటాయించిన విధంగా స్థలాన్ని కేటాయించాలన్నారు. ఆవులను కట్టేందుకు ఏర్పరచుకొనే కొట్టాలు, దొడ్లు పశువుల వ్యర్థాలతో గోబర్ గ్యాస్ ఉత్పన్నం చేసుకోవచ్చన్నారు.

## మల్కాజిగిరి డిసిపిగా సిహెచ్ శ్రీధర్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లోని మల్కాజిగిరి డిసిపిగా తెలంగాణా ఇంటిలిజెన్స్ విభాగ ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న 2020 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన సిహెచ్ శ్రీధర్ నియమితులయ్యారు. ఈ స్థానంలో ఇప్పటివరకు విధులు నిర్వహిస్తున్న 2013 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన పి.వి.పద్మజ తెలంగాణా ఆంటి నార్కోటిక్ బ్యూరోలో ఖాళీగా ఉన్న ఎస్‌పిగా నియమితులయ్యారు. అదే విధంగా ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న మహేశ్వరం జోన్ డిసిపిగా వికారాబాద్ జిల్లా ఎస్‌పిగా పని చేస్తున్న కె.నారాయణ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ బాబురావు తెలిపారు. చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని భరత్ నగర్ 11 కెవి ఫీడర్‌ను శనివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నిలిపి వేయడంతో భరత్ నగర్ కాలనీలో, 11 కెవి జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం ఫీడర్‌ను 2 గంటల నుండి 5గంటల వరకు నిలిపివేయడంతో ఇసీ నగర్, మింట్ కాలనీ, రైల్వే స్టేషన్, మహాలక్ష్మి నగర్, రైల్వే కాలనీలో విద్యుత్‌కు అంతరాయ ఏర్పడుతుందని ఎఇ తెలిపారు.

**వాసవి శివసాయి నగర్ పరిధిలో...** వాసవి శివసాయి నగర్ కాలనీ 11 కెవి ఫీడర్‌ను 10 గంటల నుండి 1 గంటవరకు నిలిపివేయడంతో వాసవి శివసాయి నగర్, వైష్ణవి ఎన్‌క్లేవ్, సోనియా గాంధీ నగర్, గణేష్ నగర్, మారుతీ నగర్, శివసాయినగర్, సామ్రాట్ నగర్, శోభోదయ కాలనీ, లక్ష్మి నరసింహ కాలనీ, నాగార్జున నరగ్ కాలనీ రోడ్ నంబర్1లోని కొద్ది ప్రాంతాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ బాల్‌రాజ్ తెలిపారు.

# కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు

### ఎఐటియుసి మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం వినతి



**ప్రజాపక్షం/నిజాంపేట్:** మున్సిపల్ రంగంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, అలాగే కార్మికుల సమస్యలపై ఈనెల 26వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఛలో హైదరాబాద్ జయప్రదం చేయాలని మున్సిపల్ స్టాఫ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఏసురత్నం, కార్మికులను కోరారు. సిడిఎంఎ ఆఫీసు ముందు ధర్నాకు సంబంధించిన వినతిపత్రాన్ని ఎఐటియుసి ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేబ్బీర్ అలీకి అందచేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. నవంబర్ 26వ తేదీన ఛలో హైదరాబాద్‌లో భాగంగా సిడిఎంఎ ఆఫీసు ముందు ధర్నా నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మున్సిపల్ లో పనిచేసే కార్మికులు వారి సమస్యలు పరిష్కారం కోసం పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. మున్సిపల్ లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చేయాలనీ, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ లేని వారికి కల్పించాలని, క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని గత కెసిఆర్ ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కార్మికులు దేవుళ్లు, కచ్చితంగా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని చెప్పి చేయలేదు అన్ని గుర్తుచేశారు. కెసిఆర్ గతంలో 'ఓడదాటేదాకా ఓడ మల్లన్న, ఓడదాటినాక బోడమల్లయ్య' అన్నట్లు ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయలేదు అని అన్నా రు. కెసిఆర్ మోసం చేసిండు అన్ని కాంగ్రెస్ ను గెలిపిస్తే, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు మరచి పోయారని, మాకు వేతనా లు పెంచక 6సంవత్సరాలు అయిందని అన్నారు.

వేతనాల సవరణ కాలం జూలై 22, 2022కు అయిపోయింది అని, కానీ ఇంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వం పే రివిజన్ మాటే లేదు అన్ని కనుక వెంటనే కనీస వేత్తనం రూ.26000/– చేయాలనీ వారు డిమాండు చేశారు. అలాగే నవంబర్ 26న జరగబోయే ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఆశి యాదయ్య, పొన్నికంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపికి ప్రజలే గుణపాఠం చెబుతారు

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కమ్యూనిస్టుల త్యాగాలను కప్పిపుచ్చాలనుకునే బిజెపి కి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. డిసెంబర్ 26వ తేదీ ఖమ్మంలో జరగనున్న సిపిఐ శతవసంతాల ముగింపు బహిరంగ సభ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బాసర నుండి ప్రారంభమైన సిపిఐ బస్సు జాతా మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలానికి ప్రవేశించింది. ఇసిఐఎల్ నుండి మేడిపల్లి మీదుగా ఘట్‌కేసర్ సెంటర్‌కు చేరుకుంది. ఘట్‌కేసర్ మండల సమితి నాయకత్వం భారీ ఎత్తున జాతా బృందానికి సిపిఐ మండ ల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, జిల్లా నాయకులు కల్లూరి జయచంద్రలు ఘన స్వాగతం పలికారు. జాతాకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, వలి ఉల్లా ఖాద్రి, ఉప్పలయ్య, నరేంద్ర ప్రసాద్‌లకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భం గా పశ్య పద్మ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్రం దేశానికి కావాలని అన్నా రు. ఉద్యమించి ఉరికొయ్యలను ముద్దాడిన భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను తొక్కిపెట్టాలనుకున్న బిజెపికి ప్రజలే గుణపాఠం చెప్తారని భారత కమ్యూనిస్టు పార్టీ అనేక సంఘాలను నిర్మాణం చేసిందని విద్యార్థి యువజన మహిళా కార్మిక కర్షక మేధావి వర్గాలతో సమస్యలను పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని ప్రజా సంఘాల కు దిశనిర్దేశం చేసిందన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు విఎస్ బోస్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి. దామోదర్ రెడ్డి, సాయిలు గౌడ్, కల్లూరి ధర్మేంద్ర, సయ్యద్ ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.



# బస్సు ప్రమాద బాధితులకు నష్టపరిహారం

**ప్రజాపక్షం /వికారాబాద్ :** నవంబర్ 3న మీర్జాగూడా వద్ద బస్సు ప్రమాదంలో గాయపడిన వారి కి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రూపాయల నష్టపరిహారాన్ని ఇళ్ల వద్దకు వెళ్లి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి అందజేశారు. ధారుర్ మండల కేరెల్లి గ్రామలోని బేగరి జయసుద, కొండపూర్ కుర్దులోని యశ్వంత్ రెడ్డి, ధారుర్ మండలనికి చేందన బేగరి లక్ష్మి, చెంగోల్ నందిని, వికారాబాద్ పట్టణంలోని మధుకాలనీకి చెందిన అబ్దుల్ రజాక్, మెథడిస్టు కాలనీకి చెందన చెన్గోముల్ ప్రేరణ, ఎన్నెపల్లిలోని వెంకటయ్య, గోనె రవి, ధన్నారం తాండాలోని బుజ్జిబాయిలకు స్వయంగా ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ బస్సు ప్రమా దం దురదృష్టకర సంఘటననని, దేవుని దయతో మీరు గాయాలతో బయటపడ్డారు. ధైర్యంగా ఉండండి మీకు అండగా ప్రభుత్వం ఉంటుందని, భవిష్యత్తులో ఇలాంటి సంఘనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నా మన్నారు. మన్నెగూడ హైదరాబాద్ రోడ్డు విస్తరణ పనులు వేగం గా జరుగుతున్నాయి,ఏడాదిలోనే పనులు పూర్తి చేయిస్తాం అని అన్నారు. జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి, స్థానిక నాయకులు, తదితరులుపాల్గొన్నారు.



**ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ :** శుక్రవారం ధారుర్ మండల కేంద్రంలోని యంపిడిఓ కార్యాలయంలో ఇందిరమ్మ చీరలను స్పీకర్ ప్రసాద్‌కుమార్ పంపిణీ చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యం ప్రధాన మంత్రిగా ఇందిరమ్మ పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేసింది. ఇందిరమ్మను అదర్శంగా తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్టంలో మహిళలకోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

**ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన స్పీకర్ :** వికారాబాద్ మున్సిపల్ పరధిలోని వెంకటపూర్ తాండలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి అనంతరం వికారాబాద్ మండల పరిధిలోని మదన్‌పల్లి గ్రామంలో గిరిజన చెంచులకు 29ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , ఎస్‌పి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లి ఎన్నికల్లో పేదలకు ఇందిరమ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చాం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం వచ్చాక అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజురు చేస్తున్నామని అన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని అన్నారు. జిల్లాలో ఉన్న గిరిజన, చెంచులకు పక్కా ఇల్లు ఉండాలనే సంకల్పంతో ప్రత్యేకం గా ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, మదన్‌పల్లిగ్రామ చెంచు కాలనీలో ఇప్పటికి 7లక్షల వ్యయంతో సిసిరోడ్డు 10లక్షల రూపాయలతో అంతర్గత మురుగు కాలువలు నిర్మాణాలు చేపట్టి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డిఓ విసుచంద్ర, తహసల్దార్ లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యం




### ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** పేదల ఆరోగ్య సంరక్షణలో సిఎం సహాయనిధి సిఎంఆర్‌ఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం నవాబుపేట్ మండల కేంద్రం ఎంపిడిఓ కార్యాలయంలో ఆయా గ్రామాల కు చెందిన లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు కృషి చేస్తోంది. ఖరీదైన చికిత్సకు వెనుకాడకుండా ప్రజలు ఈ సహాయాన్ని వినియోగించుకోవాలి. సిఎం సహాయనిధి రాజకీయాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉంది. అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని సూచించారు.

అదే విధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ప్రజలకు పథకాలు చేరడమే ముఖ్య ఉద్దేశం. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు ఇవ్వడం వెనుక పేద మధ్యతరగతి కుటుంబాలకు కొంత చేయూత ఇవ్వాలని ఉద్దేశ్యంతో ఈ పథకం ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మెన్ పోలీస్ రాం రెడ్డి, ఎఎంసి చైర్మన్ రాథోడ్ గీత సింగ్, ఎమ్మార్వో జె. బుచ్చయ్య, డిప్యూటీ తాసిల్దార్ నవీన్, సపెండెం ట్ అజయ్ కుమార్, మాజీ ఎంపిటిసి ఎండి ఎగ్బల్, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పి నారాయణరెడ్డి బదిలీ

**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి సాధారణ బదిలీలలో భాగంగా ఎస్‌పిని రాచకొండని మహేశ్వరం జోన్ డిప్యూటీ కమిషనర్ గా బదిలియ్యారు. వికారాబాద్‌కు నూతన ఎస్‌పిగా హైదరాబాద్‌లోని సౌత్ జోన్ నుండి స్రేహ మెహెరా జిల్లా ఎస్‌పిగా బదిలీపై రావడం జరుగుతుంది.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** 126 జగద్గిరిగుట్ట డివిజన్ షిర్డీ హిల్స్ కాలనీలో సుమారు రూ.42లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య అభివృద్ధి, ప్రజా సంక్షేమ అభివృద్ధికి తారకమంత్రమని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వేకంటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, శ్రీ సాయి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ షిర్డి హిల్స్ అధ్యక్షులు బండ మహేందర్, జనరల్ సెక్రటరీ దినేష్, కోశాధికారి కె.వినోద్ యాదవ్, శోభా నాయక్, శైలజ, సురేందర్ రావు, రాజు, ప్రభాకర్, విష్ణు, సీనియర్ నాయకులు బాబు గౌడ్, పాపులు గౌడ్, శశిధర్ ముదిరాజ్, బ్రహ్మానంద చారి, పాపిరెడ్డి, అజం, బ్రహానందచారి, తదితరులు పాల్గొన్నారు.

## 42శాతం రిజర్వేషన్ల తరువాతే సర్పంచ్ ఎన్నికలకు వెళ్లండి

### ప్లకార్డులతో నిరసనకు దిగిన నేతలు

**ప్రజాపక్షం/తాండూరు:** 42శాతం బిసి రిజర్వేషన్ల తరువాతనే ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలకు వెళ్ళాలని, బిసి జర్వేషన్ల వెంటనే చట్టబద్ధత కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లకు 42శాతం చట్టబద్ధత కల్పించకుండనే సర్పంచ్ ఎన్నికలు



నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆర్ కృష్ణయ్య ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం బిసి సంఘం నాయకులు రాజ్‌కుమార్ ఆధ్వర్యాన తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయ ముట్టడితో ప్లకార్డులతో బిసి సంఘం నేతలు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రిజర్వేషన్లు బిక్షకాదు మా సామాజిక హక్కు....పార్టీల పరంగా కాదు...చట్టబద్ధతతో కూడిన బిసి రిజర్వేషన్లు కావాలి, 42శాతం రిజర్వేషన్ల తరువాతే సర్పంచ్ ఎన్నికలకు వెళ్ళాలి అంటూ ప్లకార్డుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసి రిజర్వేషన్లను అమలు చేయడంలో దోబూచులాడుతున్నాయని మండిపడ్డారు. బిసి రిజర్వేషన్లను అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. బిసిలు అంటే ఆయా పార్టీలకు చులకనగా కన్పిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ షుకూర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, జిల్లా మహిళ అధ్యక్షురాలు మధులత శ్రీనివాస్‌చారి, తాండూరు మహిళా అధ్యక్షురాలు అనిత, ఉపాధ్యక్షురాలు మంజుల, కార్యదర్శులు నరసమ్మ, జగదీశ్వరి, నాయిబ్రాహ్మణ సమాజ్ అధ్యక్షులు పరమేష్, రజక సంఘం అధ్యక్ష కార్యదర్శులు రమేష్, రవికుమార్, కురువ సంఘం సభ్యులు బసప్ప, గౌడ సంఘం నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు, బహుజన నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ



**ప్రజాపక్షం/పరిగి:** పరిగి ప్రజాభవన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ చీరలను పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మహిళకు నాణ్యమైన చీర అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సిరిసిల్లాలోని చేనేత కార్మికులతో ప్రత్యేకంగా తయారు చేయించారని తెలిపారు. మహిళా సంఘలతోపాటు ప్రతి ఇంటి మహిళకు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఉమా రామ్మోహన్‌రెడ్డి, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**తాండూరులో:** నేడు తాండూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పర్యటిస్తారని క్యాంపు కార్యాలయం సిబ్బంది ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కుల పంపిణీతో పాటు ఇందిరా మహిళా శక్తి సంఘాలకు ఇందిరమ్మ చీరల పంపిణీకి శ్రీకారం చుట్టున్నున్నారని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10గంటలకు మండల కేంద్రమైన బషీరాబాద్‌లోని రైతు వేదికలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని, 12గంటలకు యాలాల మండల కేంద్రంలోని మండలానికి చెందిన లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్, చెక్కుల పంపిణీతో పాటు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు తాండూరు ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్, చెక్కుల పంపిణీతో పాటు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ, సాయంత్రం 4గంటలకు మండల కేంద్రంమైన పెద్దేముల్ లోని రైతు వేదికలో జరిగే ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గోని మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణితో పాటు కోట్‌పల్లి మండలానికి చెందిన లబ్ది దారులకు కళ్యాణ లక్ష్మి , షాదిముబారక్ చెక్కులను అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొనారని కోరారు.

## బాల్య వివాహాలు అరికట్టాలి

ప్రజాపక్షం/యాచారం : బాల్య వివాహలను ప్రతిఒక్కరు అరికట్టాల్సిన అవసరం ఉందని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిస్ అధ్వర్యంలో అవగాహణ సదస్సు నిర్వహించారు. ఈసదస్సులకు అమే ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బాల్య వివాహం చేయడం వల్ల ఎన్నో అనర్థాలు వస్తాయన్నారు.కిషోర బాలికలు తమ అరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కొరారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారుల.చట్ట విరుద్ధంగా కొంతమంది తమ పిల్లలకు పెళ్ళి చేసి వారి బంగారు భవిషత్తును నాశనం చేస్తున్నారని పెర్కొన్నారు.అరోగ్య సమస్యలతో అడపిల్లలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఎదురుకుంటున్నారన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు అర్థం చేసుకొవాలన్నారు.విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి మాట్లాడుతూ బాలికలు నేడు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు.. వారిని చిన్నచూపు చూడడం సరైంది కాదన్నారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ సరళ, పిహెచ్ఒ సుందరి,అంగన్ వాడి టిచర్లు విజయ,సావిత్రి, అశావర్కర్లు బాలమ్మ తదితరులు పాల్గోన్నారు.

## హెచ్ఐవి అపోహలపై అవగాహన



ప్రజాపక్షం/రంగారెడ్డి: హెచ్ఐవి,ఎయిడ్స్‌పై ప్రజలకు ఉన్న అపోహలు తొలగించడానికి అవగాహన కల్పించాలని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ వై పాపారావు అన్నారు.శుక్రవారం డిస్టిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి ఎయిడ్స్(దిశ) ప్రోగ్రాం లో భాగంగా రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మన్సురాబాద్ యుపిహెచ్‌సి నుండిహెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కల్పించడానికి ఎల్ఈడి మొబైల్ ఐఇసి వ్యాన్ ను అడిషనల్ డి ఎంహెచ్ఒ డాక్టర్ వై పాపారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ వ్యాను జిల్లాలో 15 రోజులు వివిధ ప్రాంతాలలో ఎల్ఈడి ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తుందని వివరించారు. దిశ ప్రోగ్రామ్ మేనేజర్ డానియల్, క్లినికల్ సర్వీసెస్ ఆఫీసర్ రమేష్,డిఎం డిఒ శివప్రసాద్,యుపిహెచ్ సి మన్సురాబాద్ ససిబ్బంది,ఎన్ జి ఒ,టిబి స్టాప్, తదితరులు పాల్గొన్నారు.

## బిసిల రిజర్వేషన్లను చట్టబద్ధత చేయాలి

### విద్యార్థుల కలెక్టరేట్ ముట్టడిలో ఎంపి ఆర్.కృష్ణయ్య



ప్రజాపక్షం / హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా ఇవ్వాలని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వందలాది మంది బిసి విద్యార్థులు హైదరాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. బిసి విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ల సతీశ్, బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లపై నమ్మించి మోసం చేయడం బిసిలను అవమానపరిచినట్టేనని పేర్కొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి, ప్రధానితో చర్చించి బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత తేవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయని, అదేవిధంగా, బిసిల రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణకు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన హామీ ప్రకారం 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇవ్వాల్సిందేనని, లేనిపక్షంలో పార్టీపరంగా ఇస్తామంటే ఊరుకోబోమని, పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## అభివృద్ధికి అడ్డుపడితే ఊరుకోం



ప్రజాపక్షం/హయత్ నగర్: ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే అనుచరులు దమ్ముంటే డివిజన్ అభివృద్ధికి నిధులు తేవాలి కానీ మచ్చ లేని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి పై ఆరోపణలు చేస్తే సహించేది లేదు అని బీజేపీ డివిజన్అధ్యక్షులుహరీష్‌రెడ్డిఅన్నారు.శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు మన్సూరాబాద్ డివిజన్‌లో కొంత కాలముగా ఎమ్మెల్యే అనుచరులు డివిజన్ అభివృద్ధి కి అడుగు అడుగున అడ్డుపడుతూ కార్పొరేటర్ మీద సోషల్ మీడియా లో పసలేని ఆరోపనులు చేస్తున్న వారికి బీజేపీ డివిజన్ అధ్యక్షులు హరీష్ రెడ్డి కాబద్ధార్ అని హెచ్చరించారు. కొప్పుల నర్సింహారెడ్డి కార్పొరేటర్ అయినప్పటి నుండి ఎమ్మెల్యే సహకరించక పోయినప్పటికీ డివిజన్ ను అనేక విధాలుగా అభివృద్ధి చేశారుని తెలిపారు. కార్పొరేటర్ కు సంబంధం లేని విషయం ఎడిటింగ్ చేసి హార్డ్‌వేరు షాప్ ను వైన్ షాప్ గా మార్చిన ఘనత ఎమ్మెల్యే అనుచరులదే అని అన్నారు. బీజేపీ నాయకులు సంతోష్ యాదగిరి యాదవ్ పోట్లపెల్లి సాయిరామ్ గౌడ్ ముత్యం రెడ్డి శ్రీనివాస్‌వెంకట్‌జగన్ గోపియాదవ్ పాల్గొన్నారు.

## డిహెచ్ఇడబ్ల్యులో ఖాళీ పోస్టులు భర్తీ

ప్రజాపక్షం/రంగారెడ్డి:మహిళా,శిశు సంక్షేమ శాఖ పరిధిలో నడుస్తున్న మిషన్ శక్తి పథకం కింద,జిల్లాలోని జిల్లా మహిళా సాధికార హబ్ (డిహెచ్ఇడబ్ల్యూ),సఖి వన్ స్టాప్ సెంటర్1 (వనస్థలిపురం)లో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయడం జరుగుతుందని, ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా రంగారెడ్డి జిల్లా మహిళా అభివృద్ధి,శిశు సంక్షేమ,వయోవృద్ధులు అండ్ వికలాంగుల శాఖ అధికారి ఎల్ శ్రీలత తెలిపారు.నవంబర్ 28వ తేదీ సాయంత్రం 5:00 లోపు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవలసిందిగా జిల్లా సంక్షేమ అధికారి శ్రీలత తెలిపారు.

## సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: పేదవారి సొంతింటి కల నెరవేర్చడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామేనా భీమ్ భరత్ అన్నారు. శంకర్ పల్లి మండలం ఎలువర్తి గ్రామంలో శుక్రవారం కొత్తపల్లి జ్యోతి రామచందర్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని రిబ్బన్ కట్ చేసి నూతన గృహప్రవేశం వారితో చేయించారు. ఆయన మాట్లాడుతూ సొంతిల్లు ఓ భరోసా అన్నారు. మనకంటూ ఓ గూడు ఉంటే ఆ నీడన కారం రొట్టె తిన్న సంతృప్తిగా ఉంటుందని చెప్పారు. శంకర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, జాతీయ నాయకులు ఎస్. అనంతరెడ్డి, రాష్ట్ర నాయకులు ఉదయ మోహన్ రెడ్డి, శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, బద్ధం చిన్న కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శ్రీనాథ్ గౌడ్, శంకర్, కొండ పెంటయ్య, శివ యాదవ్, కె. వీరేష్ వై. మల్లేష్, ఎన్. శ్రీనివాస్, కే. రాకేష్, పి. మల్లేష్, విష్ణు, ఎం.శివ, మనీష్ రెడ్డి, లక్ష్మయ్య, కుమార్, రాంచందర్ నరసింహులు,మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలోనే కల సాకారం

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదోడి సొంతింటి కల నెరవేరుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని రెండవ వా ర్డులోని ఆరెగూడెం మీనా శ్రీశైలం దం పతుల ఇందిరమ్మ నూతన ఇల్లు ప్రారంభించి దంపతులతో గృహప్రవేశం చేయించారు. అలాగే నవపేట్ మండలం అక్నాపూర్ గ్రామవాసి ఊరడి భాగ్యమ్మ బందయ్య దంపతులు నిర్మించుకునే ఇందిరమ్మ నూతన ఇంటిని ప్రారంభించి వారితో కూడా గృహప్రవేశం చేయించారు. శంకర్ పల్లి మాజీ ఉప సర్పంచ్,కాంగ్రెస్ నాయకులుసాతా ప్రవీణ్‌కుమార్,మున్సిపల్‌మాజీకౌన్సిలర్ ఎం. చంద్రమౌళి, నాయకులుచేకూర్తగోపాల్‌రెడ్డి,జూలకంటి పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

## యాచారం అభివృద్ధికి కృషి

ప్రజాపక్షం/యాచారం : యాచారం మండల సహకారసంఘం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని యాచారం మండల సహకారసంఘం చైర్మేన్ తోటిరెడ్డి రాజేంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాచారం మండల సహకార సంఘం చైర్మేన్‌గా తిరిగి కోర్టు అదేశాలతో బాధ్యతలను స్వికరించారు. అయన మాట్లాడుతూ సహకార సంఘం చైర్మన్ విషయంలో జిల్లా డిసిఒ కోర్టు అర్డర్‌ను దిక్కరించి ఇన్ని రోజులు అర్డర్ ఇవ్వకుండా అడ్డుకున్నారని తెలిపారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు తనపై లేనిపోని విమర్శలు చేశారన్నారు. అక్టోబర్ 27న చైర్మేన్‌గా కోనసాగించాలని కోర్టు అర్డర్‌జారిచేసిన ఇవ్వలేదన్నారు..రైతులకు అందుబాటులో ఉంటు సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

### బిసిల రిజర్వేషన్‌ను 42శాతం నుంచి 22శాతానికి

# తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోండి

### 136 బిసి కుల సంఘాల సమావేశంలో ఆర్.కృష్ణయ్య



ప్రజాపక్షం/హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం మొన్న మంత్రివర్గ సమావేశంలో స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్లను 42శాతం నుంచి 22శాతానికి తగ్గిస్తూ తీసుకొన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్ లక్డీకాపూల్‌లో బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అధ్యక్షతన జరిగిన 130 బిసి కుల సంఘాలు, 45 బిసి సంఘాలు,ఉద్యోగసంఘాలు, విద్యార్థి సం ఘాల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది.ఆర్.కృష్ణయ్యతోపాటు శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి,దర్శక,నిర్మాత, నటుడు ఆర్.నారాయణమూర్తి, సినీ దర్శకులు ఎన్.శంకర్, నిర్మాత రామకృష్ణ, జాతీయ బిసి సంక్షేమ సంఘం కో–ఆర్డినేటర్ డా.ర్యాగ రిషి అరుణ్‌కుమార్ హాజరయ్యారు.ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఏడాదికాలం నుంచి చట్టబద్ధంగా బిసి రిజర్వేషన్ల అంటూ ప్రకటించి, ప్రస్తుతం పార్టీపరంగా ఇస్తామని చెప్పడం 2 కోట్ల మంది బిసిలకు ద్రోహం చేయడమేనన్నారు.మొదటి నుంచి వివిధ పార్టీల మద్దతు ద్వారా పోరాడితే 42శాతం రిజర్వేషన్లు సాధించే అవకాశం ఉండేదని,కానీ రాష్ట్ర ప్రభుత్వం అలాంటి ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఇండియాకూటమిలో240మందిఎంపిలున్నా ఏనాడూ బిసి రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో ప్రశ్నించలేదని, ప్రధానితో చర్చించలేదన్నారు.మధుసూదనాచారి మాట్లాడుతూ అఖిలపక్ష రాజకీయ పార్టీలతో, ప్రధానితో చర్చలు జరిపి, బిసి రిజర్వేషన్ల సమస్యనుపరిష్కరించాలని కోరారు. ఆర్. నారాయణ మూర్తిమాట్లాడుతూ ఆర్.కృష్ణయ్య 50ఏళ్లు పోరాడిఇంత దూరంఉ ద్యమాన్ని తెచ్చారన్నారు. న్యాయపరమైన అడ్డంకుల్లేకుండా జనాభా లెక్క లు తీశారని, హైకోర్టులో కేసు వాదనలు సరిగ్గా విని పిస్తే వందశాతం గెలుస్తుందన్నారు. బిసి కుల సంఘాలనేతలు మేకల రాములు యాద వ్, రాజ్‌కుమార్,శంకర్‌ముదిరాజ్, విజయ్‌కుమార్, అనురాధగౌడ్,మల్లేశం,లాలకోటవెంకటచారి, నిమ్మల వీరన్న, కుమారస్వామి, వెంకన్నగౌడ్, హనుమంతముదిరాజ్ కృష్ణుడు, రాజు నేత ఉన్నారు.

## కొత్త యుగంలోకి ఇంటర్ విద్య



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణల అమలు ఫలితంగా ఇంటర్మీడియట్ విద్య ఒక కొత్తయుగంలోకి అడుగుపెడుతున్న క్రమంలో ఈ విభాగంలోని లైబ్రేరియన్లకు పదోన్నతులు కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కాలేజీ లైబ్రేరియన్ల అసోసియేషన్ (టిజిజెసిఎల్ఎ) రాష్ట్ర అధ్యక్షులు బి.బాలు నాయక్, ప్రధానకార్యదర్శి ఒ.శివకుమార్ కోరారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ కళాశాలల్లో 90శాతం డాటా అన్‌లైన్ (యుడైజ్), ప్రతి విద్యార్థికి ప్రత్యేకమైన శాశ్వత ఐడి సంఖ్య (పెన్) ఏర్పాటు చేయడం ఆధునీకరణకు ఒక కీలక అడుగు అని భావిస్తున్నట్టు తెలిపారు.స్కాలర్‌షిప్‌లు మంజూరు, పరిపాలనా పనులకు ఆటంకం ఉండదన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా హాల్‌టికెట్లపై టెలిమానస్ టోల్ ఫ్రీ నంబర్లను ముద్రించారన్నారు. ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థ పారదర్శకంగా మారుతున్నదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుకు రూ.10 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేస్తూ ప్రతి కాలేజికి రూ.10 వేల నుంచి రూ.20వేలకు మెయింటెనెన్స్ కొరకు ఇవ్వడం హర్షణీయమన్నారు. పదోన్నతి లేని ఏకైక శాఖ లైబ్రరీ శాఖ మాత్రమేనని, లైబ్రేరియన్లకు ప్రమోషన్ చానల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కుమార్, సందీప్,మహేందర్, నరేశ్ పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు పనుల్లో జాప్యం




ప్రజాపక్షం/మియాపూర్:మంజీరా పైప్‌లైన్ రోడ్ పనులు సంవత్సరాలుగాఅసంపూర్తిగాకొనసాగుతుండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని బిజెపి శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ రవికుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హాఫీజ్‌పేట్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ అనుష మహేష్ యాదవ్,డివిజన్ అధ్యక్షులు జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో రవికుమార్ యాదవ్ మాట్లాడారు.మంజీరా పైప్‌లైన్ రోడ్ పనులు ఏళ్లుగా నత్తనడకన సాగుతున్నాయని, జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించడం వల్ల రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడిందన్నారు. రోడ్డు విస్తరణకు నిధులు మంజూరైనప్పటికీ పనులు వేగం పుంజుకోవడం లేదని ప్రశ్నించారు.గతంలో కూడా బిజెపి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి చందానగర్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందించినా పురోగతి లేకపోవడం దురదృష్టకరమన్నారు.అంతేకాకుండా హాఫీజ్‌పేట్ డివిజన్‌లోని సమస్యలపై పలుమార్లు అధికారులను అప్రమత్తం చేసినా స్పందన లేకపోవడం విచారకరమని తెలిపారు.కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన కూరగాయల షెడ్లను లబ్ధిదారులకు కేటాయించకుండా వదిలేయడం వల్ల అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని,దీనిపై అధికారులు ఏ చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆక్షేపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని మండిపడ్డారు.రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.అలాగే అధికారులను ఉద్దేశించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు, డ్రైనేజీ, పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధి పై వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రమణయ్య,సత్యనారాయణ రాజు,కోటేశ్వర రావు,దేవాల్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్,రంగారెడ్డి,బాబు రెడ్డి, పద్మ, సరోజ, శ్రీనివాస్, రాజు యాదవ్ ఉన్నారు.

## అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్‌: పార్కు స్థలంను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన డాక్యూమెంట్‌ను రద్దు చేయాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం డివిజన్‌లోని శ్రీపురం కాలనీ సంక్షేమ వాసులతో కలిసి చత్రపతీ శివాజీ పార్కు ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి పరిధిలోని ఉన్న శ్రీపురం కాలనీ పార్కు దాదాపు 5వేల గజాల స్థలాన్ని పార్కు కోసం, కొన్ని చోట్ల కమిటీ హాల్, క్రీడా ప్రాంగణం కోసం కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు. ఖాళీ స్థలాన్ని అదునుగా చేసుకున్న అక్రమార్కులు లక్షలు విలువ చేసే స్థలాన్ని నకిలీ డాక్యూమెంట్ తయారు కోర్టు ఆర్డర్ ఉందని చూపించి అక్రమంగా వనస్థలిపురం సబ్ రిజిస్ట్రేషన్‌లో పార్కు స్థలంను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీనిపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడంతో సబ్ రిజిస్ట్రార్‌పై వేటు వేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ దృష్టి సారించడంతో అధికారులల్లో వణుకుపుట్టిందన్నారు. పార్కు, కమిటీ హాల్, క్రీడా ప్రాంగణం ఉన్న స్థలాల రిజిస్ట్రేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ విధుల్లో ఉన్న వారు పూర్తి స్థాయిలో విచారణ చేసి చేసిన డాక్యూమెంట్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, ముత్యమ్ రావు, మహేందర్‌రెడ్డి, సికెందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, అరవిందర్‌రెడ్డి, పాండు రంగం, వెంకట్‌రెడ్డి, రాజేందర్,వెంకట్ రమణరెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటి, నీట్ అకాడమీ ఏర్పాటు అభినందనీయం

### తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని స్థానికంగా ఐఐటి, నీట్ ఆకాడమీ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆకాడమీ కరపత్రాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐఐటి, జెఈఈ, నీట్ కోర్సులకు సంబంధించిన ఆకాడమీలు లేవని, నిర్వాహకులు ముందుకు వచ్చి ఏర్పాటు చేస్తామని చెప్పడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ముగిసిన తరువాత ఉన్నత విద్యను హైద్రాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సి ఉంటుందని గుర్తు చేశారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దూరం చేసేందుకు నిర్వాహకులు ముందుకు వచ్చి ఏర్పాటు చేస్తామని చెప్పడం విద్యార్థులకు శుభ సూచికమని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి షాద్‌నగర్‌లోనే నీట్, జెఈఈ, ఐఐటిలకు సంబంధించిన కోర్సులకు సంబంధించిన ఆకాడమీని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నందిగామ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండారు చంద్రపాల్‌రెడ్డి, నవనీత, అలూరి దేవేందర్, బాపుసింగ్, యోగేందర్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం, ఆంజనేయులు, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

## 25న కరీంనగర్‌లో మత్స్య కార్మికుల మహాసభ

### గోరెంకల నరసింహ, కృష్ణమూర్తి నీరటి మల్లేష్, మనోజ్ ముదిరాజ్



ప్రజాపక్షం/శంషాబాద్: తెలంగాణ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర నాలుగో మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ శంషాబాద్‌లో మహాసభ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. నవంబర్ 25న కరీంనగర్‌లో జరగనున్నఈ మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మత్స్యకారులు తరలివచ్చి సంఘ బలోపేతాన్ని ప్రపంచానికి చాటాలని నాయకులు దంకా ధ్వనించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నరసింహ,రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి నేతృత్వం వహించారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నీరటి మల్లేష్,శంషాబాద్ మండల కోశాధికారి బొబ్బిలి మనోజ్ ముదిరాజ్,మండల ఉపాధ్యక్షులు కొండ్రముని శ్రీశైలం, దీపక్ ముదిరాజ్, రాచపల్లి సిద్దేశ్వర్,పూలపల్లి సిద్ధులు, ఆవుల ఆకాష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధి,వృత్తి భద్రత, సంక్షేమం కోసం సంఘం ఇరవై ఐదు ఏళ్లుగా అవిశ్రాంతంగా పోరాడుతోంది. కరీంనగర్ మహాసభలో ప్రతి మత్స్యకారుడూ తప్పనిసరిగా పాల్గొని సంఘ శక్తిని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. అనంతరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నీరటి మల్లేష్ మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ హక్కులుసౌకర్యాల కోసం నిరంతరం కృషి చేస్తున్నాం.ఈ మహాసభ మత్స్యకారుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది. వేలాది మందిగా హాజరై సభను విజయవంతం చేయాల్సిందిగా శంషాబాద్ మండల కోశాధికారి బొబ్బిలి మనోజ్ ముదిరాజ్ అన్నారు. నవంబర్ 25న ప్రతి మత్స్యకార కుటుంబం కరీంనగర్కు నూలుదుంప,వలలు చేతపట్టుకుని తరలివచ్చి మన భవిష్యత్తు కోసం ఐక్యంగా నిలబడాలని డప్పు కొట్టారు. శంషాబాద్ మండల ఉపాధ్యక్షులు కొండ్రముని శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఊరుకోం

ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రజలకు భద్రత కల్పించడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం కాటన్‌సర్చ్ ఆపరేషన్ చేపట్టామని శంషాబాద్ డిసిపి రాజేష్ తెలిపారు. శుక్రవారం రాత్రి షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫరూఖ్‌నగర్ ఏరియాలో ఏసిపి లక్ష్మీ నారాయణ, సిఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో 234మంది వివిధ విభాగాల పోలీసులు పాల్గొని 9టీంలుగా విడిపోయి విస్తృతంగా తనిఖీలు చేశారు. డిసిపి రాజేష్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, క్రైమ్ రేట్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఎంచుకొని ఆపరేషన్ చేపట్టామని వివరించారు. ఈ తనిఖీల్లో ఆరు బెల్టు షాపులపై, రెండు గుట్కా షాపులపై కేసులు నమోదు చేశామని వివరించారు. 30వాహనాలకు పైగా సరైన పత్రాలు లభించకపోవడంతో వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మరో 24వాహనాలకు నెంబర్‌ప్లేట్లు లేకపోవడంతో వాటిని సైతం సీజ్ చేశామన్నారు. ప్రజలు నివసించే బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తే చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో అనుమానాస్పద ఇండ్లు, అద్దె గృహాలు, శివారు ప్రాంతాలు, వాహనాలు, లార్జీలు, బెల్టు షాపులపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్లు వివరించారు.

## ఆలయ కోనేరుకు శంకుస్థాపన

ప్రజాపక్షం/కొత్తూరు: శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయ కోనేరుకు శంకుస్థాపన చేశారు. శుక్రవారం కొత్తూరు మండల పరిధిలోని పెంజర్లలో శ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయ ఆవరణలోరూ.15లక్షలతోనిర్మించనున్న అనంత పద్మనాభ స్వామి కోనేరుకు ఆలయ చైర్ పర్సన్ బెజవాడ అనితరెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డిలు భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ అనంత పద్మనాభ స్వామి దేవాలయంకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మాజీ ఆలయ కమిటి చైర్మెన్ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటి సభ్యులు, మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి రమేష్, పద్మారెడ్డి, శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మామిడి సిద్దార్థరెడ్డి, ఎర్రోళ్ల జగన్, మాజీ కమిటి సభ్యులు దామోదర్‌రెడ్డి, రాజు, దేశాల భీమయ్య, బుచ్చిరెడ్డి, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## 42శాతం బిసి బిల్లు అమలు చేయాలి

### బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ



ప్రజాపక్షం/సరూర్ నగర్‌: 42 శాతం బీసీ బిల్లులను అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముం దు నిరసన దీక్షలను జయప్రధం చేయాలని బీసి హక్కుల సాధన కమితి తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం నాగోల్‌లోని ప్రజాసంఘాల కార్యాయం ఎస్ఏడాంగే భవన్‌లో బీసి హక్కుల సాధన సమితి ఎల్‌బినగర్ నియోజకవర్గం సమావేశాన్ని సంగు సైదారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డుపల్లి కృష్ణ ముఖ్యఅతిథిగా నిరసన దీక్షలకు సంబందించి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందన్నారు. కాని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి స్థానిక సంస్థల కాల పరిమితి ముగిస్తున్న తరుణంలోస్థానిక సంస్థల్లో విద్య ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేన్లు కల్పిస్తూ చేసిన చట్టాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించి, గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించి, ఏడు నెలలు గడుస్తుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్రంపై వత్తిడి తెచ్చేవిదంగా వెంటనే తగిన కార్యాచరణ రూపొందించాలని కోరుతూ బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్ అన్నారు. ఈ కార్యక్రమంలో యు.మల్లేష్‌గౌడ్, ఎస్.గోపాల్, పాండు, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవయ్య మృతి సిపిఐకి తీరనిలోటు



### మాజీ రాజ్యసభ సభ్యులు సయ్యద్ అజీజ్‌పాషా

ప్రజాపక్షం/సరూర్‌నగర్‌: ఎల్‌బినగర్ సర్కిల్‌లో పార్టీ బలోపేతానికి నాగిళ్ల దేవయ్య చేసిన సేవలు మరువలేనివని, ఆయన మరణం పార్టీకి తీరణి లోటుఅనిసిపిఐజాతీయ నాయకులు,మాజీ రాజ్యసభ సభ్యులు సయ్యద్ అజీజ్‌పాషా అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ శంకర్‌నగర్ కమిటీ హాల్ లో సిపిఐ సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యధర్శి బాతరాజు నర్సింహా అధ్యక్షతన మాజీ ఎల్‌బినగర్ సర్కిల్ సమితి కార్యధర్శి నాగిళ్ల దేవయ్య సంతాప సభ ను నిర్వహించారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యధర్శి పాలమాకుల జంగయ్య,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలుతో కలిసి సయ్యద్ అజీజ్‌పాషా దేవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరంఆయన మాట్లాడుతూ ఎల్‌బినగర్ సర్కిల్ లో పార్టీబలోపేతానికిదేవయ్య కృషి చేశారన్నారు.సిపిఐ జిల్లా నాయకులు ఆర్.గోపాల్, జిల్లా సమితి సభ్యులు జిల్లాల కృష్ణ, గ్యార క్రాంతి,కమలమ్మ,సక్రునాయక్,ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్,మహమ్మద్ఇస్మాయిల్,రమణమ్మ, శ్యామలమ్మ, సుగుణమ్మ, లక్ష్మ మ్మ, పెంటమ్మ, ఇజ్రేజ్, యూసూఫ్, ఎల్లమ్మ, బ్రహ్మచారి, నర్సమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఫోన్‌లకు దూరంగా ఉండాలి

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి: రెసోనెన్స్ కళాశాల లు, పాఠశాలలో కూడిన రెసోనెన్స్ గ్రూప్ మాదాపూర్‌లో విశిష్ట వేడుకను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జేడీ లక్ష్మీ నారయణ,రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌ట్యూషన్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. మాజీ జేడీ లక్ష్మీ నారయణ మాట్లాడుతూ విద్య అనేది ప్రగతిశీల సమాజానికి మెన్నెముకలాంటిదని, విద్యా పునాదులను బలోపేతం చేసుకొవడానికి మెగా రెసోఫెస్ట్ ప్రతిభా ప్రోత్సహక పరీక్షలు చక్కని వేదిక అని తెలిపారు. విద్యార్థులు ఫోన్‌లకు దూరంగా ఉండి చదువులపై శ్రద్ధ ఉంచితే దూసుకెళ్తారని తెలిపారు. రెసోనెన్స్ ఎడ్యుకేషనల్‌సంస్థల ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో డిసెంబర్ 14న మెగా రెసోఫెస్ట్ ప్రతిభా ప్రోత్సహక పరీక్షలను నిర్వహించనున్నారని తెలిపారు. అనంతరం రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడారు. ప్రతిభా పరీక్షలు నగరంలో 50కిపైగా కేంద్రాలలోనిర్వహించనున్నారని,ఐదు నుండి పదకొండో తరగతి విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ పరీక్షలు విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారి బలాన్ని పెంపోందించడం, విద్యా పోటీ పరీక్షలలో విజయానికి దారి చూపడమన్నారు. ఈ పరీక్షలలో అత్యుత్తమంగా నిలిచిన విద్యార్థులకు ఉచిత విద్యఅందించబోతున్నామని, 100 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లు, టాప్ ర్యాంకర్‌లకు 100 ట్యాబ్‌లు అందించనున్నామని తెలిపారు.

# క్రీడ

# డబ్ల్యుపిఎల్ వేలంలో 277 మంది..

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ మెగా వేలానికి మరో ఆరు రోజులే ఉంది. ఢిల్లీ వేదికగా మ్యాచ్ విన్నర్లను కొనేందుకు ఐదు ఫ్రాంచైజీలు గట్టి కసరత్తే చేస్తున్నాయి. ఈసారి వేలంలో 277 మంది పేర్లు నమోదు చేసుకోగా.. వీరిలో 194 మంది భారత క్రికెటర్లు ఉన్నారు. ఆక్షన్ బరిలో ప్రపంచకప్ స్టార్లు దీప్తి శర్మ, లారా వొల్వార్డ్ట్, అలీసా హేలీతో పాటు అన్‌క్యాప్డ్ క్రికెటర్లూ ఉన్నారు. అత్యధిక కనీస ధర రూ.50 లక్షల నుంచి అత్యల్పం రూ.20 లక్షల జాబితాలోని అమ్మాయిలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మరి.. వేలంలో పాల్గొంటున్న వారి వివరాలు తెలుసుకుందామా.



డబ్ల్యుపిఎల్ నాలుగో సీజన్ వేలంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మూడు సీజన్లుగా ఒకే ఫ్రాంచైజీకి ఆడిన పలువురు స్టార్ ప్లేయర్లు ఈసారి వేలంలోకి వస్తున్నారు. వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ విజేత దీప్తి శర్మ నుంచి.. రెండు శతకాలతో మెరిసిన లారా వొల్వార్డ్ట్, ఎలీసా హీలీ, వన్డేలకు వీడ్కోలు పలికిన సోఫీ డెవినె వంటి దిగ్గజ క్రికెటర్లు భారీ ధర పలికే అవకాశముంది. వేలంలో 277 మంది పాల్గొంటున్నా 73 మందికే అవకాశముంది. 194 మంది భారత క్రికెటర్లలో52 మంది క్యాప్డ్, 142 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు ఉన్నారు. వీరిలో 50 స్థానాలు మనోళ్లకు.. తక్కిన 23 విదేశీ క్రికెటర్లకు వర్తిస్తాయి. ఇక.. 83 మంది ఓవర్సీస్ క్రికెటర్లలో 66 మంది క్యాప్డ్ కాగా.. 17 మంది అన్‌క్యాప్డ్.

### అత్యధికం.. ఆ 19 మందికే

నవంబర్ 27న మధ్యాహ్నం 3:30కి వేలం షురూ కానుంది. అత్యధిక కనీస ధర విషయానికొస్తే.. రూ.50 లక్షలు. ఈ ధరతో19 మంది ఉండగా.. రూ.40 లక్షలకు 11 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. అత్యధికంగా రూ.30 లక్షల గ్రూప్‌లో 88 మంది రిజిష్టరయ్యారు. రూ.20 లక్షలు, రూ.10 లక్షల కనీస ధరలో అన్‌క్యాప్డ్ ప్లేయర్లు ఎక్కువగా ఉన్నారు.

**50 లక్షలు:** దీప్తి శర్మ, హర్లీన్ డియోల్, ప్రతీకా రావల్, ఉమా ఛెత్రీ, పూజా వస్త్రాకర్ (భారత్), సోఫీ డెవినె, అమేలియా కేర్ (న్యూజిలాండ్), అలీసా హీలీ, మేగ్ లానింగ్, ఫొబె లిచ్‌ఫీల్డ్ జార్జియా వరేహం (ఆస్ట్రేలియా), సోఫీ ఎకిల్‌స్టోన్, హీథర్ నైట్, డానీవ్యాట్ (ఇంగ్లాండ్).

**40 లక్షలు:** రేణుకా సింగ్, కిరణ్ నవ్‌గిరే, రాజేశ్వరీ గైక్వాడ్ శిఖా పాండే, మిన్ను మణి (భారత్), జార్జియా వొల్ (ఆస్ట్రేలియా)

**30 లక్షలు:** లారా వొల్వార్డ్ట్(దక్షిణాఫ్రికా), స్నేహ్ రానా, రాధా యాదవ్, మేఘన్ ఎస్, భారతి ఫుల్‌మలి, టిటస్ సధు, సైకా ఇషాక్, ప్రియా మిశ్రా, అశా శోభన, స్నేహ

### స్టార్లకే 50 లక్షల కనీస ధర!

దీప్తి, అరుంధతి రెడ్డి, సంజన ఎస్, యస్తికా భాటియా, తానియా భాటియా, సుష్మా వర్మ, సోనీ యాదవ్, ఎక్తా బిష్త్,(భారత్), షబ్నం ఇస్మాయిల్ (దక్షిణాఫ్రికా), మరుఫా అక్తర్(బంగ్లాదేశ్), ఇనొక రణవీరా(శ్రీలంక).

**రూ.20 లక్షలు:** సంస్కృతి గుప్తా, అమన్దీప్ కౌర్, అక్షిత మహేశ్వరి, సాయి దీప్తి, త్రివేణి వసిస్త(భారత్).

**10 లక్షలు:** సనికా చాల్కే, ప్రణవి చంద్ర, వ్రిందా దినేశ్, ఆరుషి గోయెల్, దిశా కసత్, దీయ యాదవ్, జి.త్రిష, షిప్రా గిరి, మిథాలీ వినోద్, హ్యాపీ కుమారి (భారత్).

# ఫైనల్లో బంగ్లాదేశ్
## సూపర్ ఓవర్‌లో ఓడిన భారత్ 'ఏ'



రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో భారత్ 'ఏ' జట్టుకు భారీ షాక్. సెమీ ఫైనల్లో బంగ్లాదేశ్ ధాటికి బ్యాటర్లు విఫలమైనా.. లోయరార్డర్ పోరాటంతో మ్యాచ్ సూపర్ ఓవర్ వరకూ వెళ్లింది. కానీ, ఒత్తిడికి తలొగ్గిన టీమిండియా థ్రిల్లర్‌లో ఓడిపోయింది. 195 పరుగుల ఛేదనలో ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(44), వైభవ్ సూర్యవంశీ(38)లు శుభారంభమిచ్చినా మిడిలార్డర్ తేలిపోయింది. సూపర్ ఓవర్లో వరుసగా రెండు బంతుల్లో బంగ్లా పేసర్ రిప్పన్ రెండు వికెట్లు తీయగా.. ఆ తర్వాత ఒక వికెట్ కోల్పోయిన బంగ్లా లక్ష్యాన్ని చేరుకొని తొలిసారి ఫైనల్లో అడుగుపెట్టింది.

రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో మరో ఉత్కంఠ పోరు. ఈసారి ఫలితం మాత్రం భారత్ 'ఏ' జట్టుకు కలిసిరాలేదు. ఆద్యంతం ఉత్కంఠ రేపిన తొలి సెమీఫైనల్లో బంగ్లాదేశ్ విజయం సాధించింది. ప్రత్యర్థికి భారీ స్కోర్ సమర్పించుకున్న భారత జట్టు మూల్యం చెల్లించుకుంది. ఛేదనలో ఓపెనర్లు అదిరే ఆరంభమిచ్చినా మిడిలార్డర్ బ్యాటర్లు నిరాశపరిచారు. ఆఖరి ఓవర్లో అశుతోష్ శర్మ(13) సిక్స్, ఫోర్.. చివరి బంతికి హర్ష్ దూబే(3 నాటౌట్) మూడు సింగిల్స్ తీసి మ్యాచ్‌ను సూపర్ ఓవర్‌కు తీసుకెళ్లాడు. కానీ.. అందులోనూ బ్యాటర్లు నిరాశపరచగా టీమిండియాకు ఘోర పరాభవం ఎదురైంది.

ఆఖరి ఓవర్లో 16 పరుగులు అవసరం కాగా.. అశుతోష్ శర్మ(13) మూడో బంతిని సిక్సర్‌గా మలిచాడు. ఆ తర్వాత బంతికి మిడాఫ్‌లో ఫీల్డర్ క్యాచ్ వదిలేయగా బౌండరీ వచ్చింది. కానీ, ఐదో బంతికి పెద్ద షాట్ ఆడబోయిన అశుతోష్ క్లీన్ బౌల్డయ్యాడు. చివరి బంతికి హర్ష్ దూబే(3 నాటౌట్) మూడు రన్స్ తీయగా స్కోర్లు సమం అయ్యాయి.

### సూపర్ ఓవర్ సాగిందిలా..

సూపర్ ఓవర్ ఆడేందుకు జితేశ్ శర్మ(), రమన్‌దీప్ సింగ్ క్రీజులోకి వచ్చారు. రిప్పన్ మొండల్(2–0) వేసిన తొలి బంతికి స్కూప్ షాట్ ఆడబోయిన జితేశ్ బౌల్డయ్యాడు. ఆ తర్వాత బంతికే అశుతోష్ శర్మ(0) క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దాంతో.. బంగ్లా విజయానికి ఒక్క రన్ అవసరమైంది. అయితే. సుయాశ్ శర్మ వేసిన మొదటి బంతినే సిక్సర్‌కు యత్నించిన యాసిర్ బౌండరీ వద్ద రమన్‌దీప్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత బంతికి సుయాశ్ వైడ్ వేయడంతో గెలుపొందిన బంగ్లాదేశ్ తొలిసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది.

# ఫోకస్ సైన్స్



# పెరిగిన సిఎంఇలు

గత వారం చివరిలో పెరిగిన కరోనల్ మాస్ ఎజెక్షన్ (సిఎంఇ)ల కారణంగా ఆర్కిటిక్ ప్రాంతంలో కనువిందు చేసిన కాంతిపుంజాలు యావత్ ప్రపంచాన్ని ఆకట్టుకున్నాయి. అదే మయంలో సౌర చక్రం, సౌర జ్వాలలు, సిఎంఇ, సౌర తుఫానులు వంటి పదాలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. లోతుల్లోకి వెళ్లలేకపోయినా, కనీసం వాటి గురించి స్థూలంగానైనా తెలుసుకుంటే, ఖగోళ శాస్త్ర నూతన పరిశోధనలు, ఆవిష్కరణల గురించి అర్థం చేసుకోవచ్చు. వీటిలో సౌర చక్రం అనేది సూర్యుని అయస్కాంత క్షేత్రానికి సంబంధించిన సుమారు 11 సంవత్సరాల చక్రం. ఈ సమయంలో దాని అయస్కాంత కార్యకలాపాలు కొన్నిసార్లు పెరుగుతాయి. మరికొన్నిసార్లు తగ్గుతాయి. సూర్యుడు ప్రతి చక్రంలో పూర్తి అయస్కాంత ధ్రువణత భ్రమణం చెందుతాడు. దాని ఉత్తర, దక్షిణ ధ్రువాలు స్థానాలు మారుతాయి. ఈ చక్రం సౌర ఉపరితల కార్యకలాపాలను ప్రభావితం చేస్తుంది.

వీటిలో 'సూర్యరశ్మి'లు (సూర్యుని ఉపరితలంపై చిన్న, చీకటి, చల్లని ప్రాంతాలు), సౌర జ్వాలలు, సిఎంఇలు ఉంటాయి. సూర్యుని మచ్చలను లెక్కించడం ద్వారా ఈ చక్రాన్ని అంచనా వేస్తారు. కార్యాచరణ అత్యల్పంగా ఉన్నప్పుడు సౌర కనిష్టంతో ప్రారంభించి, కార్యకలాపాలు గరిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు సౌర గరిష్ట స్థాయికి చేరుకుంటాయి. కాగా, సూర్యుడిపై నిరంతరం ఎగసిపడే జ్వాలలను సౌర జ్వాలలుగా పేర్కొంటారు. వీటి చుట్టూ ఉన్న అయస్కాంత క్షేత్ర రేఖలు తరచుగా చిక్కుకుపోతాయి. సౌర జ్వాలలుగా పేర్కొనే అత్యంత శక్తివంతమైన శక్తి విస్ఫోటనాలను ప్రేరేపిస్తాయి. ఈ జ్వాలలు అంతరిక్షంలోకి తీవ్రమైన రేడియేషన్‌ను విడుదల చేస్తాయి. బలమైన జ్వాలలు భూమిపై రేడియో కమ్యూనికేషన్లకు అంతరాయం కలిగించడంతో పాటు ఉపగ్రహాలు, వ్యోమగాములకు ప్రమాదాలను కలిగిస్తాయి. సిఎంఇలు సూర్యుని బయటి పొర కరోనా నుండి ప్లాస్మా,అయస్కాంత క్షేత్ర భారీ బహిష్కరణలు. సూర్యుని అయస్కాంత క్షేత్ర రేఖలు వేగంగా పునర్వ్యవస్థీకరించబడినప్పుడు సిఎంఇలు అధిక వేగంతో అంతరిక్షంలోకి వెదజల్లబడతయి. చివరిగా సౌర తుఫానులు.. ఇవి తరచు సిఎంఇ, సౌర జ్వాలలతో కూడిన అతి పెద్ద అయస్కాంత విస్ఫోటనాలు. సూర్యుని వాతావరణంలోని చార్జ్ కణాలను అధిక వేగంతో కదిలించినప్పుడు సౌర తుఫానులు సంభవిస్తాయి. ఒక ఒక సిఎంఇ భూమిని చేరుకున్నప్పుడు, అది అయస్కాంత గోళంతో సంకర్షణ చెందుతుంది. దానిని కుదించి, కదిలిస్తుంది. శక్తివంతమైన సౌర పవన కణాలు ధ్రువాల దగ్గర వాతావరణంలోకి ప్రవేశించడానికి అనుమతిస్తుంది. ఈ పరిణామాల వల్ల భూమి నుంచి చూస్తే, ఆకాశంలో రంగురంగుల కాంతి పుంజాలు కనిపిస్తాయి. వీటిని అరోరాస్ అంటారు. ఇవి నీలం, ఎరుపు, పసుపు, ఆకుపచ్చ , నారింజ వంటి రంగులను సంతరించుకుంటూ ఉంటాయి. వీటిలో ఆకుపచ్చపసుపు అరోరాస్ అత్యంత సాధారణమైనవి. తక్కువ ఎత్తులో ఆక్సిజన్ అణువులతో అయాన్లు ఢీకొనడం వల్ల ఇవి సంభవిస్తాయి. అరోరాస్ సాధారణంగా ఆర్కిటిక్, అంటార్కిటిక్ వృత్తాల దగ్గర (సుమారు 66.5 డిగ్రీల ఉత్తరం , దక్షిణం) కనిపిస్తాయి. వీటిలో అరోరా బొరియాలిస్ అని పిలువబడే ఉత్తర దీపాలు ఉత్తర ధ్రువం దగ్గర సంభవిస్తాయి. నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, కెనడా, అలాస్కా ప్రాంతాల్లో వీటిని చూడవచ్చు. కాగా, అరోరా ఆస్ట్రాలిస్ అని పిలువబడే దక్షిణ దీపాలు దక్షిణ ధ్రువం దగ్గర సంభవిస్తాయి. అంటార్కిటికా, దక్షిణ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, చిలీ తదితర ప్రాంతాలలో ఇవి కనిపిస్తాయి.




## శూన్యంలో శక్తి!



గారడీ చేసేవాళ్లు గాల్లో నుంచి వస్తువులు సృష్టించినట్టు చూపిస్తారు. నిజానికి వారు సృష్టించకపోయినా, ఆ భ్రాంతిని కల్పిస్తారు. అలాంటి అద్భుతాలు శూన్యంలో జరుగుతాయా? అనే ప్రశ్నకు భౌతిక శాస్త్రంలో లేదనే సమాధానం వస్తుంది. కానీ, క్వాంటం ఫిజిక్స్‌లోకి వెళితే, ఇది సాధ్యమే. ఆశ్చర్యం కలిగించే ఈ పరిణామాన్ని క్వాంటం ఫ్లక్చువేషన్లు అంటారు. అయితే, ఇది పూర్తిస్థాయి శాస్త్ర ఉల్లంఘన కాదు. క్వాంటం లేదా అత్యంత సూక్ష్మ స్థాయిలో జరిగిన చిన్న, తాత్కాలిక మార్పులకు సంబంధించినది మాత్రమే. హైజెన్‌బర్గ్ అనిశ్చితి సూత్రం (హైజెన్‌బర్గ్ అన్‌సర్టైనిటీ ప్రిన్సిపుల్ ప్రకారం, సూక్ష్మాతిసూక్ష్మ సమయంలోనైనాసరే, ఒక వ్యవస్థలోశక్తి గురించి పూర్తి ఖచ్చితత్వాన్ని తెలుసుకోవడం అసాధ్యం. ఈ అనిశ్చితి వల్ల విశ్వంలో ఒక్కోసారి స్వల్ప కాలం పాటు శక్తి లేకపోయినా ఉన్నట్టు గోచరిస్తుంది. అంటే ఏమీ లేని శూన్యంలో ఒక శక్తి జీవం పోసుకుంటుంది. అంతేవేగంగా మాయమవుతాయి. అంటే, దీనిని శాశ్వత శక్తి సృష్టిగా భావించడానికి వీల్లేదు. ఈ తాత్కాలిక శక్తి వల్ల వర్చువల్ కణాలు కొన్ని క్షణాల పాటు కన్పించి మాయమవుతాయి. ఒక రకంగా చెప్పాలంటే, శక్తి నియమాన్ని క్వాండం స్థాయిలో ఉల్లంఘించడానికి విశ్వం అనుమతిస్తుంది. క్వాంటం ఫ్లక్చువేషన్‌ను ఉదాహరణ ఇవ్వాలంటే, విశ్వం మొత్తాన్ని ఒక అత్యంత సున్నితమైన నీటి ఉపరితలంలా ఊహించండి. నీరు ప్రశాంతంగా ఉన్నట్టే కనిపించినా, దగ్గరగా చూస్తే అత్యంత సూక్ష్మ మైన అలలు లేదా కదలికలు కనిపిస్తాయి. అంటే నీటి పొర మనం ఊహించినట్టు స్థిరంగా లేదు. ఒక్కోసారి స్వల్ప మార్పులు ఉంటాయి. అదే విధంగా శూన్యం కూడా పూర్తిగా ఖాళీగా ఉండదు. అక్కడ కూడా చిన్న చిన్న శక్తి అలలు ఏర్పడుతూ, మాయమవుతూ ఉంటాయి. ఈ చిన్న అలలనే క్వాంటం ఫ్లక్చువేషన్లు అంటారు.




# విద్యార్థుల పక్షాన ఉద్యమాలు
## ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** దేశంలో స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్‌ఎఫ్ అని, నేడు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని పేద మధ్యతరగతి వర్గాల విద్యార్థులు చదువుకోవడం భారంగా ఉందని పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని అడ్డగోలుగా పెంచిన ఆర్టీసి బస్ పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ పిలుపునిచ్చారు. హుజురాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు విద్యార్థులు ఏఐఎస్‌ఎఫ్‌లో చేరగా వారికి సభ్యత్వం ఇచ్చి ఏఐఎస్‌ఎఫ్ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, మండల కార్యదర్శి రాంపెల్లి రోహిత్, నాయకులు సంజీవ్, నిఖిల్, అజయ్, అరవింద్, అజయ్, మౌనిక, అనిల్, గణేష్, సాయి కృష్ణ, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డెన్లను సస్పెండ్ చేయాలి
## ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలోని విద్యార్థులకు అందుబాటులో లేని వార్డెన్స్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతి పత్రం అందజేశామని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఆయన మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లాలోని మండల పట్టణాలలోని షెడ్యూల్ కులాల,వెనుకబడిన తరగతుల వసతి గృహాలలోని వార్డెన్స్ విద్యార్థులకు అందుబాటులో లేకుండా వ్యక్తిగత పనులు చేసుకుంటూ, విధులకు గైర్హాజరవుతున్నారని, అధికారులకు మాత్రం హాజరవుతున్నట్లు చూపించుకుంటున్నారన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించకుండా విద్యార్థులను మాడుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మెనూ ప్రకారం, సరిపడు నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరామన్నారు. అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానని, విద్యార్థుల వసతి గృహాల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎఐఎస్‌ఎఫ్ నాయకులు మామిడిపల్లి హేమంత్, గొడిసెల ప్రణీత్, కట్ల అభినయ్,తదితరులు పాల్గొన్నారు.

# భారతకమ్యూనిస్టు పార్టీది నూరేళ్ల చరిత్ర
## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (నేరేడుచర్ల) :** భారత గడ్డపై సిపిఐకి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే చారిత్రక బహిరంగ సభకు లక్షలాదిగా తరలిరావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, బిసి హక్కుల సాధన సమితి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం నేరేడుచర్లలో వివిధ మండలాల సిపిఐ కార్యదర్శులు, జిల్లా స్థాయి ప్రజాసంఘాల బాధ్యులతో కలిసి వారు మాట్లాడుతూ ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి సిపిఐ వెళ్ళి ఆ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు కలబడి, నిలబడి పోరాటం చేస్తుందన్నారు. ఆ పోరాట చరిత్ర పునాదిగానే గత వందేళ్లుగా అధికారం రాకపోయినా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఏకైక వామపక్ష పార్టీ సిపిఐ అని తెలిపారు. కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, రైతు, మహిళ ప్రజాసంఘాలను నిర్మించి వారి హక్కులకై నినదించి రాజీలేని పోరాటాలు కొనసాగించిందన్నారు. ఈ శతాబ్ధంలో ఎన్నో పోరాటాలు, ఎన్నెన్నో త్యాగాలు, ఎంతో మంది అమరవీరుల రక్తతర్పణంతో ఎన్నో విజయాలు సాధించి భారతదేశ రాజకీయ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నది సిపిఐ అన్నారు. 40 దేశాల్లోని ప్రతినిధులు హాజరవుతున్నారని, లక్షలాది మంది కార్యకర్తలు ఈ బహిరంగ సభకు తరలివస్తున్నారని తెలిపారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా నుం చి ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని, ఇంటికో మనిషి, వీధికో బండి బయటకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు. నేరేడుచర్ల మండలకార్యదర్శికత్తి శ్రీనివాసరెడ్డి, పాలకవీడు కార్యదర్శి ముళ్ళ జానయ్య, మఠంపల్లి కార్యదర్శి అమరారపు పున్నయ్య,ఏఐవైఎఫ్‌జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ లక్ష్మి , బిసి హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమరాజు వెంకట్, బెల్లంకొండ గోవిందు గౌడ్, తిప్పన రాంరెడ్డి, కొండ అంజయ్య, ఎస్‌కె మధార్, బొల్లం అశోక్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 'మధ్యాహ్న భోజన' మెనూ చార్జీలు పెంచరా?
## 'మిడ్ డే మీల్స్' ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్





**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మధ్యహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మిడ్ డే మీల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. అనంతరం మధ్యహ్న భోజన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐజిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జి గుంటి వేణు మాట్లాడుతూ గత 24 సంవత్సరాల నుండి ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల జీతాలు,విద్యార్థుల మెనూ చార్జీలు పెంచకుండా శ్రమ దోపిడి చేస్తున్నారన్నారు. నిత్యవసర సరుకులు, కోడిగుడ్లు, గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే పంపిణీ చేయాలని, విద్యార్థులకు మెనూ చార్జీలు 30 రూపాయలు పెంచాలని, యూనిఫామ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మిడ్ డే మీల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గత ప్రభుత్వాల విధానాలనే ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని, టిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మొదలు పెట్టిన అల్పాహారం బిల్లులు ఇప్పటి వరకు రాలేదని, నాణ్యమైన ఆహారం అందించాలంటే మెను చార్జీలు పెంచాలని కోరారు. అలాగే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నిత్యవసర వస్తువుల ధరలు రోజు రోజుకి పెరుగుతున్నాయని, ఒక విద్యార్థికి ఆరు రూపాయలు చెల్లించి, రెండు రకాల కూరలు ఎలా అందించాలో ఉపాధ్యాయులు ఆలోచించాలని అన్నారు. కార్మికుల పై అధికారుల ఒత్తిడి ఆపాలని, మెనూ చార్జీలు పెంచాలని, 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు 5000 రుపాయల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, అలాగే జీతాలు పెంచాలని, లేనియెడల వచ్చే నెల పదో తేది నుండి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. మిడ్ డే మీల్స్ కార్మికులు లక్ష్మి , రజిత, లచ్చవ్వ, మల్లేశ్వరి, జ్యోతి, వెంకటలక్ష్మి , నరసవ్వ, కొమరవ్వ, హసీనా బేగం, రజిత, పద్మ, బీరప్ప, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

# 'నేడు' గీతపనివారల రాష్ట్ర సదస్సు
## రంగారెడ్డి జిల్లా గీత పనివారల సంఘం కార్యదర్శి శ్రీశైలంగౌడ్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైద్రాబాద్ వద్ద ఈ నెల 22న గీత పనివారుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా గీతపనివారుల సంఘం కార్యదర్శి కనకమామిడి శ్రీశైలంగౌడ్ పిలుపునిచ్చారు. లక్షలాది మంది గౌడ కులాల ప్రజలు కల్లుగీత వృత్తిలో కొనసాగుతూ మృత్యువాత పడ్డవారికి ఎక్స్‌గ్రేషియా అందించాలని, వృద్యాప్య పెన్షన్ ఇవ్వాలని, వృత్తి అధునీకరణ, పరిశ్రమగా రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు. ప్రకృతి పానీయం కల్లు, నీరా లను ప్రభుత్వం ప్రోత్సహించాల్సింది పోయి మద్యం, బెల్టు దుకాణాలు రాజ్యమేలేల పహయ,సహకారాలు అందిస్తూ గౌడ కులస్థులకుఅన్యాయంచేస్తున్నారనిఆగ్రహం వ్యక్తం చేశారు. గౌడ కులస్థులకు న్యాయం చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. శనివారం జరిగే గీత పనివారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని శేరిలింగంపల్లి గీత పనివారుల సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కనకమామిడి శ్రీశైలంగౌడ్ పిలుపునిచ్చారు. అన్ని వసతులు కల్పించామన్నారు. హఫిజ్‌పేట్ గీతపనివారుల సంఘం అధ్యక్షులు ఆనంద్,సభ్యులు వెంకటేష్ గౌడ్, నరేందర్ గౌడ్, బాబు గౌడ్, రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



## ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బాల్‌నగర్ సామాజిక ఆరోగ్య కేంద్ర పడకల తగ్గింపు నిర్ణయం ఉపసంహరించుకోవాలని, కాలం చెల్లిన పాత టెండర్లను రద్దు చేసి, పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు 26 వేల రూపాయలు వేతనం అందే విధంగాకొత్త టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎఐటియుసి డిమాండు చేసింది. అంతేగాక శుక్రవారం హైదరాబాదు కోఠిలోని తెలంగాణవైద్యవిధానకమిషనర్‌డాక్టర్‌అజయ్ కుమార్ కి ఎఐటియుసి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్,తెలంగాణమెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడారు.ప్రభుత్వ ఆసుపత్రులలో ఆక్యుపెన్సి తగ్గిందని కుంటి సాకుతో వైద్య విధాన పరిషత్ ఉన్నత అధికారులు ఆసుపత్రుల పడకల సామర్థ్యం తగ్గించడం చాలా బాధాకరమైన ఆవేదన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులను అర్థాంతరంగా తొలగింపులకు గురవుతున్నారని లేకపోతే వచ్చిన బడ్జెట్లోనే తలా కొంత పంచుకునే దుస్థితి నెలకొన్నదని అన్నారు. అలాగే ఇంటి గ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్) ద్వారా పారిశుద్ధ్యం, భద్రత, రోగి సంరక్షణ నిర్వహణ కోసం మూడు సంవత్సరాల కాల వ్యవధితో ఏజెన్సీలను ఎంపిక చేసే విధానం కొనసాగుతుందని, ప్రస్తుతం కొనసాగుతున్న ఏజెన్సీలు 2022లో ఎంపిక చేశారని, కాల పరిమితి ముగిసినా కొత్త టెండర్ల ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. కనీస వేతనం రూ.26000 అందే విధంగా, పండగ, జాతీయ, ఆర్థిక సెలవులు పొందుపరుస్తూ న్యూ టెండర్ పాలసీని విడుదల చేయాలని డిమాండు చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నేతలు పి.సురేష్, సుధాకర్, ఓమయ్య, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఆర్థికసాయం అందజేత



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని పోతేపల్లి గ్రామానికి చెందిన మంగళపల్లి రాములమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వెల్దండ యువజన బిఆర్ఎస్ మండల నాయకుడు తగుళ్లకొండల్‌యాదవ్ మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తానేష్‌యాదవ్, వెంకటయ్య, శ్రీనివాసులు, సాయియాదవ్, మహేష్‌యాదవ్, శేఖర్, అర్జున్, శివ పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ ఎస్‌పిగా పాటిల్‌సంగ్రామ్‌సింగ్ గణపత్‌రావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రభుత్వం భారీగా ఐపిఎస్ అధికారులను బదిలీ చేసింది. బదిలీలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌పిగా పాటిల్ సంగ్రామ్ సింగ్ గణపత్‌రావు నియమించింది. జిల్లా ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఎస్‌పిగా బదిలీ చేశారు. జిల్లాకు నూతన ఎస్‌పిగా నియమించబడిన పాటిల్‌సంగ్రామ్‌సింగ్ గణపత్‌రావు త్వరలోనే ఎస్‌పిగా బాధ్యతలు తీసుకుంటారని జిల్లా పోలీసుశాఖ అధికారులు తెలిపారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/జడ్చర్ల:** రాజాపూర్ మండలంలో మల్లేపల్లి గ్రామానికి చెందిన చాకలి ఏలమ్మ (72) అనారోగ్యంతో మరణించారు. మృతికి సంతాపం తెలిపిన యువనేత అభిమాన్యురెడ్డి. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.5000 ఆర్థిక సహాయాన్ని యువసేన సభ్యుల ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ నారాయణరెడ్డి, అల్వాల శ్రీశైలం, దండు రంగయ్య, పోలేమోని శ్రీను, వడ్డె సైదులు, చాకలి శ్రీను, వార్డు సభ్యులు, మల్లేపల్లి పార్టీ నాయకులు, గ్రామస్తులు, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయానికి హద్దులు గుర్తించాలి



**ప్రజాపక్షం/ఉట్కూర్ :** ఉట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలో బీసీ కాలనీలో వెలిసిన గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవత ఆలయానికి సరిహద్దులు గుర్తించాలని గౌడ కులస్తులు, గ్రామస్తులు శుక్రవారం ఉట్కూరు మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆలయానికి కేటాయించిన దేవాలయ భూమి అన్యాక్రాంతమవుతుందని తక్షణమే ఆలయానికి సంబంధించినటువంటి భూమిని గుర్తించి సరిహద్దులు వేసి ఆలయాన్ని పరిరక్షించాలని వారు కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పూజారి ఆంజనేయులు గౌడ్, పూజారి నాగేష్ గౌడ్, పి.నారాయణ గౌడ్, పి.నాగేష్ గౌడ్, బాలకిషన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, దోరోళ్ళ కృష్ణయ్య, పోలీస్ హన్మిరెడ్డి పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందించిన మంత్రి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పరేవుల గ్రామవాసి సుమిత్ర భర్త బాలస్వామి అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్సకు వైద్య సహాయం కోసం యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని సంప్రదించడం వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.5 లక్షలను ప్రపోజల్ ఎల్ఓసిని మంజూరు చేశారు. సంబంధిత ప్రపోజల్ ఎల్ఓసిని ఆదివారం మంత్రి అధికారిక నివాసంలో వారికి అందజేశారు. మంచి వైద్యం అంది, బాధితుడు త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. మీకు, మీ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూర్చినందుకు సంతోషిస్తున్నానని, రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకి ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. మీ కుటుంబ సభ్యులు ఆయురారోధ్యాలతో ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాను అని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

## పేదల సొంతింటి కల సాకారం



### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పోతన్‌పల్లి, కోటకదిరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పోతన్‌పల్లి, కోటకదిర గ్రామాలలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులతో కలిసి ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల కోసం నిజమైన సంక్షేమాన్ని అమలు చేస్తోందని, స్వంత ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి పక్కా గూడు కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ఆయన చెప్పారు. పోతన్‌పల్లిని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి మొత్తం 118 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 78 ఇండ్లు నిర్మాణం పూర్తికి కావస్తున్నాయని తెలిపారు. అంతకుముందు పోతన్‌పల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంద్ర, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, నాయకులు మాధవరెడ్డి, సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, ఖాజా, శేఖర్ రెడ్డి, మైబు, శ్రీనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, స్థానిక అధికారులు, లబ్ధిదారులు, పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కమ్యూనికేషన్ రిపీటర్ భవన నిర్మాణానికి శ్రీకారం

### వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్‌ల శంకుస్థాపన

**ప్రజాపక్షం/వనపర్తి :** పోలింగ్‌ను సాంకేతికంగా మరింత మెరుగుపరచడానికి వనపర్తి జిల్లాలో మరో ముఖ్యమైన అడుగు పడింది. తెలంగాణ పోలీస్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ నిధులతో రూ.72 లక్షల వ్యయంతో నిర్మించనున్న పోలీస్ కమ్యూనికేషన్ రిపీటర్ నూతన భవనం శంకుస్థాపన చేశారు. శుక్రవారం ఉదయం పీర్లగుట్టలో జిల్లా పోలీసుశాఖ నిర్వహించిన కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పోలీస్ కమ్యూనికేషన్ అనేది శాంతి భద్రతల పరిరక్షణలో అత్యంత కీలకమైన విభాగమని అధికారులు వివరించారు. జిల్లాలోని పలు దూరప్రాంతాలు, అటవీ ప్రాంతాలలో సిగ్నల్ సమస్యలను అధిగమించడానికి, అత్యవసర పరిస్థితుల్లో కమ్యూనికేషన్ స్పష్టతను పెంచడానికి ఈ రిపీటర్ భవనం అత్యంత మద్దతునిస్తుందని ఎస్పీ తెలిపారు. తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతికతతో రూపొందిస్తున్న ఈ భవనం పూర్తి స్థాయి రేడియో కమ్యూనికేషన్ కవరేజ్ మెరుగుపరచి, పోలీసులు స్పందించే వేగాన్ని గణనీయంగా పెంచుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో ప్రజలకు మరింత భద్రతను అందించడానికి పోలీస్ విభాగంలో ఆధునిక సదుపాయాలు అవసరం రూ.72 లక్షల వ్యయంతో కమ్యూనికేషన్ రిపీటర్ భవనం నిర్మాణం ప్రారంభమవడం వనపర్తికి ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పోలింగ్‌లో కమ్యూనికేషన్ వ్యవస్థ బలంగా ఉండటం అత్యంత అవసరం తెలంగాణ పోలీసు హౌసింగ్ బోర్డు వల్ల దీనికి మరింత బలం లభిస్తోంది. ఈ కార్యక్రమంలో వనపర్తి ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్, శ్రావ్య, మార్కెట్ కమిటీ చైర్మన్, శ్రీనివాస్ గౌడ్, వనపర్తి సిఐ కృష్ణయ్య, కొత్తకోట సిఐ రాంబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, వనపర్తి ఎమ్మార్వో, రమేష్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ ఎఈ అనిల్ శాస్త్రి, పోలీసు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చిత్తడి నేలల జాబితా సిద్ధం చేయాలి



కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లాలో చిత్తడి నేలల (వెట్ ల్యాండ్స్) జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో చిత్తడి నేలల (సంరక్షణ, నిర్వహణ)నియమాలు, 2017 ప్రకారం తడి భూముల నోటిఫికేషన్ రాష్ట్ర ఉత్తర్వులలో చిత్తడి నేలల సర్వే, సరిహద్దులు, నోటిఫికేషన్ కోసం జిల్లా తడి భూముల కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీకి చైర్మన్‌గా అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి 3 నెలల్లోపు జిల్లాలోని అన్ని చిత్తడి నేలల జాబితాను సిద్ధం చేయాలని, 6 నెలల్లోపు తెలియజేయవలసిన చిత్తడి నేలల జాబితాను సిద్ధం చేయాలని ఆమె తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం నియంత్రణ కోసం, వాటి సంక్షిప్త పత్రాల ఆధారంగా గుర్తించబడిన చిత్తడి నేలలను సిఫార్సు చేయాలన్నారు. ఒక సంవత్సరంలోపు అన్ని చిత్తడి నేలల సమగ్ర డిజిటల్ జాబితాను సిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే నోటిఫైడ్ చిత్తడి నేలలు వాటి ప్రభావ జోన్లలో నియంత్రించాల్సిన, అనుమతించాల్సిన కార్యకలాపాల సమగ్ర జాబితాను అభివృద్ధి చేయాలని చెప్పారు. నోటిఫై చేయబడిన ప్రతి తడి భూములకు సమగ్ర నిర్వహణ ప్రనాళికను సమీక్షించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. చిత్తడి నేలలు (సంరక్షణ, నిర్వహణ) నియమాల, 2017 ప్రకారం నిర్దేశించిన విధంగా తడి భూముల నోటిఫికేషన్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి జిల్లాలో ఒక జిల్లా తడి భూముల కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ హైదరాబాద్ ప్రధాన అటవీ సంరక్షణాధికారి అభ్యర్థన మేరకు నారాయణపేట జిల్లా చిత్తడి నేలల కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. కాగా ఈ కమిటీకి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కన్వీనర్ మెంబర్‌గా జిల్లా అటవీ శాఖ అధికారితో పాటు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్లతో కూడిన 7 మంది సంబంధిత శాఖల అధికారుల బృందం కమిటీ ఉండనుంది. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, జిల్లా మత్స్య శాఖ అధికారి రహమాన్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, నీటి పారుదల శాఖ అధికారి బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** హన్వాడ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా తెలుసుకున్నారు. ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించారు. నిర్ణీత తేమ, తాలు, మట్టి లేకుండా నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం వివరాలు. ట్యాబ్ ఎంట్రీ గురించి కలెక్టర్ అడిగారు. ఇప్పుడు 2514 బస్తాల ధాన్యం ఉంది. ట్యాబ్ ఎంట్రీ 1566 బస్తాలకు పూర్తి అయిందని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. రవాణా పరంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని కొనుగోలు తర్వాత కేంద్రం నిర్వాహకులదే బాధ్యత అని రైతులు మిల్లుకు వెళ్లే అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్‌లను వినియోగించుకుంటున్నారా? కలెక్టర్ అడిగారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్‌లకు కొద్దిగా రిపేరింగ్ చేయాల్సి ఉందని కేంద్రం ఇంచార్జి తెలపగా ఆటోమేటిక్ ప్యాడి క్లీనింగ్ పరిశీలించి వెంటనే రిపేరింగ్ చేయించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్‌డిఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# ముంపు బాధితులకు ప్రభుత్వం అండ



కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ముంపు బాధితులకు ప్రభుత్వం అండగా ఉండటంతోపాటు రైతుల పంటనష్టంపై వెంటనే చర్యలు తీసుకొని ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం అచ్చంపేట మండలపరిధిలోని మర్లపాడుతండా గ్రామాన్ని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ పి.అమరేందర్ అధికారులతో కలిసి సందర్శించి గ్రామప్రజలతో సమావేశమయ్యారు. నక్కలగండి ప్రాజెక్టు ముంపు ప్రభావానికి గురయ్యే నక్కలగండి తండా, మర్లపాడుతండా, కేశ్యతండా, మన్నెవారిపల్లి గ్రామాల ప్రజలకు పునరావాసం, పునర్‌నిర్మాణం ప్రక్రియను వేగవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం అన్నివిధాలుగా సిద్ధంగా ఉందన్నారు. ముంపు ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్ అక్కడి ప్రజలతో సమావేశమై వారి అవసరాలు, అభిప్రాయాలు, పునరావాసంపై ఉన్న సందేహాలను వివరంగా తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రత్యక్ష ఆదేశాల మేరకు తాము ఈప్రాంతానికి వచ్చి ముంపు ప్రభావం, పునరావాస పనులు, పంటనష్టాలను పరిశీలిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తండాల్లో నివసిస్తున్న ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరిపి తమ పరిధిలో చేయాల్సిన పనులను ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పూర్తిగా అమలుచేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత ప్రాంతంలో సరిపడా ప్రభుత్వభూమి అందుబాటులో లేకుంటే, అచ్చంపేట సమీపంలోని హాజిపూర్‌వద్ద ఇప్పటికే గుర్తించిన ప్రత్యామ్నాయ భూమిలో పూర్తిస్థాయి పునరావాసకాలనీలను నిర్మించడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. నష్టపోయిన పంటలకు పంటనష్టపరిహారం అందేలా ప్రత్యేక నివేదికలు పంపించామని, రైతులకు తక్షణ ఉపశమనం కలిగించే చర్యలు ప్రభుత్వం త్వరగా అమలుచేస్తుందని, వర్షాలు, వరదలతో ప్రభావితమైన ప్రతిరైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వ్యక్తిగత వ్యాపారాలు, చిన్నవ్యాపారాలవల్ల నష్టపోయినవారు కూడా స్వయంగా వచ్చి తమ సమస్యలను వివరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాకలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్‌డిఓ మాధవి, అచ్చంపేట తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ఆయాముంపు గ్రామాల ప్రజలు ఉన్నారు.

# అగ్రశ్రేణి సినీ స్టూడియోలకు బల్దియా షాక్

### ట్రేడ్ లైసెన్స్ ఫీజులలో భారీ వ్యత్యాసం
### వాస్తవ పరిస్థితికి తక్కువ మొత్తంలో చెల్లింపులు
### అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలకు నోటీసులు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని రెండు ప్రముఖ సినీ నిర్మాణ సంస్థలైన అన్నపూర్ణ స్టూడియోస్ (బంజారాహిల్స్), రామానాయుడు స్టూడియోస్ (ఫిల్మ్ నగర్)లకు మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) అధికారులు షాకిచ్చారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు పూర్తి స్థాయిలో చెల్లించాలంటూ నోటీసులు జారీ చేశారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు తక్కువ చెల్లిస్తున్నట్లు జిహెచ్ఎంసి సర్కిల్ 18 అధికారులు గుర్తించారు. వ్యాపార విస్తీర్ణం తక్కువ చూపిస్తూ భారీగా పన్నులు ఎగవేసినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలో అధికారులు నోటీసులు జారీచేశారు. ఈ పెంచిన ఫీజు మొత్తం లక్షల రూపాయల్లో ఉంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ రెండు సంస్థలు చాలా సంవత్సరాలుగా ట్రేడ్ లైసెన్స్ ఫీజును చెల్లిస్తున్నప్పటికీ, రికార్డుల్లో చూపిన విస్తీర్ణం కంటే వాస్తవ విస్తీర్ణం (ప్లింత్ ఏరియా) చాలా ఎక్కువగా ఉన్నట్లు జిహెచ్ఎంసి అధికారులు గుర్తించారు. ఈ రెండు సినీ స్టూడియోల్లో జరిగే సినిమా షూటింగ్‌లకు భారీ మొత్తంలో యాజమాన్యాలకు అద్దెల రూపంలో భారీగానే ఆదాయం వస్తుంది. కోట్లాది రూపాయాల వ్యయంతో నిర్మించే సినీమాలకు అదే స్థాయిలో ఆదాయం కూడా వస్తుంది. అయితే అంత మొత్తంలో ఆదాయం వచ్చిన తక్కువ మొత్తంలో ట్రేడ్‌లైసెన్స్ ఫీజు చెల్లించడం గమనర్హం. అయితే ఈ వ్యవహారం నగరంలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

**అన్నపూర్ణ స్టూడియోస్‌కు భారీగా పెరిగిన ఫీజు..**

అన్నపూర్ణ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ గతంలో 8,172 చదరపు అడుగులు ప్లింత్ ఏరియా ఆధారంగా యాజమాన్యం రూ.49,032 ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లిస్తువస్తున్నారు. అయితే జిహెచ్ఎంసి రెవెన్యూ శాఖ నిర్వహించిన పరిశీలనలో వాస్తవ ప్లింత్ ఏరియా 1,92,066 చదరపు అడుగులుగా ఉన్నట్లు తేలింది. దీని ఆధారంగా స్టూడియో చెల్లించాల్సిన కొత్త ఫీజు సంవత్సరానికి రూ.11,52,396గా నిర్ణయించి నోటీసులు జారీ చేశారు.

**రామానాయుడు స్టూడియోకు పెరిగిన ఫీజు..**

సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నడుస్తున్న రామానాయుడు స్టూడియోస్ ఇప్పటి వరకు 1,903 చదరపు అడుగుల ఆధారంగా కేవలం రూ.7,614 మాత్రమే యాజమాన్యం చెల్లిస్తు వస్తున్నారు. కానీ పరిశీలనలో అసలు ప్లింత్ ఏరియా 68,276 చదరపు అడుగులుగా బయటపడింది. దీని ప్రకారం స్టూడియో చెల్లించాల్సిన కొత్త ఫీజు రూ.2,73,104గా జిహెచ్ఎంసి అధికారులు నోటీసులలో స్పష్టం చేశారు.

**ఆస్తిపన్నుకు ట్రేడ్ లైసెన్స్‌లలో భారీ వ్యత్యాసం :అనురాగ్ జయంతి**

జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ (ఐటీ, రెవెన్యూ) అనురాగ్ జయంతి, ఈ విషయంపై స్పందించారు. 'ట్రేడ్ లైసెన్స్ రికార్డులు, ఆస్తి పన్ను రికార్డుల్లో ఈ రెండు సంస్థల ప్లింత్ ఏరియాలో భారీ వ్యత్యాసం ఉందని ధృవీకరించారు. ఆస్తి పన్ను రికార్డుల ఆధారంగానే పెంచిన ఫీజుతో సహా సవరణ కోసం నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వారు ఈ నోటీసుపై స్పందించడానికి అవకాశం ఉంటుంది. ఎందుకు అధిక ఫీజు విధించకూడదో వారు వివరించవచ్చు. ఆ తర్వాతే సవరణపై తుది నిర్ణయం తీసుకుంటాం' అని అనురాగ్ జయంతి స్పష్టం చేశారు. ఈ సంస్థలు దశాబ్దాలుగా తక్కువ మొత్తంలో ఫీజు చెల్లిస్తున్నప్పటికీ, పెంచిన ఫీజును గత కాలం నుండి వసూలు చేయాలా? లేక ముందు కాలం నుండి వసూలు చేయాలా? అనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ నోటీసులపై స్టూడియోల యాజమాన్యాల నుంచి స్పందన రావాల్సి ఉందన్నారు.

## భర్త మృతిని తట్టుకోలేక 15 రోజుల్లోనే భార్య మృతి



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల కేంద్రం వీపనగండ్లలో ఒక దుర్ఘటన క్రమంగా రెండు ప్రాణాలను బలి తీసుకుంది. కూలీ పనులు చేసుకుంటూ, మత్స్యకార వృత్తిలో జీవనాధారాన్ని పొందుతున్న సాధారణ కుటుంబం మీద వరుసగా జరిగిన విషాదాలు గ్రామంలో దిగ్భ్రాంతికి గురి చేశాయి. స్థానికంగా నివసిస్తున్న కొట్టం అలివేల (50) గురువారం ఉదయం విషాదకరంగా కన్నుమూశారు. కేవలం పదిహేను రోజుల క్రితమే ఆమె భర్త కొట్టం మౌలాలి చాపల వేటకు వెళ్లిన సందర్భంగా అప్రమత్తంలో కోల్పోయి కాలువలో మునిగిపోవడంతో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. భర్త మరణాన్ని తట్టుకోలేక అలివేల తీవ్ర మనోవేదనకు గురై, ఆవేదనతో నిండిన పరిస్థితుల్లో ఆమె ఆరోగ్యం క్షీణించడం మొదలైంది. కుటుంబ సభ్యుల సమాచారంతో తెలుసుకున్న వివరాల ప్రకారం భర్త అకాల మరణం తర్వాత అలివేల తీవ్ర నిరుత్సాహం, మానసిక ఆవేదనలో కూరుకుపోయారు. రోజురోజుకూ ఆరోగ్యం మరింతగా పడిపోవడంతో కుటుంబీకులు ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికి, సరైన చికిత్సకు అవసరమైన వనరులు లేని కారణంగా పరిస్థితి విషమించింది. శుక్రవారం ఉదయం ఆమె ప్రాణాలు విడిచారు.

**మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం**

భర్త మృతుని తట్టుకోలేక 15 రోజులకు మృతి చెందిన కోట్టం అలివేల మృతదేహానికి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముంత మల్లయ్య యాదవ్ పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, జోల్లు నారాయణ ఉన్నారు.

## ఉపాధ్యాయులది కీలకపాత్ర



### ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పి.లక్ష్మణ్


**ప్రజాపక్షం/ ధన్వాడ :** ఆకారము లేని శిల రూపం శిల్పంగా మారడానికి శిల్పి నైపుణ్యం మీద ఆధారపడినట్లు, విద్యార్థి జీవితం నిపుణత కలిగిన అధ్యాపకుని చేతిలోనే ఉంది. అందుకే విద్యార్థుల తలరాతలను వ్రాసేది అధ్యాపకులేనని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పి.లక్ష్మణ్ అన్నారు. ధన్వాడ మండలంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలోని జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో అధ్యాపకులను ఉద్దేశించి లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశభక్తి, దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మించబడుతుందని అబ్దుల్ కలాం అన్న విషయాన్ని గుర్తు చేస్తూ నేటి విద్యార్థుల యొక్క భవిత అధ్యాపకుల చేతిలోనే ఉందని డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ధన్వాడ మండలం కాంప్లెక్స్ మీటింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులకు వ్యక్తిగత, కుటుంబ, వృత్తి, ఆర్థిక, సామాజిక ఆధ్యాత్మిక ఈ ఆరు రంగాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయవలసిన పనులు బోధించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారిని గాయత్రి, కొండాపూర్ జడ్పీహెచ్ఎస్ జిహెచ్ఎం శంకరయ్య, జడ్.పి.హెచ్. ఎస్ ధన్వాడ బాయ్స్, కాంప్లెక్స్ జిహెచ్ఎం ప్రదీప్ కుమార్, టిపియూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ అనుపటి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల విజయం

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల స్థాయి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో వీపనగండ్ల మండలి విద్యార్థులు ప్రతిభా ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి విజయాలకు నాంది పలికారు. వీపనగండ్ల జడ్పీ హెచ్ఎస్ (బాయ్స్) విద్యాసంస్థ నుంచి ఇంగ్లీష్ మీడియంలో పి.గౌతమ్, చక్రి, వై.చందు, భవాని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అదే తరహాలో ద్వితీయ స్థానం జడ్పీహెచ్ఎస్ బొల్లారం విద్యార్థులు అంకిత, నక్షత్ర, ఇందు ఖాతాలో చేరింది. తెలుగు మీడియం విభాగంలో ప్రథమ స్థానాన్ని జడ్పీహెచ్ఎస్ సంగినేనిపల్లి విద్యార్థులు గోపాలకృష్ణ, వంశీ, కార్తీక్ కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానంలో జడ్పీహెచ్ఎస్ గోవర్ధనగిరి విద్యార్థులు నిలిచారు. ఈ వివరాలను జన్ విజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా జితేందర్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ వైఖరి పెంపొందించుకోవాలి. మూఢనమ్మాకాల నుండి దూరంగా ఉండటం అత్యావశ్యకం అని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నరసింహచారి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## బాక్సర్ నిఖత్ జరీన్‌కు గోల్డ్‌మెడల్

### మంత్రి, డిజిపి అభినందనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ నోయిడాలో జరిగిన వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ కప్ 2025లో గోల్డ్ మెడల్ సాధించిన తెలంగాణ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, డిజిపి బి.శివధర్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని వివిధ స్థాయిలో మెడల్స్ సాధించి దేశ,రాష్ట్ర ప్రతిష్టతను మరింత పెంచాలని, క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా భరోసానిస్తుందని వాకిటి శ్రీహరి తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడా శాఖ మంత్రిగా క్రీడా ప్రోత్సాహక, విధానాలతో తెలంగాణ క్రీడాకారులు ప్రపంచ వేదికలపై అద్భుత ప్రదర్శన కొనసాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నిఖత్ జరీన్ విజయం పట్ల డిజిపి శివధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మహిళల 51 కెజిల ఫైనల్ పోటీలో ఆమె తన ప్రత్యర్థిపై 50 తేడాతో ఘన విజయం సాధించడం ఆమె సామర్థ్యానికి, అంకితభావానికి నిదర్శనమని డిజిపి కొనియాడారు. 'గోల్డ్ మెడల్ సాధించి, తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిన నిఖత్ జరీన్‌ను అభినందిస్తున్నాను. క్రీడల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన నిఖత్ విజయం ఇతర క్రీడాకారులకు ఆదర్శం' అని డిజిపి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# స్థానికం REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. శుక్రవారం ఆయన మిర్యాలగూడ మీదుగా వెళ్తుండగా నార్కట్‌పల్లి అద్దంకి రహదారిపై బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామన్నారు. రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ, రవాణాశాఖ అధికారులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. బ్లాక్ స్పాట్స్‌ను తగ్గించి రోడ్డు ప్రమాదాలను నివారిస్తామన్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని నివారించడానికి అంతర్గత చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 50 వాహనాల్లో వచ్చిన ధాన్యాన్ని వెనక్కి పంపించామన్నారు. వాడపల్లి, సాగర్ వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించి తనిఖీలు చేస్తున్నామన్నారు. చాలా చోట్ల హైస్పీడ్, రాంగ్ రూట్, లైటింగ్ సమస్యలతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.





## మత్స్యకారుల అభివృద్ధికి కృషి

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** మత్స్య కారుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం ఎంఎల్ఏ విద్యుత్ శాఖ, మత్స్యశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి మండల పరిధిలోని గాజీనగర్‌లో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన, పెండ్లిపాకులలో 9లక్షల చేప పిల్లలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రభుత్వం 2027లోపు నక్కలగండి, ఎస్ఎల్‌బిసిలను పూర్తి చేయడంతో పాటు పెండ్లిపాకుల ప్రాజెక్టు సామర్థ్యాన్ని రెండు టీఎంసిలకు పెంచనుందని పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా 241 చెరువులలో రూ. కోటిన్నర వ్యయంతో చేపపిల్లలను వదులుతున్నామని అన్నారు. పెండ్లిపాకుల ప్రాజెక్టు ద్వారా ముంపునకు గురయ్యే గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ఇండ్ల స్థలాలను ఇవ్వడంతో పాటు అక్కడ ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించనున్నట్లు తండా వాసులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో విద్యుత్ డిఈ విద్యాసాగర్, ఏడిఈ సైదులు, మత్స్యశాఖ ఏడి రాజారాం, ప్లానిమెంట్ కో ఆర్డినేటర్ నిరాఖ్లాన్, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, మేకల శ్రీనివాస్‌యాదవ్, నాయిని మాధవరెడ్డి, లక్ష్మీనారాయణ, వేమన్‌రెడ్డి, అబ్బనబోయిన శ్రీనివాస్‌యాదవ్, గంధం సురేష్, శంకర్ నాయక్, శక్రునాయక్, మాద్దుల యాదగిరి, మధునాయక్, బాలునాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయం చేకూర్చేలా ప్రణాళికలు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** వ్యర్థాల ద్వారా ఆదాయం చేకూర్చేలా మున్సిపల్ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు, శానటరీ ఇన్స్పెక్టర్లతో వ్యర్థాల నిర్వహణపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలలో సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌లలో గాని, వ్యర్థాలను వేరు చేసే కేంద్రాలలో గాని ఘన వ్యర్థ పదార్థాలలోని తడి, పొడి, ప్లాస్టిక్, రీసైక్లింగ్ చేసే వాటిని వేరు చేసి మట్టిలో సహజంగా విచ్ఛిన్నమయ్యే పదార్థాల ద్వారా ఎరువులు తయారు చేసి ఆదాయం చేకూర్చుకోవాలని తెలిపారు. అలాగే అన్ని మున్సిపాలిటీలలో వ్యర్థాలను వేరు చేసే కేంద్రాలు కార్యకలాపాలు నిర్వహించేలా చూడాలని సూచించారు. పర్యావరణానికి హాని కల్గించే విషపదార్థాలు, పారిశ్రామిక వ్యర్థాలు లాంటి కాలుష్య నీరు చెరువులలో, కాలువలలో కలవకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, మున్సిపల్ కమీషనర్లు హన్మంతరెడ్డి, రమాదేవి, శ్రీనివాస రెడ్డి, ముస్తఫా అలీ, ఇంజనీరింగ్ అధికారులు, శానటరీ ఇన్స్పెక్టర్లు హాజరైనారు.

## నేడు గీతపనివారల సంఘం రాష్ట్ర సదస్సు

రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** నేడు హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరుగు తెలంగాణ గీత పనివారల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని గీతపనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ధర్మభిక్షం భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మెనుకబడిన గౌడ కులాలకు చెందిన ప్రజలు గీతవృత్తిలో జీవిస్తున్నారని అన్నారు. 1957లో మహబూబాబాద్ మండలం గార్ల గ్రామంలో కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం నేతృత్వంలో గీతపనివారల సంఘం ఆవిర్భవించిందన్నారు. అనాటి నుంచి అటు ఆంధ్ర ప్రాంతం ఇటు తెలంగాణ, రాయలసీమలలో గీతపనివారలను సమీకరించి కల్లుగీత వృత్తిలో కాంట్రాక్టు, హర్రాజు, విధానానికి వ్యతిరేకంగా పోరాడిందని తెలిపారు. కల్లు సొసైటిలు కావాలని, ట్రీ ఫర్ ట్యాపర్ విధానం రద్దు చేయాలని, వన పెంపకానికి భూమి, వృత్తిలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా, వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని, వృత్తి ఆధునీకరణ పరిశ్రమగా రూపకల్పన చేయాలని మహత్తర పోరాటాలు నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు సరితి తల్లిగానే వ్యవహరిస్తున్నాయని జీఓలు, సర్క్యులర్ కాగితాలకే పరిమితం అవుతున్నాయి అన్నారు. ప్రకృతి పాణ్యం కల్లు, నీరాలను ప్రోత్సహించాల్సిందిపోయి మద్యం, బెల్టుషాపు దు కాణాలు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. ఈ రాష్ట్రంలో గీత కార్మికులకు చెల్లించవల్సిన రూ.13 కోట్లకు పైగా శాంక్షన్ అయిన నిధులను విడుదల చేయకపోవడం వల్ల చెట్లపై నుండి మరణించిన కుటుంబాలు, గాయాలపాలైన కుటుంబాలు కష్టాల కడలి ఈదుతున్నారని తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని, సూర్యాపేట జిల్లాకు ధర్మబిక్షం పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో గీతకార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ దృష్టికి విద్యారంగ సమస్యలు

సిపిఐ బస్సు జాతా నాయకత్వానికి ఎఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ వినతి



**ప్రజాపక్షం/మోత్కూర్ :** విద్యారంగ సమస్యలను, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని 100 సంవత్సరాల సిపిఐ బస్సు జాత నాయకత్వానికి ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా సమితి పక్షాన వినతిపత్రం అందజేశారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రానికి చేరుకున్న సిపిఐ 100 ఏళ్ల ప్రచార బస్సు జాత నాయకత్వానికి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ అన్ని ఒకే దఫాలో విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థులకు పెరిగిన కాస్మోటిక్ చార్జీలు వెంటనే చెల్లించాలని, మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఏర్పాటుకు సహకరించాలని బస్సు జాతకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కామ్రేడ్ పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ వలి ఉల్లా ఖాద్రి, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి డిజి నరేంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పెండింగ్ స్కాలర్షిప్లు, ఫీజు రియంబర్స్మెంట్స్ చెల్లించుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యారంగ సమస్యల పరిష్కారానికి సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్, జిల్లా నాయకులు సూరారం జానీ, కళ్యాణ్, బెల్లి శ్రీకాంత్, చిప్పలపల్లి వంశి కుమార్, బన్నీ మోత్కూర్, అడ్డ గూడూరు మండల నాయకులు రాంపక చందు, సోహిత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన పోరాడేది సిపిఐ

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
డిసెంబర్ 26న ఖమ్మంలో
100 ఏళ్ల ముగింపు ఉత్సవాలు



**ప్రజాపక్షం/కోదాడ (అనంతగిరి) :** పేదల పక్షాన నిరంతరం పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి నేటికి భారత గడ్డపై 100 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో జరిగే సిపిఐ ముగిం పు ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల చరిత్రను ప్రజానీకానికి చాటేందుకు 100 ఏళ్ల ముగిం పు సభ విజయవంతానికి ఈనెల 15న గద్వాల్‌లో ప్రారంభమైన బస్సుజాత శుక్రవారం అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు జాతాకు డప్పులు, బాణా సంచాలతో పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో భారీ బైక్ ర్యాలీతో స్తూపం వద్ద అమరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటగా గర్జించిన పార్టీ సిపిఐ అన్నారు. 100 ఏళ్ల ఉత్సవాల సందర్భంగా పార్టీ ఆవిర్భవించిన కాన్పూర్‌లో గత సంవత్సరం 26న ప్రారంభమై దేశవ్యాప్తంగా ఉత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయని అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్, నారాయణరెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, ఎస్‌కె సాయిబెల్లి, ఎస్‌కె లతీఫ్, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సృజన, మండల కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శి లాలు, యువజన సంఘం అధ్యక్షులు మండలం డేగ వీరయ్య, రైతు సంఘం నాయకులు నాగేశ్వరరావు, నాగభద్రం, శాఖ కార్యదర్శి వీరబాబు, మండల కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# బిజెపి ఆర్ఎస్ఎస్ విధానాలతో కులమతాల మధ్య చిచ్చు

ఉపాధి కల్పనలో విఫలమైన
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
సిపిఐ జాతీయ కార్యవర్గ
సభ్యురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/మోటకొండూరు :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ విధానాలతో మత విద్వేషాలు సృష్టిస్తూ హిందూ ముస్లింల మధ్య అన్నదమ్ముల లాంటి సంబంధాలను చెడగొడుతూ ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నాయని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీలు అన్నారు. ఈనెల 15న ఆదిలాబాద్ జిల్లా నుండి ప్రారంభమైన సిపిఐ కళాజాతకు శుక్రవారం మండలంలోని ముత్తిరెడ్డి గూడెం, మోటకొండూరు మండల కేంద్రంలో బతుకమ్మలతో మహిళా కార్యకర్తలు, సిపిఐ శ్రేణులు బైక్ ర్యాలీలతో ఘనంగా జన నీరాజనాలతో స్వాగతం పలికారు. మొదటగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించినారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటూ నియామకాలు చేపట్టక యువకులు దొంగల్లా మారుతున్నారని గంజాయి మద్యం లాంటి డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టుల ప్రోత్బలంతో చట్టం చేసి పేద కూలీలకు వంద రోజులు పని కల్పించిందని, ప్రస్తుత బీజేపీ సర్కార్ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ క్రమంగా ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. ఉపాధి పథకం కొనసాగింపుకై గ్రామీణ ప్రాంతాలలో కార్మికులు, కర్షకులు సంఘటితం అవ్వాలని, రోజుకు రూ.700 కూలీ, ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ విధానాన్ని అమలు పరుస్తున్నాయని తిప్పికొట్టేందుకు కార్మికులు, కర్షకులు సంఘటితమై సిపిఐ పార్టీ అడుగుజాడలో సాగాలని, డిసెంబర్ 26న జరిగే ఖమ్మం బహిరంగ సభకు ప్రజలు అభిమానులు భారీగా తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి డిజి నరేంద్ర ప్రసాద్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కేతరాజు ఉప్పలయ్య, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు, యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, ఎఐటియు సి జిల్లా ప్రదాన కార్యదర్శి యండి ఇమ్రాన్, జిల్లా మహిళ సమాఖ్య కార్యదర్శి బండి జంగమ్మ, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉప్పుల శాంతి కుమార్, మండల సిపిఐ కార్యదర్శి గాదేగాని మాణిక్యం, సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల మహిళ కార్యదర్శి మంచాల రాధమ్మ, సినియర్ నాయకులు రేగు సిద్దయ్య, చెక్క వెంకటేశ్, పల్లా వెంకన్న, సూదగాని వెంకన్న, శేంషద్దీన్, శెనిగల భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చెంచుల చెంతకే

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
ఆదెమ్మ ఫిర్యాదుతో ఎమ్మెల్యే, జిల్లా అధికార
యంత్రాంగం సహా తండా సందర్శన



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సీరియస్ గా ప్రజలవద్దనుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు.ఇంతలో నల్లగొండ జిల్లా,తిరుమలగిరి సాగర్ మండలం,నెల్లికల్ చెంచు వాని తండాకు చెందిన ఆదెమ్మ ఒక పిటీషన్‌ను జిల్లా కలెక్టర్‌కు సమర్పించింది. అందులో ప్రధానంగా తమ తండా లో ఆధార్ కార్డులు, వివిధ ధ్రువపత్రాలు లేనందున తమ తాండవాసులందరూ ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నామని, మారుమూల గిరిజన ప్రాంతంలో ఉండే తమకు ప్రభుత్వలబ్ధి అందటం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సావధానంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఒక చెంచు మహిళ సుదూర ప్రాంతం నుండి నల్లగొండకు వచ్చి సమస్యలను చెప్పడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నేరుగా నెల్లికల్ చెంచు వాని తండాకే వెళ్లి చెంచు తండావాసుల సమస్యలు పరిష్కరించాలని నిర్ణయించారు.వెంటనే శుక్రవారం జిల్లా అధికారులతో సహా శాసనసభ్యులు కుందూరు జయ వీర్ రెడ్డితో కలిసి నెల్లికల్ చెంచుతాండకి చేరుకున్నారు. చెంచు వాని తాండ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,వాటి పరిష్కారానికి జిల్లా కలెక్టర్ సావధానంగా విన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదెమ్మ ప్రజావాణిలో తన దృష్టికి తీసుకొచ్చిందని, సమస్యల పరిష్కారానికి చెంచులు నల్లగొండకు వచ్చిఇబ్బందులు ఎదుర్కోకూడదన్న ఉద్దేశంతో జిల్లా అధికారులందరిని తీసుకొని తానే శాసన సభ్యులతో సహా చెంచు తాండకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. తాగునీటి బోర్ మోటర్ మరమ్మతు చేయించాలని, అలాగే ఇతర సమస్యలన్నింటిని పరిష్కరించడంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా తండాలో 72 మంది ఆధార్ అప్డేషన్ చేయగా,21 మందికి కొత్త ఆధార్ కార్డులను ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు ఆధార్, మీసేవ, ఇతర సేవలకు సంబంధించిన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.





## పేదల పక్షాన నిరంతరం ఉద్యమాలు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 26న ఖమ్మం జిల్లాలో నిర్వహించే 100 సంవత్సరాల భారీ ముగింపు సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బాసరలో నవంబర్ 15న ప్రారంభమై ఈనెల 24 వరకు జరుగుతున్న బస్సుయాత్ర సందర్భంగా మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల పక్షాన ఉండి పేద ప్రజల కోసం పోరాటాలు చేస్తుందని అన్నారు. ఎప్పటికీ పేదల పక్షాన ఉండి పేదల సమస్యలపై పోరాటం చేయడానికి భారత కమ్యూనిస్టు పార్టీ ముందుంటుందని వారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈనెల 15న రాష్ట్రవ్యాప్తంగా ప్రచార జాత ఆదిలాబాద్ బాసర నుండి బయలుదేరి మండల కేంద్రంలోకి చేరుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగోని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, చెడ చంద్రయ్య, జంగమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాలు, సుంకరి హరిచంద్ర, మండల కార్యదర్శి వెంకటేశం, దయాకర్ రెడ్డి, లక్ష్మీ నరసయ్య, సుల్తాన్ పురుషోత్తం పాల్గొన్నారు.

## దేశ విముక్తికి రాజీలేని పోరాటాలు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/గుండాల :** ఈనెల 15న ఆదిలాబాద్ జిల్లా బాసర నుండి ప్రారంభమైన సిపిఐ పార్టీ చేపట్టిన ప్రచార జాత శుక్రవారం గుండాల మండల కేంద్రానికి చేరుకుంది. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లా ఖాద్రి, రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి డిజి నరేంద్ర ప్రసాద్‌లకు సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కళాజాతకు ఘన స్వాగతం పలికారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన పార్టీ సిపిఐ అని అన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అని బ్రిటిష్ వారి నుండి దేశ విముక్తి కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్నందునే ఆనాడు పార్టీపై నిషేధం విధించారని ఆమె పేర్కొన్నారు. సిపిఐ మండల కార్యదర్శి రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్ర, రాష్ట్ర నాయకులు శ్రీరాములు, సహాయ కార్యదర్శులు చంద్రయ్య, సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ఇమ్రాన్, ప్రజానాట్యమండలి నాయకులు ఉప్పల య్య, మండల కార్యవర్గ సభ్యులు దయాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, కొమురయ్య, జోసఫ్, బక్కయ్య, సత్యనారాయణ, శ్రీను, స్వామి పాల్గొన్నారు.

## పద్మశాలీల అభివృద్ధికి సహకరించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పద్మశాలీల అభివృద్ధికి ఉద్యోగుల సంఘ సహాయ సహకారాలు అందించాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన అధ్యక్షుడు నల్ల శ్రీనివాస్ కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం పట్టణంలోని జిల్లా కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గా యేశాల విశ్వ కుమార్,అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చిలుకూరి వెంకటేశం, కోశాధికారిగా పున్న వేణుగోపాల్,ఉపాధ్యక్షులుగా మిర్యాల వేంకటపతి, రాపోలు రవి,ఆనందపు సత్యనారాయణ,బీమనపల్లి దుర్గయ్య,పొట్టబత్తుల జ్యోతి, మిర్యాల సుధాకర్,సహాయక కార్యదర్శిగా వేషాల శ్రీదేవి,గంజి నారాయణ, యేశాల శివ,గంజి వెంకన్న, గోషిక శివ కుమార్,గంజి ధనుంజయ, చేరిపల్లి శ్రీనివాస్,ప్రచార కార్యదర్శిగా గంజి నవీన్ కుమార్,ఆర్గనైజేషన్ సెక్రెటరీగా తిరందాసు సంతోష్ కుమార్, దామోదర్,గంజి ఉపేందర్,పగిడిమర్రి శివ కుమార్,దునుక జగదీశ్వర్,జెల్ల ఉమలతోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# 90 క్వింటాళ్ల సన్నబియ్యం పట్టివేత

శ్రీ విఘ్నేశ్వర ఫ్లోర్ మిల్ యజమానిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/ సూర్యాపేట:** 90 క్వింటాళ్ల ప్రజా పంపిణీ సన్న బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో శుక్రవారం పట్టుకొని సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బొడ్రాయి బజార్ నుండి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో గందూరి జానకమ్మ మెమోరియల్ స్కూల్ ఎదురుగా ఉన్న శ్రీ విఘ్నేశ్వర ఫ్లోర్ మిల్‌లో ప్రజా పంపిణీకి సంబంధించిన సన్నబియ్యం నిల్వ ఉన్నట్లు సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు గురువారం సాయంత్రం సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి తనిఖీ చేశారు. బియ్యం ఉన్నట్లుగా గుర్తించిన వారు ఈ సమాచారాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు, పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకొని 25 కేజీల బస్తాలలో నిల్వ ఉన్న సన్న బియ్యాన్ని గుర్తించారు. ఈ బియ్యం ప్రజా పంపిణీకి సంబంధించినవా లేక ఇతర బియ్యమా అని గుర్తించేందుకు బాలాజీ నగర్ లోని ల్యాబ్‌కు కొన్ని బియ్యాన్ని సేకరించి పంపించారు. ఇవి ప్రజా పంపిణీ బియ్యమే అని టెస్టింగ్‌లో తేలడంతో పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తాసిల్దార్ రాజశేఖర్ ఆ బియ్యాన్ని సీజ్ చేసి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న శివ సాయి రైస్‌మిల్లులో భద్రపరిచేందుకు ట్రాక్టర్లలో తరలించారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన ఫ్లోర్ మిల్ యజమాని రాచకొండ గణేష్ పై 6ఏ కేసును నమోదు చేశారు. అలాగే స్థానిక పట్టణ పోలీసులు 318 బి.ఎన్.ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

**ఈ ఫ్లోర్ మిల్ యజమానిది మొదటినుండి బియ్యం అక్రమ దందే**

శ్రీ విఘ్నేశ్వర ఫ్లోర్ మిల్ యజమాని రాచకొండ గణేష్ మొదటినుండి ప్రజా పంపిణి బియ్యం అక్రమ దందానే చేస్తున్నాడు. ఇతడు ప్రజా పంపిణీ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి మిల్లులో నిల్వ చేయగా అనేకమార్లు అధికారులు పట్టుకున్నారు. అతనిపై కేసులు నమోదు అయ్యాయి. ఈ అక్రమ దందాలో లాభాలు ఎక్కువగా ఉండటంతో దీనిని వదిలిపెట్టడం లేదు. గతంలో ప్రజా పంపిణీ ద్వారా అర్హులైన రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేయగా వాటిని కిలో రూ.10లకు కొనుగోలు చేసి నూకలుగా మార్చి కోళ్లదానకు రూ.25లకు అమ్మి సొమ్ము చేసుకునేవాడు. నేడు సన్న బియ్యం పంపిణీ చేయడంతో వాటిని కిలోకి రూ.14 చొప్పున కొనుగోలు చేసి 25 కేజీల బస్తాలలో ప్యాక్ చేసి క్వింటా రూ.5 వేలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. ఇతనే కాకుండా సూర్యాపేట పట్టణంలో అనేకమంది ఫ్లోర్ మిల్ యజమానులు ఈ అక్రమ బియ్యం దందాను ఏళ్ల తరబడి నుండి కొనసాగిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ అక్రమ దందాపై ప్రత్యేక దృష్టి సారిస్తే వేలాది క్వింటాల ప్రజా పంపిణీ సన్న బియ్యం పట్టుబడే అవకాశాలు లేకపోలేదు.



# రీల్



## డిసెంబర్‌లో అన్నగారు వస్తారు

స్టార్ హీరో కార్తి నటిస్తున్న తాజా చిత్రం 'వా వాతియార్' తెలుగు ప్రేక్షకుల ముందుకు 'అన్నగారు వస్తారు' టైటిల్‌తో రాబోతోంది. ఈ సినిమాను డిసెంబర్‌లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. 'అన్నగారు వస్తారు' చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా హీరో కార్తి నటిస్తున్న 'అన్నగారు వస్తారు' సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా టీజర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. కార్తి కెరీర్‌లో 'అన్నగారు వస్తారు' మరో బ్లాక్ బస్టర్ మూవీ అవుతుందనే ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి. కార్తి, కృతి శెట్టి, సత్యరాజ్, మధుర్ మిట్టల్, ఆనంద రాజ్, రాజ్ కిరణ్, శిల్పా మంజునాథ్, కరుణాకరణ్, తదితరులు నటిస్తున్నారు.



## గోవా ఫిలిం ఫెస్టివల్‌లో 'అమరన్'

ఇంటర్నేషనల్ గోవా ఫిలిం ఫెస్టివల్‌లో స్క్రీనింగ్ తమిళ సినిమా అమరన్ ఎంపిక అయింది. కార్తికేయన్, సాయి పల్లవి హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా ఒక మిలిటరీ అధికారి జీవిత కథ ఆధారంగా రూపొందించారు. తమిళ రంగంతో పాటు ఇతర భాషల్లో కూడా సక్సెస్ ఫుల్‌గా ఆడిన ఈ సినిమా ఇప్పుడు గోవాలో జరిగే అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో ఇండియన్ పనోరమా క్యేటగిరి కింద ఎంపిక చేశారు. ఇండియన్ పనోరమా కేటగిరిలో మొట్ట మొదటి సినిమాగా అమరన్ సినిమాను ప్రదర్శించనున్నారు. ఈ సినిమా ఎంపిక అయినా నేపథ్యంలో హీరో, హీరోయిన్ గోవాకు చేరుకున్నారు. వీరితో పాటు ప్రముఖ నటుడు కమల్ హాసన్ కూడా గోవా ఫిలిం ఫెస్టివల్ లో అతిథిగా పాల్గొంటున్నారు.

## ఆ క్యారెక్టర్స్ చాలా ఇష్టం

### మీడియా చిట్ చాట్‌లో భాగ్యశ్రీ బోర్సే



రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలోకి వస్తుంది. ఈ సందర్భంగా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఆంధ్ర కింగ్‌లో నేను మహాలక్ష్మి క్యారెక్టర్‌లో కనిపిస్తాను. తను కాలేజ్ గోయింగ్ గర్ల్. సాగర్ తో ప్రేమలో ఉంటుంది. అంతకుమించి ఇప్పుడు ఎక్కువ క్యారెక్టర్ గురించి రివిల్ చేయకూడదు. కథలో తన క్యారెక్టర్ చాలా ఇంపార్టెంట్. మీరు సినిమా చూస్తున్నప్పుడు మీకే అర్థమవుతుంది. ఈ క్యారెక్టర్ ఆడియన్స్ గుర్తుపెట్టుకునేలా వుంటుంది. అభిమానం అనేది డివైన్ ఎమోషన్. నేను నార్త్ నుంచి సౌత్ కొచ్చినప్పుడు ఇక్కడ అభిమానుల అభిమానం చూసిన తర్వాత ఒక స్టార్‌ని ఇంత గొప్పగా ఆరాధిస్తారో ప్రేమిస్తారో ప్రత్యక్షంగా చూశాను. అది నిజంగా చాలా గొప్ప ఎమోషన్. ఎలాంటి రిలేషన్ లేకుండా పరిచయం లేకుండా ఒక వ్యక్తిని అంతలా ఎలా అభిమానిస్తారు అనిపించేది. మహేష్ ఈ కథ చెప్పిన తర్వాత ఆ ప్రశ్నకు సమాధానం దొరికింది.ఉపేంద్రతో ఒక కాంబినేషన్ సీన్ ఉంది. ఆయన వెరీ హంబుల్ యాక్టర్. చాలా డౌన్ టు ఎర్త్. ఆయనతో వర్క్ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.ఇందులో ప్రేమ కథ చాలా స్వచ్ఛంగా ఉండబోతుంది. నువ్వుంటే చాలు, చిన్ని గుండెలో పాటలు మీరు చూసే ఉంటారు. ప్రేమలో ఉన్న గొప్ప ఎమోషన్ ఇందులో ఉంటుంది. రామ్‌తో నటించడం అద్భుతమైన అనుభవం. వెరీ ఎనర్జిటిక్ పెర్ఫార్మర్. ఆయన ఎనర్జీ మ్యాచ్ చేశానని అనుకుంటున్నాను. లవ్ స్టోరీ, డైలాగ్స్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంటాయి. రామ్ చాలా పాజిటివ్‌గా ఉంటారు. సినిమా ఆల్బమ్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పాటలన్నీ ఇష్టం. అయితే నాకు ఫేవరెట్ నువ్వుంటే చాలు. ఇది 2000లో జరిగే కథ, డైరెక్టర్ కాస్ట్యూమ్స్, ఆర్ట్ వర్క్ అన్నిటి పరంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు.ఇందులో ఒక ఇంపార్టెంట్ సీన్ ఉంది. డైరెక్టర్ చేసి చూపించారు. నేను ఎలా అనుకుంటున్నానో చేసి చూపిస్తానని డైరెక్టర్‌కు రిక్వెస్ట్ చేశాను. నేను చేసింది అందరికీ నచ్చింది. అంత క్రియేటివ్ స్పేస్ ఇవ్వడం నాకు చాలా ఆనందంగా అనిపించింది. రవి, నవీన్ నేను కలిసిన ఫస్ట్ ప్రొడ్యూసర్సు. వాళ్లతో వర్క్ చేయాలని ఎప్పటినుంచో ఉంది. ఈ సినిమాతో వారితో కలిసి పనిచేయడం చాలా ఆనందాన్నిచ్చింది. చాలా పాషన్ ప్రొడ్యూసర్స్. ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాని తీశారు. ఒక షెడ్యూల్ కోసం రాజమండ్రి వెళ్ళాం. అక్కడ చాలా వేడిగా ఉంది. అయితే ఒక టీంగా సినిమా కోసం వర్క్ చేయడంలో చాలా ఎంజాయ్ చేశాం. నాకోసం ఎలాంటి కథలు రాసిపెట్టి ఉన్నాయో నాకు తెలియదు. అయితే వచ్చిన ప్రతి క్యారెక్టర్‌కి వంద శాతం ఇచ్చి ఒక వెర్సటైల్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకోవాలని ఉంది. అనుష్క అరుంధతిలో చేసినటువంటి క్యారెక్టర్స్ చాలా ఇష్టం. అలాంటి పాత్రలు నాకు వస్తాయని ఆశిస్తున్నాను.

## నన్ను కామెడీ ఆర్టిస్ట్‌గా నిలబెట్టింది

### విజయ్ భాస్కర్



తెలుగు సినిమా రంగంలో తన దైన శైలీలో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్న నటుడు విజయ్ భాస్కర్. ఇరవైయేళ్ళుగా సినిమా రంగంలో ప్రయాణం చేస్తూనే ఉన్నా విజయ్ భాస్కర్‌కు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న మంచి కమర్షియల్ హిట్ ఇప్పుడు వచ్చింది. హీరోగా, విలన్‌గా, సపోర్టింగ్ యాక్టర్‌గా ఇలా అన్ని రకాల పాత్రలు చేస్తూ ఇండస్ట్రీలో తనకంటూ ఒక పేజీని ఏర్పరచుకున్నారు. సినిమా ఇండస్ట్రీలో ఉన్న ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా ఉంటూ అవకాశాలు దక్కించుకుని ఎదిగాడు. ఇప్పుడు అల్లరి రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏనుగుతొండం ఘటికాచలం' సినిమా సినిమాతో మాంచి కమర్షియల్ హిట్ అందుకున్నారు విజయ్ భాస్కర్. ఏనుగుతొండం ఘటికాచలం సినిమా ఈటివి విన్ లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ మీడియాతో చిట్ చాట్ చేశారు. ఏనుగు తొండం ఘటికాచలం సినిమాలో విజయ్ భాస్కర్ తొలిసారిగా కామెడీ నటుడిగా కనిపించారు. ఇంతవరకు చేసిన హీరోగా, విలన్, సపోర్టింగ్ క్యారెక్టర్స్ కంటే కూడా ఇందులో కమెడియన్‌గా మెప్పించాడని చెప్పవచ్చు. ఏనుగు తొండం ఘటికాచలం సినిమాలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో కనిపించారు విజయ్ భాస్కర్. ఈటివి విన్‌లో ఈ సినిమాను చూసి విజయ్ భాస్కర్‌ను పలకరిస్తే .... అనేక విషయాలు చెప్పుకొచ్చారు. నా జీవితంలో చేసిన మొట్ట మొదటి టివి సీరియల్ 'లేడి డిటెక్టివ్'. ఈ సీరియల్ ఈటివిలో ప్రసారం అయింది. ఇందులో చిన్న రోలె చేసినప్పటికీ చాలా మంచి పేరు వచ్చింది. నా తొలి చిత్రం'16 టీన్స్' ఈటివి సంస్థలో వచ్చింది. నా మొదటి ఓటిటి చిత్రం 'ఏనుగుతొండం ఘటికాచలం' ఈటివి విన్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. తన కెరీర్ లో మొదటి సీరియల్, సినిమా, చివరికి ఓటిటి సినిమా కూడా ఈటివి తోనే జర్నీ స్టార్ట్ కావడం చాలా సంతోషంగా ఉందని విజయ్ భాస్కర్ అంటున్నారు. ఈటివి సంస్థ నిర్మించిన 'ఆనందం' సినిమాలో ఒక మంచి రోల్ చేశాను. ఈ సినిమా సూపర్ హిట్టయింది. దీంతో వంద రోజుల ఫంక్షన్‌లో ఈటివి అధినేత రామోజీ రావు గారి చేతుల మీదుగా షీల్ అందుకోవడం నా జీవితంలో మరచిపోలేని రోజుగా గుర్తుండిపోయింది. నేను నటించిన మరో చిత్రం 'నా మనసుతో' సినిమా కూడా ఈటివి వల్లే కొన్నారు. సినిమా రంగంలో నా ఎదుగుదలకు ఈటివి ఎంతో తోడ్పడింది. ఇప్పుడు ఏనుగుతొండం ఘటికాచలం సినిమాను కూడా ఈటివి విన్ తీసుకోవడం నిజంగా నాకు చెప్పలేనంత సంతోషంగా ఉంది. ఈ సినిమాను తెరకెక్కించిన రవిబాబు గారికి, ఈ సినిమాను స్ట్రీమింగ్ చేస్తున్న ఈటివి యాజమాన్యానికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.




## 23న రాజా సాబ్ పాట విడుదల

ప్రభాస్ హీరోగా మారుతీ దర్శకత్వంలో పీపుల్స్ మీడియా బ్యానర్‌పై నిర్మిస్తున్న సినిమా రాజా సాబ్ విడుదలకు ముస్తావుతోంది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ మొదలు పెట్టిన దర్శక నిర్మాతలు తాజాగా ఓ పాటను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 23న రాజా సాబ్ పాటను విడుదల చేయనున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ సరసన ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహన్, రిధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వినోదాత్మకమైన ప్రేమకథగా తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ కథలో సస్పెన్స్, హర్రర్ కూడా జోడించారు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బొమ్మను ఇరానీ, మరో కీలకపాత్ర పోషిస్తున్నారు. థమన్ సంగీతం అందించిన ఈ సినిమాకు సంబధించిన అన్ని పనులు పూర్తి చేసి జనవరి 9వ తేదీన సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## డిసెంబర్ 12నే మోగ్లీ విడుదల



రోషన్ కనకాల తొలి చిత్రం బబ్లుగం సక్సెస్ కాకపోయినా రెండో ప్రేమకథగా వస్తున్న మోగ్లీ 2025 పై రోషన్ భారీగానే ఆశలు పెట్టుకున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, కలర్ ఫోటో ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామా. ఈ సినిమా గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. హాయిగా సంతోషంగా జీవితాన్ని గడపాలనుకునే యువకుడు మోగ్లీ. ఓ అందమైన అమ్మాయిని ప్రేమించిన తర్వాత అతని ప్రపంచం ఒక మలుపు తిరుగుతుంది. రామసీతల ప్రేమకథలా వీరిద్దరి ప్రేమ కూడా అందంగా ఉంటుంది. వీరి సంతోషంలో రాక్షసుడు లాంటి పోలీస్ ఆఫీసర్ ఎంటరౌతాడు. దీంతో అంతా యుద్ధ భూమిగా మారుతుంది. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ మైథాలజీ ఫీల్ మోడరన్ ఎమోషన్‌తో మిళితం చేస్తుంది. సినిమాటోగ్రాఫర్ రామ మారుతి ఎం అద్భుతమైన విజువల్స్ అందించారు.




# దేశంపై మతోన్మాద భూతం

(మొదటి పేజీ తరువాయి)

బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టు నేతలను హతమార్చడం సరైంది కాదని, శాంతి చర్చలకు సిద్ధమని చెబుతున్నప్పటికీ ఈ మారణహోమానికి తెగబడటం పైచాచికమని, మావోయిస్టుల హత్యలపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలు ఆచరణీయమైనవని, మనుష్యులను హతమార్చినంత మాత్రాన సిద్ధాంత పునాదులను కదిలించలేరన్నారు. సిపిఐ భారతదేశంలో ఆవిర్భవించి వందేళ్ళవుతోందని, భారత స్వతంత్ర సంగ్రామంలో కూడా తనదైన పాత్ర పోషించి స్వదేశ కాంక్ష రగిలించిందని గుర్తు చేశారు. ఈ వందేళ్లపాటు ప్రజా సమస్యల పరిష్కారం, పేదలు, కార్మికులు, రైతుల పక్షాన నిరంతర పోరాటాలు సాగించిన ఘనత సిపిఐదే అన్నారు. మరో వందేళ్లయినా ప్రజా క్షేత్రంలో మనగలమని, ఇదే స్ఫూర్తితో నిరంతర పోరాటాలు నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం మరిన్ని బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం కేంద్రంగా సిపిఐ శతవసంత ఉత్సవ ముగింపు సభ ఐదు లక్షల మందితో జరగనుంది. ఈ ముగింపుకు 45 దేశాల నుండి ప్రతినిధులు తరలివస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిస్టుల పనైపోయిందని అవాకులు చెవాకులు పేలే వారికి ఈ వేడుక కనువిప్పు కావడంతో పాటు దేశ చరిత్రలోనే ఓ మైలురాయిగా మిగిలిపోతుందని చెప్పారు. దీనిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా బస్సు జాతాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ జాతా శనివారం భద్రాచలంలో ముగుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనీల్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠారెడ్డి, రాష్ట్ర నాయకులు రెహమాన్, లక్ష్మీనారాయణ, మనరాటి ప్రసాద్, అడుసుమెల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, సుధాకర్, నిమ్మల రాంబాబు, విశ్వేశ్వరరావు, పద్మజా, సుంకిపాక ధర్మ, జి రామకృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.




# ఐక్యత అనివార్యం

(మొదటి పేజీ తరువాయి)

దర్పాన్ని ప్రదర్శిస్తోందని, దేశంలో ఓటాన్ అకౌంట్ పద్ధతి ప్రవేశపెట్టాలన్నారు. సిపిఐది దేశంలో వందేళ్ల ఘన చరిత్ర అని, ఆ నాటి నుండి నేటి వరకు ప్రజలతో మమేకంపై ఉన్న ఏకైక పార్టీ అని చెప్పారు. దేశస్వాతంత్ర్య సమరంలో ప్రజలను చైతన్య పరుస్తూ బ్రిటీష్ సామ్రాజ్య వాదుల నుండి దేశాన్ని దక్కించుకునేందుకు చారిత్రాత్మక పాత్ర పోషించిందన్నారు. ఇంతటి కీర్తి గల సిపిఐ చరిత్ర, త్యాగాలు, పోరాటాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అమరుల త్యాగాల స్ఫూర్తి మరో వందేళ్ల పాటు ప్రజాక్షేత్రంలో పోరాట పటిమతో మందుకు సాగుదామని చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో అడవుల్లో ఉన్న సహజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు మోడి సర్కార్ మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తోందని, వారిని ముందుగానే పట్టుకుని చిత్రహింసలకు గురిచేసి అతిదగ్గిరి నుండి కాల్చి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులను పతనం చేయాలని చూసిన వారు ఎందరో కాలగర్భంలో కలిసిపోయారని, దౌర్జన్యాలు, హత్యలకు పాల్పడుతూ వ్యక్తులను చంపినా ఉద్యమ శక్తి బ్రతికే ఉంటుందన్నారు. తాము లొంగిపోతామని పదే పదే మావోయిస్టులు చెబుతున్నప్పటికీ తాము విధించిన 2026 మార్చి నెలాఖ గడువునాటికి అంతం చేస్తామని బహిరంగ ప్రకటనలు చేస్తూ చంపడమే ధ్యేయంగా పెట్టుకున్నారని మండిపడుతున్నారు. ప్రక్కనే ఉన్న పాకిస్థాన్‌తో శాంతి చర్చలకు అంగీకరించిన వారు మన దేశ పౌరులతో ఎందుకు చర్చలకు ఒప్పుకోరని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం ఎన్‌కౌంటర్ల పేరిట సాగిస్తున్న హత్యలపై న్యాయవిచారణ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, ఎం బాలనర్సింహా మాట్లాడుతూ.. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సాగుతున్న ప్రచారజాత కొత్తగూడెంతో ముగిసిందని, డిసెంబర్ 26న ఉద్యమాల ఖిల్లా ఖమ్మం జిల్లా కేంద్రంలో ఐదు లక్షల మందితో జరిగే శతవసంత ముగింపు సభను జయప్రథం చేయాలని, ఇందు కోసం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున కృషి చేయాలని కోరారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ఖమ్మం జిల్లాకార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ.. ఈ వేడుకకు 45 దేశాల నుండి ప్రతినిధులు, దేశవిదేశాల నుండి కవులు, కళాకారులు, మేధావులు తరలివస్తున్నారన్నారు. జరగనున్న ఈ వేడుక దేశచరిత్రలోనే సువర్ణ అధ్యాయంగా మిగిలిపోనుంది. కమ్యూనిస్టుల పని అయిపోయింది అంటూ అవాకాలు చెవాకులు పేలిన వారి నోళ్లు మూతపడేలా, కనీవినీఎరుగరని రీతిలో ఈ శతవసంత ముగింపు సభ జరగనుందన్నారు. చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళీ, సలిగంటి శ్రీనివాసరావు, భూక్యా ధ్రసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నాయకులుల కంచర్ల జమలయ్య, జి వీరస్వామి, కందుల భాస్కర్, చంద్ర నరేంద్రకుమార్, ఎస్‌కే ఫహీమ్, కొమారి హన్మంతరావు, గెద్దాడు నగేష్, వంగా వెంకట్, వట్టికొండ మల్లిఖార్జునరావు, ఎస్‌వి రమణమూర్తి, నెరేళ్ల రమేష్, కె రత్నకుమారి, మాచర్ల శ్రీనివాస్, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిడుగు శ్రీను, మునిగడప వెంకన్న, బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాణచారి తదితరు పాల్గొన్నారు.

## బెట్టింగ్ యాప్‌లో సిఐడి విచారణకు శ్రీముఖి, నిధి, అమృత



ప్రజాపక్షం/హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు రాష్ట్రంలో సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో టాలీవుడ్ హీరోయిన్ నిధి అగర్వాల్, ప్రముఖ యాంకర్ శ్రీముఖి, అమృత చౌదరిలు శుక్రవారం సిఐడి విచారణకు హాజరయ్యారు. ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు సెలబ్రిటీలు ఎంత డబ్బు తీసుకున్నారు, ఆ యాప్స్ నడిపిన వ్యక్తులతో వారి సంబంధం ఏమిటి, డబ్బుల లావాదేవీలు ఎలా జరిగాయి అనే విషయాలపై సిఐడి అధికారులు వారిని ప్రశ్నించినట్టు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే టాలీవుడ్ ప్రముఖ నటులు రానా దగ్గుబాటి, ప్రకాశ్ రాజ్‌తో పాటు మరికొంతమంది సెలబ్రిటీలను సిఐడి విచారించింది. అక్రమ ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు సెలబ్రిటీలపై చర్యలు తీసుకునే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ యాప్స్ ద్వారా పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిని ప్రచారం చేసిన సెలబ్రిటీల పాత్రను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు.

# మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులే

**మూసీ ప్రక్షాళన వెంటనే చేపట్టాలి**

**పశ్య పద్మ**



ప్రజాపక్షం/వలిగొండ : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈనెల 15న రాష్ట్రవ్యాప్తంగా ప్రచార జాత ఆదిలాబాద్ బాసర నుండి బయలుదేరి శుక్రవారం ఉదయం 10 గంటలకు వలిగొండ మండల కేంద్రంలోకి చేరుకుంది. ఈ జాతాకు నాయకత్వం వహించిన పశ్య పద్మ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ వలి ఉల్లా ఖాద్రి, రాష్ట్ర రైతు సంఘం ఉప కార్యదర్శి డిజి నరేంద్ర ప్రసాద్‌లకు పూలమాలవేసి వలిగొండ సిపిఐ మండల సమితి ప్రజా సంఘాలు స్వాగతం పలికాయి. అనంతరం మండల కేంద్రంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ ప్రజల హక్కులు సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐకి ఉన్నదని పోరాటాల ద్వారా అనేక హక్కులను చట్టాలను సాధించుకున్నామని వివరించారు. ఎన్నికల కమిషన్ నుంచి అన్ని సంస్థలను బిజెపి ప్రభుత్వం తమకు అనుకూలంగా లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. దేశంలోని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజలను విచ్ఛిన్నకరం చేస్తున్నారన్నారు. మేధావులపై దాడి చేస్తున్నారని, ప్రశ్నించే గొంతులను ఉద్యమకారులను అక్రమ కేసులతో నిర్బంధిస్తున్నారన్నారు. మావోయిస్టు పార్టీ నాయకులను పట్టుకొని కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అంటూ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని, బూటకపు ఎన్‌కౌంటర్లు బిజెపి చేస్తున్న మానవ హననానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులు రోడ్లపైకి రావాలని అన్నారు. మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగోని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, వేషాల అశోక్, ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి సరిగంజి వీరస్వామి, సిపిఐ ఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, బీసీ సంఘం జిల్లా నాయకులు సాయిని యాదగిరి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శీలం స్వామి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, రామన్నపేట మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ, పోచంపల్లి మండల కార్యదర్శి గోడల నాగభూషణ్, నాయకులు ఎలగందుల అంజయ్య, సల్వాద్రి రవీందర్,బాలగోని సత్యనారాయణ, పోలే పాపీక యాదయ్య, నరిగ యాదయ్య, కట్ల యాదగిరి, సాయికుమార్, మారోజు నరసిమాచారి, కనక పోయిన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక నిధులు కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయని యాదవ్ చెప్పారు. అధిక ఖర్చులు, తగినంత సంస్థాగత సామర్థ్యం లేకపోవడం వంటి సమస్యలు ఆయా దేశాలను వెంటాడుతున్నాయని చెప్పారు. కాగా, భారత్ తన జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రణాళికల ద్వారా 'పర్యావరణ అనుకూలత'ను ప్రధాన ప్రవాహంగా మార్చి, దేశీయ వనరుల మద్దతుతో ముందుకు తీసుకెళ్తోందని యాదవ్ వివరించారు. జిడిపితో పోలిస్తే, భారతదేశం ఈ చర్యలకు సంబంధించిన వ్యయం 2016–17 నుంచి 2022–23 వరకు 150 శాతం పెంచిందని పేర్కొన్నారు. కాప్30లో తీసుకున్న ముఖ్య నిర్ణయాలను ప్రస్తావిస్తూ, వాతావరణ అనుకూలత, కాలుష్య నియంత్రణ అనే రెండు ప్రధాన అంశాలు పారిస్ ఒప్పందంలోని పరస్పరపూరక స్తంభాలని వ్యాఖ్యానించారు. కాప్31 సదస్సు ప్రారంభానికి, గతంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసే దిశగా బలమైన అడుగులు పడాలని ఆయన సూచించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధుల అందుబాటును సులభం చేయడం, లావాదేవీ ఖర్చులను తగ్గించడం , గ్రాంట్ల రూపంలోనే నిధులు ఇవ్వడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు.

# రాజ్యాంగాన్ని సవరించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నేతలు, కుల సంఘాల అధ్యక్షులు, మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, విద్యార్థి, యువజన సంఘాల నేతలు, మహిళ నేతలతో పాటు ముఖ్య అతిథులుగా మాజీ గవర్నర్ దత్తాత్రేయ, మాజీ ఎంపి వి.హనుమంతరావు, జస్టిస్ చంద్రకుమార్, డైరెక్టర్ శంకర్, తెలంగాణ విఠల్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా బిసి రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు బిసి జెఎసి చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్‌ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బిసి జెఎసి ప్రకటించింది. బిసి రిజర్వేషన్ల సాధన కోసం బిసి జెఎసి ఆధ్వర్యంలో అష్టాంగ ఆందోళన కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 25న రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దగ్ధం, 30న బిసిల రాజకీయ యుద్ధభేరి పేరుతో ఛలో హైదరాబాద్, డిసెంబర్ 8, 9 తేదీలలో ఛలో ఢిల్లీ పేరుతో పార్లమెంట్ ముట్టడి తదితర ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. చట్టబద్ధమైన 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయకుండా నిర్వహించే ఎన్నికలను తక్షణమే నిలిపివేయాలని, బిసి రిజర్వేషన్ల అంశంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బిసి సంఘాలు, మేధావులతో చర్చించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానితో రిజర్వేషన్లపై చర్చించడంతో పాటు డిసెంబర్ 1వ తేదీ నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాలలో కాంగ్రెస్ పార్టీ నుంచి బిసి రిజర్వేషన్లపై ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com